RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత్ శక్తి®

తెలుగు దినపత్రిక
VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక:250 హైదరాబాద్, మంగళవారం, 6 మే 2025 పేజీలు: 12 వెల: 1.00

## సహకరించాల్సిన ఉద్యోగ సంఘాలే 'సమరం' అంటే ఎలా?: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ప్రభుత్వంపై సమరమే అంటూ ఉద్యోగ సంఘాలు ప్రకటించడంపై సీఎం రేవంత్‌రెడ్డి ( మండిపడ్డారు. మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా సమరం చేస్తారు? అని ప్రశ్నించారు. తనను కోసినా సరే.. వచ్చిన ఆదాయానికి మించి



ఖర్చు చేయలేనని సీఎం స్పష్టం చేశారు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన తీవ్ర ఆవేదనతో మాట్లాడారు.

"ఇక సమరమే అని ఉద్యోగ సంఘాలు ప్రకటిస్తున్నాయి. మీ సమరం తెలంగాణ ప్రజలపైనా?మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా?. కొన్ని రాజకీయ పార్టీలు మాపై ఆరోపణలు చేస్తున్నాయి. ఉచిత విద్యుత్ పేరుతో విద్యుత్ బకాయిలు పెట్టి వెళ్లారు. ప్రభుత్వం అంటే మేం ఒక్కరమే కాదు.. మనమంతా కలిస్తేనే ప్రభుత్వం. మనం పాలకులం కాదు.. సేవకులం. ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే సహకరించాల్సిన ఉద్యోగ సంఘాలే సమరం అంటున్నాయి. ప్రజలు కష్టాల్లో ఉంటే అండగా ఉండాల్సిన బాధ్యత ఉద్యోగ సంఘాలపై లేదా? సమస్య ఉంటే చర్చించుకుందాని ఉద్యోగ సంఘాలకు విజ్ఞప్తి చేస్తున్నా.

ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని రాజకీయ పార్టీలు కుట్ర చేస్తున్నాయి. వారి కుట్రలో ఉద్యోగ సంఘాలు పావులుగా మారొద్దు. కొత్త కోరికలతో ధర్నాలు చేస్తే ఉన్న వ్యవస్థ కుప్పకూలుతుంది. ఉద్యోగ సంఘాలు బాధ్యత మరిస్తే సమాజం సహించదు. అప్పులు పుట్టినా ఏదైనా చేయొచ్చు. కానీ, ఎక్కడా అప్పు పుట్టట్లేదు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది.. స్వీయ నియంత్రణే పరిష్కారం. ప్రభుత్వం మన కుటుంబం.. కుటుంబం పరువును బజారున పడేయొద్దు. ఇప్పుడు కావాల్సింది సమరం కాదు.. సమయస్ఫూర్తి, సంయమనం. తెలంగాణను మళ్లీ కోతుల గుంపునకు అప్పగించొద్దు. నాతో కలిసి రండి.. తెలంగాణను అభివృద్ధి పథంలో తీసుకెళ్దాం." అని రేవంత్‌రెడ్డి అన్నారు.

సరిహద్దుల్లో సైనికుల్లా తెలంగాణ పోలీసులు రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయి కాబట్టే.. తెలంగాణ రాష్ట్రం ప్రపంచస్థాయి పెట్టుబడులను ఆకర్షించగలుగుతోందన్నారు. విధినిర్వహణలో చనిపోయిన పోలీసుల కుటుంబాలకు భరోసా ఇస్తున్నామని చెప్పారు. విధినిర్వహణలో మరణించిన ఐపీఎస్‌ల కుటుంబాలకు రూ.2 కోట్లు, అదనపు ఎస్పీ, ఎస్పీ కుటుంబాలకు రూ. కోటిన్నర ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. నేరం జరగకుండా నియంత్రించే బాధ్యత పోలీసులపై ఉందని చెప్పారు.

## భూ ప్రకంపనలు.. పరుగులు తీసిన ప్రజలు

కరీంనగర్, మే 05: ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా భూప్రకంపనలు సంభవించాయి. జగిత్యాల, వేములవాడ, కరీంనగర్ ప్రాంతాల్లో ఒక్కసారిగా భూమి కంపించింది. ధర్మపురి,



సిరిసిల్ల, సుల్తానాబాద్?లోనూ ప్రకంపనలు వచ్చాయి. రిక్టర్ స్కేలుపై 3.5గా భూకంప తీవ్రత నమోదైంది. దాదాపు ఐదు సెకన్లపాటు భూమి కంపించడంతో ప్రజలు తీవ్రభయాందోళనకు గురయ్యారు. ఇళ్లలోని సామగ్రి సైతం కదిలిపోవడంతో ఏ జరుగుతుందో అర్థంకాక భయంతో బయటకు పరుగులు తీశారు. ఉమ్మడి జిల్లాలో నాలుగు నెలల వ్యవధిలో ఇలా భూమి కంపించడం రెండోసారి కావడంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మరి ముఖ్యంగా చొప్పదండి, గంగాధర, రామడుగు మండలాల్లో కొన్ని సెకన్ల పాటు ప్రకంపనలు వచ్చాయి. అలాగే నిర్మల్ జిల్లాలోనూ పలు చోట్ల భూప్రకంపనలు చోటుచేసుకున్నట్లు సమాచారం.

%మరోవైపు పాకిస్థాన్‌లో సైతం భూకంపం సంభవించింది. ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.2గా రికార్డయింది. సోమవారం సాయంత్రం 4 గంటలకు భూమి ప్రకంపించినట్లు జాతీయ భూకంపం సంస్థ వెల్లడించింది. ఖైబర్ ఫక్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో ఛిత్రాల్ జిల్లాలో ఈ భూకంపం సంభవించిందని స్థానిక మీడియా వెల్లడించింది. భూ ఉపరితలం నుంచి 10 కిలోమీటర్ల దిగువన ఈ భూమిలో కదలికలు చోటు చేసుకున్నాయని తెలిపింది. ఆఫ్ఘనిస్తాన్, తజకిస్తాన్ సరిహద్దుల్లో ఛిత్రాల్ జిల్లా ఉంటుంది. ఈ భూప్రకంపనలు రెండు దేశాల్లో నమోదయ్యాయి. భూకంపం సంభవించిన వెంటనే స్థానికులు తీవ్ర భయాందోళనలతో ఇళ్లల్లో నుంచి బయటికి పరుగులు తీశారు.

## మంత్రులకు మీనాక్షి మార్క్ క్లాస్

హైదరాబాద్, మే 5,

తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ అధిష్టానం రకరకాల ప్రయత్నాలు చేస్తోంది. నేతల మధ్య సమన్వయం చేస్తూ పార్టీని బలోపేతం చేసే బాధ్యతలను అధిష్టానం రాష్ట్ర మంత్రులకు అప్పగించింది. ప్రభుత్వ పరిపాలనా వ్యవహారాలతో పాటు పార్టీకి సంబంధించిన అంశాలను కూడా పరిగణలోకి తీసుకోవాలని సూచించింది. దీనిపై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాష్ట్రంలోని ఉమ్మడి 10 జిల్లాల ఆధారంగా మంత్రులకు ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు.ఆయా జిల్లాకు సంబంధించి పాలనా వ్యవహారాలను చక్కదిద్దే బాధ్యత ఇంచార్జ్ మంత్రులదే అని సీఎం ఆదేశించారు.ఎమ్మెల్యేలతో పాటు నియోజకవర్గ ఇంచార్జ్ లను సమన్వయం చేసుకొని ముందుకు నడవాలని మంత్రులకు ఆదేశాలిచ్చారు. అయితే ఈ విషయంలో మంత్రులు మాత్రం ఇంచార్జ్ గా ఉన్న జిల్లాల విషయంలో తూతూ మంత్రంగా పర్యటిస్తూ..ఏ మాత్రం పట్టించుకోవడంలేదట. పై నుంచి ఆదేశాలు ఇచ్చినప్పుడు మాత్రమే..ఆ సమయానికి ఒకట్రెండు సమావేశాలు పెట్టి మమా అనిపిస్తున్నారట.జిల్లాల్లో పార్టీ బలోపేతం కావాలంటే మంత్రులు కచ్చితంగా వారికి కేటాయించిన జిల్లాల్లో తరచూ పర్యటనలు చేయాలని ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇంచార్జ్ కేసీ వేణుగోపాల్ స్వయంగా గాంధీభవన్‌లో సమావేశం పెట్టిమరీ స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలతో పాటు నేతలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలని కేసీ ఆదేశించారు. ఆ తర్వాత కొత్తగా వచ్చిన ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా ఒకట్రెండు సార్లు ఇదే విషయం స్పష్టం చేశారు.ఇదే అంశంపై సీఎం రేవంత్ రెడ్డి మంత్రులకు క్లాస్ కూడా తీసుకున్నారని సమాచారం. ఇంచార్జ్ ఇచ్చిన జిల్లాల్లో ఎమ్మెల్యేలను ఎందుకు సమన్వయం చేసుకోవడం లేదని గట్టిగా నిలదీశారు. ఈ సందర్భంగా ఒకట్రెండు సార్లు మాత్రమే ఉమ్మడి జిల్లాల వారీగా మంత్రులు సమావేశాన్ని ఏర్పాటుచేస్తే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని గట్టిగానే నిలదీశారట.ఆయా జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల ఎజెండా ఏంటనే దానిపై సీఎం నివేదికలు కూడా తీసుకున్నారు. అయితే ఆ నివేదికల్లో మంత్రులు పరిష్కరించిన అంశాల గురించి వివరాలేవీ సీఎంకు కన్పించలేదంట. దీంతో అసలు మంత్రులు జిల్లాల్లో పర్యటించడంలేదన్న విషయం అటు పార్టీ హైకమాండ్ కు ఇటు సీఎం రేవంత్ రెడ్డికి స్పష్టంగా అర్థమైందట.పార్టీ



హైకమాండ్ ఆదేశించినా..సీఎం రేవంత్ పదే పదే చెప్పినా ఇన్‌చార్జ్ మంత్రుల తీరు మాత్రం మారడంలేదట. కొత్త ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా మంత్రుల తీరుపై అసంతప్తి వ్యక్తం వ్యక్తం చేశారట. మంత్రులు ఇలాగే వ్యవహరిస్తే..పార్టీ పరిస్థితి ఏంటనే దానిపై సమాలోచనలు చేస్తున్నారట. త్వరలో రానున్న లోకల్ బాడీ ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కోవడంపై ప్లానింగ్, జిల్లాల్లో ముఖ్యనేతల మధ్య ఉన్న గొడవలు సద్దుమణిగేలా చేయడంలో మంత్రులు పూర్తిగా విఫలమవుతున్నారంటూ పార్టీ అధిష్టానానికి నివేదికలు అందాయట.ఈ మధ్య కాలంలో ఉమ్మడి మహబూబ్‌నగర్, మెదక్, కరీంనగర్ జిల్లాల అంశాలను ఉదహరిస్తున్నారట. మరీ ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన పది మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో సమస్యలు తీవ్రతరమవుతున్నా పట్టించుకోవడం లేదట. పటాన్‌చెరు, గద్వాల,కరీంనగర్ లో నేతలు బాహాబాహికి దిగినా..మంత్రులు రంగంలోకి దిగి సమన్వయం చేయడంలో పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి.అయితే మంత్రులు వారి వారి సొంత జిల్లాలు, సొంత నియోజకవర్గాల్లో పర్యటిస్తూ అక్కడి సమస్యలపైనే ఫోకస్ పెడుతున్నారని హస్తం పార్టీనేతల్లో చర్చ నడుస్తోంది. ఆయా జిల్లాల్లో జరిగే అభివృద్ధి పనులను చేయించుకోవడం, అక్కడి పైరవీలపైనే దృష్టి పెడుతున్నారంటూ పార్టీ క్యాడర్లో టాక్

విన్పిస్తోంది. ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మంత్రుల విషయంలో పార్టీ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు పార్టీలో హాట్ టాఫిక్‌గా మారింది.

## హైదరాబాద్‌లో పైవంతెనలను ప్రారంభించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

హైదరాబాద్: నగరంలోని అంబర్‌పేట, బీహెచ్‌ఈఎల్ కూడలిలో నిర్మించిన పైవంతెనలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించారు. రోడ్ల నిర్మాణం కోసం పెండింగ్‌లో ఉన్న భూసేకరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. అంబర్‌పేటలో



ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ ఫ్లైఓవర్ పనులు సరిగా జరగడం లేదన్నారు. అందుకే పనులు వేగంగా చేసేలా కొత్త కాంట్రాక్టర్‌ను మార్చామని, పది నెలల్లో ఉప్పల్ ఫ్లైఓవర్ పూర్తి చేస్తామని చెప్పారు.

"హైదరాబాద్‌లో ఐటీతోపాటు ఫార్మా రంగం కూడా పెద్దదే. దేశంలోని ఎన్నో నగరాల నుంచి హైదరాబాద్‌కు వస్తుంటారు. అన్ని ప్రధాన నగరాలను హైదరాబాద్‌కు కనెక్ట్ చేసేలా జాతీయ రహదారులు అభివృద్ధి చేశాం. తెలంగాణ అభివృద్ధికి మోదీ నేతృత్వంలో మేమంతా కట్టుబడి ఉన్నాం. ఇండోర్‌- హైదరాబాద్ కారిడార్ తెలంగాణ పనులు పూర్తి చేశాం. మహారాష్ట్రలో కూడా పనులు త్వరితగతిన పూర్తి చేస్తాం. ఈ కారిడార్ పూర్తయితే 20 గంటల ప్రయాణం 10 గంటల్లోనే చేయొచ్చు. హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. హైదరాబాద్ - విజయవాడ 4 లైన్ల రోడ్డును 6 లైన్లుగా మారుస్తాం.

నాగ్‌పూర్‌లో డబుల్ డెక్కర్ ఎయిర్ బస్ అందుబాటులోకి తెచ్చాం. హైదరాబాద్ రింగ్ రోడ్డుపై ఈ ఎయిర్ బస్‌ను నడిపి చూడాలని తెలంగాణ మంత్రులను కోరుతున్నా. డీజిల్, పెట్రోల్ వాహనాలను తగ్గించి.. సీఎన్‌జీ, ఎలక్ట్రికల్ వాహనాలను ప్రోత్సహించాలి. రైతన్నలు వ్యవసాయంలో కూడా పర్యావరణహిత వాహనాలను వాడాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ఒక్క స్మార్ట్ నగరాలతో దేశం అభివృద్ధి చెందదు.. స్మార్ట్ గ్రామాలు కావాలి" అని గడ్కరీ పేర్కొన్నారు. అంబర్‌పేట పైవంతెనను రూ.145 కోట్లతో, నాలుగు వరుసల్లో సుమారు 1.5 కి.మీ మేర నిర్మించగా.. చందానగర్ నుంచి బీహెచ్‌ఈఎల్ మీదుగా రామచంద్రాపురం వరకు రూ.176 కోట్లతో 1.6కి.మీ మేర బీహెచ్‌ఈఎల్ వంతెనను నిర్మించారు.

రాష్ట్ర మంత్రులు ఆ ఆరు ప్రాంతాల్లో భూసేకరణ పూర్తి చేయాలి

నితిన్ గడ్కరీ కృషి వల్ల ఏ గ్రామానికి వెళ్లినా జాతీయ రహదారులు కనిపిస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు, మరణాలు తగ్గాయన్నారు. "అమెరికాను తలదన్నేలా భారత్‌లో జాతీయ రహదారులు ఉన్నాయి. నితిన్ గడ్కరీ దగ్గరకు ఏ పార్టీ ఎంపీ వెళ్లి అడిగినా కాదనకుండా ఇస్తారు.

## పాక్‌తో ఉద్రిక్తతలు.. అన్ని రాష్ట్రాలకు కేంద్రం కీలక సూచన..

పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర హెూం వ్యవహారాల మంత్రిత్వ శాఖ దేశంలోని అన్ని రాష్ట్రాలకు



కీలక ఆదేశాలు జారీ చేసింది. శత్రు దాడి జరిగినప్పుడు సంసిద్ధంగా ఉండేందుకు మే 7 నుంచి పౌర రక్షణ మాక్ డ్రిల్‌లు నిర్వహించాలని సూచించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మాక్ డ్రిల్ ద్వారా వైమానిక దాడుల సైరన్‌లను పరీక్షించడం, పౌరులు, విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం, బ్లాక్‌అవుట్ చర్యలను అమలు చేయడం వంటి మొదలైన కీలక కార్యకలాపాలు నిర్వహిస్తారు.

దాయాది దేశంతో ఉద్రిక్తలు పెరుగుతుండటంతో దేశంలో వైమానిక దాడులపై అవగాహన పెంచేందుకు మాక్ డ్రిల్ నిర్వహించాలని కేంద్ర హెూం శాఖ రాష్ట్రాలను ఆదేశించింది. దేశవ్యాప్తంగా ఉన్న స్థానిక అధికారులు, విద్యా సంస్థలు, పౌరులకు ఎమర్జెన్సీ వేళల్లో ఎలా స్పందించాలో అవగాహన కల్పించాలని నొక్కి చెప్పింది. శత్రుదేశాలు దాడి చేస్తే ఎలా స్పందించాలి.. అత్యవసర పరిస్థితుల్లో తమను తాము ఎలా కాపాడుకోవాలో మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు శిక్షణ ఇస్తారు. క్రాష్ బ్లాక్‌అవుట్ చర్యలు కూడా ఉంటాయి.

## పీఓకే నుంచే ఆపరేషన్స్...

శ్రీనగర్, మే 3,

పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో లష్కరే తోయిబా (ఎల్‌ఇటి) ఉగ్రవాద శిక్షణా శిబిరం ఉనికిని వెల్లడిస్తున్న శాటిలైట్ ఫొటోలను భారత నిఘా సంస్థల చేతికి అందాయి. ఏప్రిల్ 22న 26 మంది ప్రాణాలను బలిగొన్న ఘోరమైన పహల్గామ్ ఉగ్రవాద దాడిలో లష్కరే తోయిబా పాత్రపై అనుమానాలు తలెత్తుతున్నాయి. 'జంగల్ మంగళ్ క్యాంప్' అని పిలువబడే ఈ శిక్షణా కేంద్రం పాకిస్తాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని మన్సెహ్రా జిల్లాలోని అటార్ సిసా అనే పట్టణంలో ఉంది. నిఘా వర్గాల ప్రకారం.. ఈ శిబిరం చాలా కాలంగా ఎల్‌ఇటి ఉగ్రవాదులకు కీలక శిక్షణా కేంద్రంగా పనిచేస్తోంది. ఈ శిబిరంలో నివాస ప్రాంతం, మసీదు, అతిథి సమావేశ మందిరాలు, విదేశీ ఉగ్రవాదుల కోసం శిక్షణా మైదానం ఉన్నాయి. శాటిలైట్ ఫొటోలో ఈ శిబిరానికి సమీపంలో ఒక సైనిక భవనం కూడా కనిపిస్తుంది. అంటే ఆ ఉగ్ర శిబిరానికి పాకిస్తాన్ సైన్యం రక్షణగా ఉన్న విషయాన్ని అర్థం చేసుకోవచ్చు.ఈ శిబిరంలో ఒక పెద్ద గ్రౌండ్‌లో ఆయుధ శిక్షణ, భౌతిక కసరత్తుల కోసం ఉపయోగిస్తున్నారని అధికారులు భావిస్తున్నారు. ఈ శిబిరంపై భారత భద్రతా సంస్థలు, నిఘా సంస్థలు నిరంతరం నిఘా ఉంచాయి. ఈ శిబిరాన్ని భారత భూభాగంలోకి ఉగ్రవాదులను పంపేందుకు ఏర్పాటు చేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. లష్కరే కమాండర్లు, పాకిస్తాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ మధ్య ఉన్నత స్థాయి సమావేశాలు తరచుగా క్యాంప్ కాంప్లెక్స్‌లోని ఫాగ్లా బీఆర్ ప్రదేశంలో జరుగుతాయని వర్గాలు వెల్లడించాయి. ముఖ్యంగా లష్కరే తోయిబా చీఫ్ హఫీజ్ సయీద్ అప్పుడప్పుడు ఇటువంటి సమావేశాలకు హాజరవుతున్నట్లు సమాచారం. ఈ ఫొటోలు బయటికి రావడంతో భారత్-పాకిస్తాన్ సంబంధాలు మరింత దెబ్బతిన్నాయి. ఈ ఫొటోలు రావడంతో భారత్ పీఓకేపై నిఘాను ముమ్మరం చేసింది. పాకిస్తాన్ ఉగ్రవాదానికి ఇస్తున్న మద్దతును గుర్తించి, పాక్‌కు, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చర్య తీసుకోవాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చింది భారత్.

భారత శక్తి
VOICE OF INDIAN

# 88 వేలకు రానున్న బంగారం

ఇటీవల కాలంలో ప్రపంచ మార్కెట్‌లో బంగారం ధరలు భారీగా తగ్గుతున్నాయి. బంగారం ధరలు భారీగా తగ్గడం లేదా పెరగడం అనేది అంతర్జాతీయ మార్కెట్ల పై ఆధారపడి ఉంటుంది సాధారణంగా స్టాక్ మార్కెట్లు పతనం అయినప్పుడు, బంగారం ధర పెరుగుతుంది. అదే సమయంలో స్టాక్ మార్కెట్ మళ్లీ లాభాల బాట పట్టినప్పుడు బంగారం ధర తగ్గుతుంది ఈ రెండింటికి దగ్గర సంబంధం ఉందిప్రపంచ మార్కెట్లో గత 10 రోజుల్లో బంగారం ఔన్సుకు 300 డాలర్ల వరకు తగ్గింది. అంటే ఔన్సుకు 3500 డాలర్ల నుంచి నుండి 3200 డాలర్లకు పడిపోయింది. బంగారం ధర తగ్గడానికి అమెరికా, చైనా ప్రధాన కారణాలుగా ఉన్నాయి. కార్మిక దినోత్సవం కారణంగా చైనాలో మే 5 వరకు సెలవులు ఉన్నాయి. దీని కారణంగా డిమాండ్ పడిపోయింది. దీంతో పాటు, అమెరికాలో సంతృప్తికరమైన ఉపాధి గణాంకాలు, అమెరికా-చైనా సుంకాల యుద్ధంలో సడలింపు సంకేతాలు, త్వరలో కొత్త ఒప్పందం కుదుర్చుకుంటుందనే ఆశల నేపథ్యంలో బంగారం ధరలను తగ్గాయని నిపుణులు చెబుతున్నారు. అయితే భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి సంకేతాలు కనిపిస్తున్నాయని, అందువల్ల పెద్ద క్షీణతకు అవకాశం లేదని మరికొంత మంది చెబుతున్నారు. బంగారం ధరలు తగ్గడానికి అనేక ప్రధాన కారణాలు ఉన్నాయి. ప్రపంచ వాణిజ్య చర్చలపై మార్కెట్ సెంటిమెంట్ మెరుగుపడటంతో ఈ వారం బంగారం ధరలు తగ్గాయి. భారతదేశం, జపాన్, దక్షిణ కొరియా, చైనాలతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే అవకాశాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లేవనెత్తారు. చైనాకు సంబంధించిన సోషల్ మీడియా పోస్టులు అమెరికా సుంకాలపై చర్చలను తిరిగి ప్రారంభించిందని పేర్కొన్నాయి. ఇది కాకుండా చైనాలో సెలవుల వల్ల కూడా బంగారం ధరలు తగ్గాయని నిపుణులు చెబుతున్నారు. చైనాలో కార్మిక దినోత్సవ సెలవుల కారణంగా మే 1 నుంచి 5 వరకు మార్కెట్ మూసిశారు. ప్రపంచంలోనే అత్యధికంగా బంగారం వినియోగించే దేశం చైనా కాబట్టి ఈ కాలంలో డిమాండ్ తగ్గింది. అమెరికాలో ఉపాధి నివేదిక కూడా బంగారం ధరలపై ప్రభావం చూపింది. ఏప్రిల్‌లో అమెరికాలో 1.77 లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టించారని ఆ నివేదికలో పేర్కొన్నారు. ఈ వారం బంగారం క్షీణత వార్తల్లో నిలిచినప్పటికీ బంగారానికి దీర్ఘకాలిక మద్దతు బాగా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. దానిని బలపరిచే అనేక అంశాలు ఉన్నాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు నేపథ్యంలో బంగారం ధరలు ఇంక తగ్గవని కొంత మంది నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను బంగారంలో పెట్టేందుకు ఎక్కువగా ఇష్టపడతారు. గతేడాది ఏప్రిల్ నెలలో 10గ్రాముల 24క్యారట్ల గోల్డ్ రేటు రూ. 75వేలుగా ఉంది. అప్పటి నుంచి దాదాపు 25శాతం వరకు గోల్డ్ రేటు పెరిగింది. 2025 ప్రారంభంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవీ బాధ్యతలు చేపట్టగానే చైనా సహా ప్రపంచ దేశాలు అన్నింటిపైన సుంకాలు పెంచేశారు. వాణిజ్య యుద్ధం కారణంగా బంగారం ధరలు రికార్డు స్థాయిలను నమోదు చేశాయి. ప్రస్తుతం గోల్డ్ రేటు క్రమంగా తగ్గుతుంది.ఏంజెల్ వన్‌లో కమోడిటీస్, కరెన్సీల చీఫ్ టెక్నికల్ రీసెర్చ్ అనలిస్ట్ తేజస్ అనిల్ షిగ్రేకర్ మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయి. దక్షిణ కొరియా, జపాన్, భారతదేశంతో సంభావ్య వాణిజ్య ఒప్పందాల గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచనలతోపాటు.. చైనా, అమెరికా మధ్య ట్రేడ్ వార్ ఉధృతి కూడా కాస్త తగ్గుముఖం పట్టింది. దీంతో బంగారం ధరలు తగ్గుదలకు కారణం అవుతున్నాయని తెలిపారు.నిర్మల్ బ్యాంగ్ కమోడిటీస్ రీసెర్చ్ హెడ్ కునాల్ షా మాట్లాడుతూ.. రాబోయే మూడు నుంచి నాలుగు నెలల్లో అంతర్జాతీయంగా బంగారం ధర ఔన్సు కు 3,000 డాలర్ల లేదా 2,950 డాలర్లకు చేరుకుంటుంది. భారత్ లో 10గ్రాముల 24క్యారట్ల గోల్డ్‌రేటు రూ. 88,000 దిగువకు పడిపోతుందని ఆయన అంచనా వేశారు. ఇదే అభిప్రాయాన్ని ఏంజెల్ వన్ కు చెందిన అనిల్ షిగ్రేకర్ వ్యక్తం చేశారు. వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గడం వల్ల బంగారంపై ఇన్వెస్టర్ల పెట్టుబడి తగ్గుతుందని, తద్వారా రాబోయే కొద్దికాలంలో గోల్డ్ రేటు మరింత తగ్గుతుందని అంచనా వేశారు.బంగారాన్ని సేఫ్ ఇన్వెస్ట్మెంట్ అని పిలుస్తారు. ఇందులో పెట్టుబడి పెట్టడం ద్వారా బంగారానికి డిమాండ్ ఏర్పడి ధరలు భారీగా పెరుగుతాయి. అయితే మళ్లీ స్టాక్ మార్కెట్లో లాభాల బాట పట్టిందంటే ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను బంగారం నుంచి తొలగించి స్టాక్ మార్కెట్లో పెడతారు.

# ఏపీలో విచిత్రవాతావరణం

విజయవాడ, మే 5,

ఆంధ్రప్రదేశ్‌లో బుధవారం వరకు భిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉంటాయి. మంగళవారం వరకు పలు చోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రజలు చెట్ల కిందకు వెళ్లి నిలబడరాదని ఏపీ విపత్తులు నిర్వహణ శాఖ సూచించింది. మరోవైపు రానున్న రెండు రోజులు ఉష్ణోగ్రతలు 41.5 డిగ్రీల నుంచి 43 డిగ్రీల మధ్య రికార్డు అయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారుశ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం , అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి-మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మరోవైపు కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, కృష్ణా, ఎన్టీఆర్, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఆదివారం నాడు మోస్తరు వర్షాలు కురవనున్నాయి. తిరుపతి మంగనెల్లూరులో శనివారం 42.8 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. బలమైన ఈదురుగాలులు వీచే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కిందకు వెళ్లకూడదని సూచించారు. నేడు కొన్ని చోట్ల ఉష్ణోగ్రతలు 41-42.5లీఅ మధ్య రికార్డు అయ్యే అవకాశం ఉందని, ఎండల నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురవనున్నాయి. విశాఖ, అల్లూరి, ఉభయ గోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు.. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురవనున్నాయి. పలు ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశముందన్న రాష్ట్ర విపత్తుల నిర్వహణశాఖ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మరోవైపు విజయవాడ నగరంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. భారీ ఈదురు గాలులు, ఉరుములతో వర్షం కురుస్తోంది. వాతావరణం చల్లగా మారడంతో సేదదీరుతున్నారు నగర ప్రజలు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం అంచనా వేసింది.

రెడ్ అలెర్ట్...

5 జిల్లాలకు రెడ్ అలర్ట్, 6 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారరు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్. ప్రకాశం,కృష్ణా,బాపట్ల, నెల్లూరు,తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు చెప్పారు. పిడుగులు కూడా పడొచ్చు. గంటకు 60-85 కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఇక అల్లూరి సీతారామరాజు, విజయనగరం, అనకాపల్లి పలు చోట్ల పిడుగులతో కూడిన మోస్తారు నుంచి భారీ వర్షాలు కురవొచ్చు. విశాఖ, కాకినాడ, కోనసీమ పరిసర జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. హోర్డింగ్స్, చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాలు దగ్గర నిలబడరాదని సూచించారు. ప్రకాశం, కృష్ణా, బాపట్ల, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయంది. వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉందని హెచ్చరించింది. గంటకు 60-85 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయంది.ఇక అల్లూరి సీతారామరాజు, విజయనగరం, అనకాపల్లి, విశాఖ, కాకినాడ, కోనసీమ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది విపత్తుల నిర్వహణ సంస్థ. ఈ జిల్లాల్లో పలు చోట్ల పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయంది. విశాఖ, కాకినాడ, కోనసీమ పరిసర జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వానలు పడతాయంది.ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. హోర్డింగ్స్, చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాలు దగ్గర నిలబడరాదని చెప్పింది. అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది.

# జగన్ అష్టదిగ్బంధనం

విజయవాడ, మే 5,



వైసీపీ అధినేత జగన్ కు ఇప్పుడు కష్టాలు మొదలవుతాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది పూర్తి కావస్తుండటంతో ఇక జగన్ ను అన్ని రకాలుగా అష్ఠదిగ్భంధనం చేసే పనిలో ఉన్నారు. ఎటూ కదలకుండా కేసులు జగన్ ను చుట్టుముట్టే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. టీడీపీ కార్యకర్తలు ఎప్పటి నుంచో జగన్ అరెస్ట్ కోసం ఎదురు చూస్తున్నారు. తమ అధినేత చంద్రబాబును నాడు స్కిల్ డెవెలప్ మెంట్ స్కామ్ కేసులో అరెస్ట్ చేసి యాభై రెండు రోజుల పాటు రాజమండ్రి జైలులో ఉంచిన ఘటనను నేటికీ మరిచిపోలేకపోతున్నారు. చిన్నా చితాకా నాయకులను అరెస్ట్ చేసినప్పటికీ, వివిధ కేసులను నమోదు చేసినప్పటికీ వారు శాంతించడం లేదు. అసలు పెద్ద చేపను పట్టుకోవాలంటూ సోషల్ మీడియాలో తెలుగు తమ్ముళ్లు ఫైర్ అవుతున్నారు. దీంతో ఒక్కొక్క కేసు కూడా జగన్ మెడకు చుట్టుకునే అవకాశాలున్నాయి. మద్యం స్కామ్ కేసులో కీలక నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు జగన్ పై కేసులు నమోదు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ కేసులో అరెస్టయిన రాజ్ కసిరెడ్డి ఇచ్చిన వాంగ్మూలంతో పాటు కస్టడీలో ఆయన చెప్పిన విషయాలతో జగన్ పై కేసు నమోదు చేయడానికి సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. అయితే ఆషామాషీగా కాకుండా పక్కా ఆధారాలతో కేసులు నమోదు చేయాలని పై నుంచి ఆదేశాలు ఉండటంతో అన్నీ ఆధారాలను తీసుకున్న తర్వాత కేసు నమోదు చేసే అవకాశముందిమరొకవైపు గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఇసుక దందాపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇసుకతో పాటు పక్కా ఇళ్ల నిర్మాణంలో జరిగిన అవకతవకలను కూడా బయటకు తీస్తున్నారు. ఇక విశాఖపట్నంలో పలు చోట్ల భూకబ్జాలకు పాల్పడిన విషయాలపై కూడా కేసులు నమోదయ్యే అవకాశాలున్నాయి. వీటన్నింటికీ సూత్రధారి జగన్ అని పోలీసు వర్గాలు అనుమానిస్తున్నాయి. జగన్ ను అరెస్ట్ చేయాలంటే ఒక్క కేసుతో సరిపెట్టడం కంటే వరస కేసులు నమోదు చేస్తూ జైలులో నుంచి బయటకు రానివ్వకుండా చేయాలన్న ఆలోచనలో ఉండి అన్ని కేసులను కూలంకషంగా శోధించి అందుకు సంబంధించిన ఆధారాలను పకడ్బందీగా సేకరిస్తున్న పోలీసులు త్వరలోనే కేసు నమోదు చేయాలన్న ఉద్దేశ్యంతో ఉన్నట్లు తెలిసింది. అందుకే ఇన్ ఛార్జుల సమావేశంలో... రాజధాని అమరావతి నిర్మాణ పనులు ప్రారంభమయ్యే వరకూ వేచి ఉన్న పోలీసులు ఇప్పుడు కేసుల విషయంలో మరింత వేగం పెంచారు. లిక్కర్ స్కామ్ తో పాటు శాండ్ స్కామ్, బియ్యం అక్రమ రవాణా, భూ కబ్జాలు ఇలా అన్ని వైపుల నుంచి కార్నర్ చేసేలా నరుక్కుంటూ వస్తున్నారు. జగన్ కు కూడా ఈ సంకేతాలు అందడంతోనే ఇటీవల జరిగిన జిల్లా ఇన్ ఛార్జి సమావేశాల్లో ఫ్రీ హ్యాండ్ ఇచ్చారంటున్నారు. వారి ముందు క్యాలెండర్ కూడా పెట్టారంటున్నారు. బూత్ లెవెల్ లో నియామకాలు చేపట్టేందుకు కూడా డెడ్ లైన్ పెట్టారని, తాను బయట ఉండే అవకాశంలేదని తెలుసుకుని జగన్ ఈ రకమైన డెసిషన్ తీసుకున్నారని పార్టీ వర్గాలే చెబుతున్నాయి. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.

# మూడేళ్లలో ముగింపు సాధ్యమేనా

గుంటూరు, మే 5,

అమరావతి రాజధాని రీలాంచ్ పనులు ప్రారంభం కానున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన పూర్తయిన తర్వాత పాత డిజైన్లతోనే నిర్మించాలని నిర్ణయించారు. ఇప్పటికే సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ భవనాలకు సంబంధించిన డిజైన్లు పూర్తి కావడంతో పాటు వాటికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి కావడంతో ఇక నిర్మాణ పనులు ఊపందుకోనున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ ఆశీనులైన వేదిక నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మూడేళ్లలో అమరావతి రాజధాని పనులను పూర్తి చేస్తామని చెప్పారు. మోదీ కూడా తన ప్రసంగంలో మూడేళ్లలో పూర్తి అవుతుందని తెలిపారు. దీంతో అమరావతి రాజధాని నిర్మాణ బాధ్యతలన్నీ మున్సిపల్ మంత్రి నారాయణకు చంద్రబాబు నాయుడు అప్పగించారు.అయితే మూడేళ్లలో అమరావతి నిర్మాణపనులు పూర్తి కావడం అంటే ఆషామాషీ కాదు. 365 రోజులు 24 చీ 7 పనిచేసినా సమయం సరిపోతుందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పునాదులు తీయడం నుంచి నిర్మాణాలు పూర్తి చేయాలంటే అంత సులువు కాదని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. ఒక్కొక్క టవర్ నిర్మాణం చేయాలంటే ఎంతో సమయం తీసుకుంటుంది. అందుకు అవసరమైన ముడిసరుకుతో పాటు అనుభవజ్ఞులైన ఇంజినీర్లతో పాటు కార్మికులు కూడా అవసరం. అంతా తీసుకున్నా ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పరిస్థితులు రాజధాని నిర్మాణ పనులకు తరచూ అంతరాయం ఏర్పరచే అవకాశముందని అంచనాలు వినపడుతున్నాయి వర్షాలు.. తుపానులు... సముద్ర తీర ప్రాంతం ఉన్న రాష్ట్రం కావడంతో నిత్యం వర్షాలతో పాటు తుపానులు కూడా ఏడాదిలో ఎక్కువ సార్లు వస్తుంటాయి. జులై నెల వచ్చిందంటే ఇక వర్షాలు మామూలుగా పడవు. ఆగస్టు నుంచి కొంత వర్షాల విషయంలో తెరిపి ఇచ్చినప్పటికీ అక్టోబరు, నవంబరు నెలలో తుపానులు పొంచి ఉన్నాయి. సముద్ర తీర ప్రాంతానికి అమరావతి దగ్గరగా ఉండటంతో ఈదురుగాలులతో పాటు భారీ వర్షాలు పడితే



పనులకు ఆటంకం ఏర్పడే అవకాశాలున్నాయంటున్నారు. మే నెలలో డిజైన్లు ఖరారయి పనిలో దిగి పునాదులు తవ్వేసరికి జులై వచ్చేస్తుంది. ఇక వర్షాలతో పనులు ముందుకు సాగే అవకాశం లేదు. పోలవరం పనులే పదేళ్ల నుంచి వివిధ ఆటంకాలతో పూర్తి కాకపోవడాన్ని చూసినట్లు ఇంజినీర్లు చెబుతున్నారు. వేసవిలో కూడా అకాల వర్షాలు ముంచెత్తుతున్నాయి. మరో వైపు కృష్ణానదికి వరద ముప్పు ఎప్పుడూ పొంచి ఉంటుంది. వరద వస్తే మాత్రం అమరావతి ప్రాంతంలో నీరు చేరుతుంది. ఇది కూడా పనులకు ఆటంకంగా మారతాయి. వీటికి తోడు పండగలు, పబ్బాలు ఇలా అన్ని కలుపుకుంటూ పోతే మూడేళ్ల సమయం ఇంత పెద్ద సమయంలో పనులు పూర్తి చేయడం సాధ్యం కాకపోవచ్చన్నది ఇంజినీరింగ్ నిపుణుల అంచనా. ఏదైనా ఒక భవనం అయితే పూర్తి చేయవచ్చు కానీ.. యుద్ధ ప్రాతిపదికపై అన్ని హంగులతో బరిలోకి దిగినా ప్రకృతి ఏ మేరకు రాజధాని నిర్మాణానికి సహకరిస్తుందన్నది ఇప్పుడు అందరిలోనూ టెన్షన్ రేపుతుంది. అయితే చంద్రబాబు ఆదేశాల మేరకు టెండర్లు దక్కించుకున్న సంస్థలు వీలయినంత త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేయాలన్న లక్ష్యంతో బరిలోకి దిగుతున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# అక్రమ ఇసుక తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్థులు

భద్రాద్రి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం తెగడ పంచాయతీలోని రాజీవ్ నగర్ కాలనీలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. గోమ్ముగూడెం పంచాయతీ ఇసుక ర్యాంపు కి రోడ్ ని నిర్మించడం కోసం నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది రేసింగ్ కాంట్రాక్టర్లు రాత్రి పగలు తేడా లేకుండా ప్రభుత్వ భూమి లో జె సి బి మిషన్స్ ధ్వారా అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు. ఈ నేపధ్యంలో అక్రమ తోలకాలకి అడ్డుకట్ట వేసి తగు చర్యలు తీసుకోవాల్సిన సంబధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడమ్ వలన ప్రభుత్వ భూమి,గుట్టలు అక్రమార్కులు కొల్లగొట్టడటమే గాక తవ్విన గ్రావెల్ గ్రామల నుంచి టిప్పర్ల ధ్వారా రవాణా చేస్తుండటం వల్లన పచ్చని పల్లెలలోని రోడ్లు గుంతలమయం ఔతున్నయని గ్రామస్థులు వాపోతున్నారు.. ఇక ఈ తథంగం అంతా స్థానిక రెవెన్యూ అధికారుల అండదండలతో జరగడం వల్లన రేజింగ్ కాంట్రాక్టర్ రెచ్చిపోతున్నారు అని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అంతెకాకుండ వేసవిలో ప్రజలు నీటి కోసం అల్లాడుతుంటే ఇసుకసురులు మాత్రం భగీరథ పైప్ లైన్లను తవ్వకాలకు అడ్డు వస్తున్నాయని పైపులైన్లను సైతం బద్దలు కొట్టారు.. దీంతో గ్రామాల ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నామని ఆరోపిస్తున్నారు.

# ఉపాధి హామీ పనులు వ్యవసాయంకు అనుసంధానం చెయ్యాలి

కొడిమ్యాల,

పేద కూలీలకు, అణగారిన వర్గాలకు, చేతి నైపుణ్యం లేని వారికి మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం రూపొందించారు. ఈ గ్రామీణ ఉపాధి హామీ పనులను వ్యవ్యసాయం కు అనుసందించాలి. మహాత్మ గాంధీ ఉపాధి హామీ పథకాన్ని 2005లో కూలీలకొరకు రూపొందించించింది. కాని పనులు సరిగా లేక పోవడంతో అక్కడక్కడా అరకొర వసతులతో పనులు చేస్తూ గుట్టలను చూసుకొని పనులు చేస్తున్నారు. దీనితో కూలీలకు సరైన వేతన చెల్లింపులు జరుగడం లేదు. అదే వ్యవసాయానికి అనుసంధానం చేసి మండలంలో ఎంతమంది కూలీలు ఉన్నారో లెక్కతీసి వారిని గ్రూపులుగా చేసి ఏ రైతుకు ఎంతమంది కూలీలు అవసరమున్నారో చెపితే అరైతు తో కూలీలను అప్పజెప్పి పంపియ్యాలి దీనికి రైతును కూడ బాధ్యత ఉండేలా భాగస్వామ్యం చేసి వారినుండి ధరఖాస్తు స్వీకరించాలి. దీనితో రైతు కు పూర్తి పనిదినాలు కల్పించవచ్చు. ఇప్పటి కె ఉపాధి హామీ పథకం నీరు కారిపోతుంది. కూలీలకు పనులు లేక అక్కడక్కడా తవ్వుతూ క్యూబిక్ మీటర్లు లెక్కచేసి డబ్బులు తీసుకుంటున్నారు. పనులు రికార్డులకే పరిమితమవుతున్నాయి.100రోజుల పని దినాలనుండి 150రోజుల పని దినాలకు పెంచాలని కూలీలనుండి డిమాండ్ పెరుగుతుంది. గతంలో 180వరకు వేతనం ఉంటే కూలీలకు 120వేతనం అందుతుండేది. ఇప్పుడు 307రూపాయలు వస్తే కూలీలకు 280అందుతుంది.

ఉపాధి కూలీలకు పని నిదినాలు పెంచి 400రూపాయలు వేతనం ఇయ్యాలని డిమాండ్ కూలిలనుండి పెరుగుతుంది.

# రాష్ట్ర అభివృద్ధిలోభాగమయిన నితిన్ గడ్కారి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

ఆసిఫాబాద్‌తెలంగాణలో రోడ్డు కనెక్టివిటీ అందించేందుకు, జాతీయ రహదారుల నిర్మాణం పూర్తయ్యేందుకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అమేయ కృషి చేస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రశంసించారు. రూ.3,900 కోట్ల జాతీయ రహదారి ప్రాజెక్టుల ప్రారంభ సభలో మంత్రి మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధిలో భాగంగా మారిన ఆయనకు ప్రభుత్వం తరఫున పూర్తి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఇప్పుడు తెలంగాణకు అవసరమైన మరో రోడ్ కనెక్టివిటీ కోసం ఆయనకు అభ్యర్థన. తెలంగాణకు హైదరాబాద్ నుంచి ఛత్తీస్ ఘడ్ రాజధాని రాయ్ పూర్ వరకు అలాగే నాందేడ్, పుణె, నాసిక్ మీదుగా మహారాష్ట్రకు రోడ్ కనెక్టివిటీ అందించాలని కేంద్ర మంత్రి కి విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు.

# సూపర్ సిక్స్ అమలు ఎప్పుడు

నెల్లూరు, మే 5,

జనసేనలో చేరికలు నిలిచిపో?యాయి. గత కొద్ది రోజుల నుంచి కార్పేటర్లు మినహాయించి అదీ అవసరమైన విశాఖ వంటి ప్రాంతాలల మాత్రమే చేరికలు జరిగాయి. అంతే తప్ప ఒక స్థాయి నేతలు ఎవరూ జనసేనలో చేరకపోవడానికి కారణాలేంటన్న దానిపై పార్టీలో చర్చ జరుగుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పటయిన తొలినాళ్లలో జనసేనలో భారీ స్థాయిలో చేరికలు కొనసాగాయి. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సామినేని ఉదయ భాను, కిలారు రోశయ్య తదితరులు పార్టీలో చేరారు. దీంతో ఇంకా అనేక మంది క్యూ లో ఉన్నారన్న ప్రచారం సాగింది. అయితే కొందరు నేతలు టీడీపీ వైపు వెళ్లిపోయారు. కాపు సామాజికవర్గమయినా ఆళ్ల నాని టీడీపీలో చేరిపోయారు. అయితే చేరిన వారంతా పెద్దగా యాక్టివ్ గా లేకపోవడంతో పాటు వారికి ప్రాధాన్యత కూడా దక్కడం లేదన్న అభిప్రాయం బలంగా ఏర్పడింది. జనసేనలో చేరితే అక్కడ పవన్ కల్యాణ్ వద్దకు వెళ్లాలంటే ముందు చాలా మంది నేతలను దాటుకుని వెళ్లాల్సి ఉంటుందని, కండువా కప్పే సమయంలో తప్ప మరోసారి ఆయనను కలిసే అవకాశముండదని అర్థమయింది. వైసీపీలో జగన్ తరహాలోనే ఇక్కడ కూడా ఉండటంతో రెండింటికీ పెద్ద తేడా ఏముందన్న ప్రశ్న అందరిలోనూ కలుగుతుంది. తోట త్రిమూర్తులు వంటి వారు కూడా జనసేనలోకి వస్తారని, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి పెద్దయెత్తున నేతలు వచ్చి చేరిపోతారన్న ప్రచారం చివరకు ప్రచారానికే పరిమితమయింది ఆసక్తి చూపని పవన్... కానీ చేరికలకు పవన్ కల్యాణ్ పెద్దగా ఆసక్తి కనపర్చడం లేదని తెలిసింది. నేతలు ఎక్కువయ్యే కొద్దీ అనవసర టెన్షన్ తప్ప మరొకటి ఉండదని భావించి పవన్ కల్యాణ్ చేరికలకు సుముఖంగా లేరంటున్నారు. ప్రస్తుతం సాఫీగా సాగుతున్న పార్టీలో కొత్త వారిని చేర్చుకుని తలనొప్పులు తెచ్చుకోవడం ఎందుకని ఆయన ఆలోచన చేస్తున్నారని అంటున్నారు. విశాఖ నేత అవంతి శ్రీనివాస్ జనసేనలో చేరేందుకే వైసీపీకి రాజీనామా చేసినప్పటికీ పవన్ నుంచి గ్రీన్ సిగ్నల్ రాకపోవడంతో ఆయన టీడీపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారని తెలిసింది. ఇలా




అనేక మంది నేతలు ప్రయత్నించినప్పటికీ పవన్ కల్యాణ్ రెడ్ సిగ్నల్ వేయడంతోనే వారు ప్రస్తుతం వైసీపీలో కొనసాగుతున్నారని కూడా అంటున్నారు. రొకవైపు కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకూ ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రజల్లో కొంత అసంతృప్తి బయలుదేరిందని, కేవలం అమరావతి మీదనే ఫోకస్ పెట్టడం, రాజధాని నిర్మాణానికే నిధులు కేటాయించడం, సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకపోవడంతో ప్రజలు విసిగిపోయి ఉన్నారని, అందుకే జనసేన, టీడీపీలో చేరడం కంటే వైసీపీలో కొనసాగడమే మంచిదన్న ఆలోచనలో కూడా కొందరు ఉన్నారు. నేతలు అన్ని లెక్కలు వేసుకున్న తర్వాత ఇతర పార్టీలో చేరడం కంటే ఉన్న పార్టీలోనే ఉండి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవచ్చన్న భావనలో ఉన్నారని చెబుతున్నారు. మొత్తం మీద జనసేనలో చేరికలు లేవని అంటున్నారు. మరి ఏది నిజమనేది చూడాలి

## బీఆర్ఎస్ పై మంత్రుల మండిపాటు

నల్గోండ మే 5,

పదేళ్ల బిఆరెస్ పాలన -పదహారు నెలల కాంగ్రెస్ పాలన పై ప్రజల్లో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన సాగు నీటి ప్రాజెక్టులు నాణ్యత లోపం తో కూలి ఇప్పుడు ఇలా శిథిలావస్థకు చేరుకుంటున్నాయని కాంగ్రెస్ మంత్రులు బిఆరెస్ పై బాణాలు ఎక్కు పెట్టారు. కాళేశ్వరం లాంటి ప్రాజెక్ట్ లకు ప్రజా ధనం దుర్వినియోగం అయ్యిందని మంత్రులు మండి పడుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును బిఆరెస్ అప్పటి తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా చెప్పుకున్నా... ఇప్పుడు అవినీతి నిండిపోయిందనే ఆరోపణలు కాంగ్రెస్ చేస్తుంది. ఈ ప్రాజెక్టు కోసం 94 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా . ఆశించిన ఫలితాలు మాత్రం రాలేదని వాదన వినిపిస్తుంది. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై ఎక్కువ దృష్టి పెట్టి, దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందనని ఆరోపిస్తున్నారు.

పనికిరాని కాళేశ్వరం ప్రాజెక్టులో గత ప్రభుత్వం 94 వేల కోట్లను ఖర్చు పెట్టింది. వాళ్ల టైం లోనే డిజైనింగ్ అయింది, వాళ్ల టైంలోనే పూర్తి చేశారు,వాళ్ల టైంలోనే కూలిపోయిందని బిఆరెస్ పై విరుచుకు పడుతున్నారు.

"గత పదేళ్లలో ఇరిగేషన్ శాఖ 1లక్షా81 వేల కోట్లు ఖర్చుపెట్టి ఎస్ ఎల్ బి సి , దేవాదుల, పాలమూరు రంగారెడ్డి, కల్వకుర్తి ,నెట్టెంపాడు, భీమ లాంటి ప్రాజెక్టులు 1 పర్సెంటేజ్ కూడా పూర్తి చేయలేదు. ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజలకు ఏదో విధంగా ఈ ఎస్ ఎల్బీ సి ప్రాజెక్టు పూర్తి చేస్తాం. చాలాకాలం కింద ఆగిపోయిన గందమల్ల ప్రాజెక్టును కూడా తిరిగి ప్రారంభిస్తున్నాం. మేము వచ్చిన తర్వాతనే ఉదయ సముద్రం ప్రాజెక్టు పనులను పురోగతి సాధించి ముందుకు తీసుకుపోతున్నాము. తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో ఏ విధంగా ఎక్కువ ఆయకట్టు స్టిరీకరణ సాధించెలా చర్యలు చేపడతాం.పదేళ్ల బిఆరెస్ పాలన లో"దక్షణ తెలంగాణ ప్రాజెక్ట్ లకు తీరని అన్యాయం జరిగిందని తెలంగాణ ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటున్నారు..

యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం కొనుగోలు ఆలస్యం కావడంతో... రైతులు ఆందోళన చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత... ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే మన జిల్లాలో 80% ధాన్యాన్ని కొనుగోలు చేశాం. తప్పకుండా మీ సమస్యలలో మేము ఒకడిగా ఉంటామని మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత... 80 నుంచి 84 శాతం జనాభాకు ఉచితంగా ఆరు కిలోల సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ పథకం కోసం ప్రభుత్వం 13 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందడంతో లబ్ధిదారులు ఈ పథకం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని మంత్రి స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలన్నిటిలో సన్న బియ్యం పథకం నాకు చాలా నచ్చిందంటున్న మంత్రి గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యం 80 శాతం పక్కదారి పట్టాయన్నారు. కానీ ఈరోజు ప్రతి షాపు లో నాలుగు రోజులలోనే సన్న బియ్యం బియ్యం అయిపోతుందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం... కాళేశ్వరం ప్రాజెక్టుపై అవినీతి ఆరోపణలు చేస్తుంటే, బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తోంది. తెలంగాణ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ప్రధాన శత్రువని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ రాజకీయ ఆరోపణలు, ప్రజల్లో గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి. మిర్యాలగూడ లో జరిగిన మీటింగ్ లో కోమటిరెడ్డి మాట్లాడుతూ, ఓ పెద్దాయన అంటాడు తెలంగాణకు మొదటి శత్రువు కాంగ్రెస్ పార్టీ ఏ అని. పదేళ్లు ఫామ్ హౌస్ లో పడుకొని లక్షల కోట్లు అవినీతికి పాల్పడ్డాయన కాంగ్రెస్పై నిందలు వేయడం సరికాదని మంత్రి హితవు పలికారు..

తెలంగాణ లో ప్రాజెక్టు అవినీతి గుట్టలు.. బయటపడుతున్న కొద్దీ...కాంగ్రెస్, బిఆరెస్ నేతల మధ్య రాజకీయ ఆరోపణలు పెరుగుతున్నాయి.రోజు రోజు కు రాజకీయం వేడెక్కుతుంది. సంక్షేమ పథకాల అమలు పై బిఆరెస్ నిలదీస్తుంది.ఆరోపణలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి. దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందా? ప్రజలకు న్యాయం జరుగుతుందా? తెలంగాణ నీటిపారుదల ప్రాజెక్టులు, ప్రజల ఆశలు, రాజకీయ నాయకుల అవినీతి... ఈ కథకు ముగింపు ఎప్పుడు?వేచి చూడాల్సి ఉంది.

## సగం ధరకే పసిడి దాణా

ఏలూరు, మే 5,

పాడి రైతులకు ఏపీ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. తెల్ల రేషన్ కార్డు కలిగిన పాడి రైతులకు 50 శాతం రాయితీతో పోషకాలతో కూడిన పశువుల దాణా అందించనుంది.కుటుంబానికి గరిష్టంగా రెండు పెద్ద పశువులు, ఒక దూడకు 90 రోజులకు గాను 450 కేజీల దాణాను పంపిణీ చేయనుంది. రూ.1100 విలువైన 50 కేజీల దాణా బస్తాను రూ.555కే అందించనుంది. పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు.పశువుల పెంపకందారులకు పోషకాలతో దాణా అందించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. కిలో రూ.22.11కు కొనుగోలు చేసి రైతు సేవా కేంద్రాలు, పశు వైద్యశాలల ద్వారా రూ.11.10కే పంపిణీ చేయనుంది. 20 శాతం ప్రొటీన్ కలిగిన పశువుల దాణాను పాడిరైతులకు అందించనుంది. తెల్ల రేషన్ కార్డు కలిగిన పాడిరైతులను ఈ లబ్ధి పొందేందుకు అర్హులుగా నిర్ణయించింది.ఒక్క కుటుంబానికి రెండు పెద్ద పశువులు, ఒక దూడకు 90 రోజులకు విడతల వారీగా 450 కిలోల దాణాను 50 శాతం రాయితీపై పంపిణీ చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 21 లక్షల మంది పాడిరైతులకు లబ్ధి చేకూరేలా రూ.69 కోట్ల వ్యయంతో 31,067 టన్నుల దాణా పంపిణీకి ఏపీ పశు సంవర్ధక శాఖ చర్యలు చేపట్టింది.50 కిలోల పశువుల దాణా బస్తాను రూ.1,100కు కొనుగోలు చేసి రూ.555లకే పాడి రైతులకు అందజేస్తారు. రైతులకు 50 శాతం రాయితీతో దాణా పంపిణీ చేయడం వల్ల ఆర్థికంగా అదనపు భారం పడుతున్నప్పటికీ...రైతులు వేసవిలో పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు ఈ చర్యలు చేపట్టారు.పశువుల విక్రయాలు తగ్గించేందుకు, పాడి ఉత్పత్తులు పెంచేందుకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందని అధికారులు తెలిపారు. అర్హులైన పాడి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులు కోరారు.

ఏపీ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకంపై అప్డేట్ ఇచ్చింది. మే నెలలో అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు.అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు అందించనుంది. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ యోజనతో కలిపి దీనిని అమలు చేస్తారు.రైతులకు పెట్టుబడి సాయంగా ఏటా మూడు విడతల్లో రూ.20 వేలు అందించనున్నారు. ఇందులో పీఎం కిసాన్ ద్వారా కేంద్రం రూ.6000, రాష్ట్ర ప్రభుత్వం రూ.14000 కలిపి మొత్తం రూ.20 వేలు అందించనున్నారు. ఈ ఆర్థిక సాయాన్ని మూడు విడతల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేయనున్నారు.

## మహానాడులో అన్ని స్పెషల్సే... 7న భూమి పూజ

కడప, మే 5,

ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడుపై తెలుగుదేశం పార్టీ దృష్టి సారించింది. ఈ నెల 27 నుంచి మూడు రోజులపాటు మహానాడును కడప జిల్లా కేంద్రంలో నిర్వహించాలని అధిష్ఠానం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో.. పార్టీ ఎమ్మెల్సీలు బీద రవిచంద్రా, దామచర్ల సత్య, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణరాజు కడపకు వెళ్లి.. పలు ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించారు.కడప సమీపంలోని సీకే దిన్నె మండలం చెర్లోపల్లి, పబ్బాపురం గ్రామాల పరిధిలోని భూములను పార్టీ అధిష్ఠానం అనుమతితో.. మహానాడు కోసం ఎంపిక చేశారు.మహానాడు ప్రాంగణం, భోజన ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్‌కు స్థలాలను ఎంపిక చేశారు. ఈ స్థలం కడపను తిరుపతి, చిత్తూరు, అనంతపురం, హైదరాబాద్ మార్గాలతో కలిపేదిగా ఉందని నేతలు చెబుతున్నారు.స్థానిక ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి ద్వారా భూముల యాజమానుల నుంచి నిరభ్యంతర పత్రాలు తీసుకున్నారు.శాటిలైట్ మ్యాప్ ద్వారా మహానాడుకు అవసరమైన స్థలాల వివరాలను.. నేతలకు కమలాపురం ఎమ్మెల్యే వివరించారు. మరింత స్థలం అవసరమైనా రైతుల అనుమతి తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.మహానాడు 2025కు సంబంధించి ఈ నెల 7న పనులకు భూమిపూజ నిర్వహించి, వేగంగా పూర్తి చేయాలని నేతలు నిర్ణయించారు.పార్టీలో సంస్కరణలు తీసుకురావడానికి, యువతకు ప్రాధాన్యత ఇవ్వడానికి ఈ మహానాడు వేదికగా మారే అవకాశం ఉంది. పార్టీలో యువ నాయకులకు పెద్ద పదవులు ఇవ్వడం, పార్టీ నిర్మాణంలో మార్పులు వంటి అంశాలపై చర్చలు జరిగే అవకాశం ఉంది.ఈ వేడుక సందర్భంగా నారా లోకేష్‌కు పార్టీలో మరింత కీలకమైన బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. కొత్త తరం నాయకత్వానికి పెద్దపీట వేయాలనే యోచనలో తెలుగుదేశం పార్టీ ఉంది.పార్టీ శ్రేణులను ఏకం చేసి.. వారిలో నూతనోత్సాహాన్ని నింపడానికి ఈ మహానాడు దోహదపడుతుందని టీడీపీ నేతలు చెబుతున్నారు.తెలుగుదేశం పార్టీ మహానాడులో వంటలు ఎప్పుడూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఈ వేడుకకు హాజరయ్యే వేలాది మంది కార్యకర్తలకు రుచికరమైన, సాంప్రదాయ వంటకాలను వడ్డిస్తారు. ప్రతి సంవత్సరం, మహానాడులో వంటల ప్రత్యేకతలు మారుతూ ఉంటాయి.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సాంప్రదాయ వంటకాలకు మహానాడులో ప్రాధాన్యత ఇస్తారు. పులిహోర, దద్దోజనం, పొంగలి, సాంబారు, రసం, కూరలు, పప్పు, పెరుగు, మజ్జిగ వంటి వంటకాలు తప్పనిసరిగా ఉంటాయి. స్థానిక రుచులకు అనుగుణంగా ప్రత్యేక వంటకాలు కూడా తయారు చేస్తారు.

## భూభారతి పైలట్ ప్రాజెక్టుగా తెట్టేకుంట గ్రామం

నల్గోండ మే 5,

నల్గొండ జిల్లా నకిరేకల్ మండలం తాటికల్ గ్రామ అవాస గ్రామమైన తేట్టేకుంట భూ భారతి చట్టం 2025 ని పురస్కరించుకొని జిల్లా లోనినకిరేకల్ మండలమును పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేయడం జరిగినది. ఇందులో భాగంగా రెవెన్యూ సదస్సులను నిర్వహించుటకు షెడ్యూలు ను రెండు టీమ్ లు గా ఏర్పాటు చేయనైనది తెట్టెకుంట గ్రామంలో , తహసీల్దార్ నాయబ్ తహశీల్దార్ లు , గిర్దావర్లు, సర్వేయర్లు మరియు రెవెన్యూ సిబ్బంది అందరూ హాజరైనారు......

## ప్రమాదవశాత్తూ అగ్ని ప్రమాదం ట్రాక్టర్, గడ్డివాము దగ్ధం

వరంగల్

వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామ శివారు కొత్తపల్లి రోడ్డు పై ట్రాక్టర్లో తరలిస్తున్న గడ్డివాము కు ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. గడ్డివాము తో పాటు ట్రాక్టర్ దగ్ధం అయింది. ప్రమాదాన్ని గ్రహించి డ్రైవర్ మరియు సహాయకులు తప్పించుకున్నారు.

ప్రమాద స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేసారు.

## మిషన్ భగీరథ అధికారులతో కోరుట్ల ఎమ్మెల్యే రివ్యూ మీటింగ్

మెట్ పల్లిమిషన్ భగీరథ ప్రగతి పరిస్థితులపై కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పంపును సందర్శించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో మిషన్ భగీరథ పైపులైన్ పనులు, శుద్ధి కేంద్రాల నిర్వహణ, నీటి సరఫరా సమస్యలు, గ్రామాల్లో తాగునీటి అవసరాలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందేల తగిన చర్యలు తీసుకోవాలని, ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వేసవి దృష్ట్యా తాగునీటికి ఏలాంటి ఇబ్బందులు రానివద్దని అందుకు తగిన చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ప్రజలకు మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఎక్కడైనా లీకేజీ సమస్య ఉన్నచో వెంటనే సరి చేయాలన్నారు. వంద శాతం పైప్ లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, తద్వార నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి నల్లా ద్వారా మంచి నీటిని అందించాలని అన్నారు.

## వడగళ్ల వర్షానికి పంట నష్టం

మెదక్ జిల్లా

మాసాయిపేట మండలం పోతాన్ పల్లి లో ఆదివారం సాయంత్రం కురిసిన వడగళ్ల వర్షానికి ఎకరా వరి పొలం పంట



పంట నష్టం వాటిల్లిందని రైతు తలారి విజయ్ ఆవేదన వ్యక్తంచేశారు. అప్పు చేసి వ్యవసాయం చేస్తున్నానని పూర్తిగా పంట నష్టం జరుగుతుందని ప్రభుత్వం అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

## మహిళ కడుపులో కాటర్ ప్యాడ్స్ కమాపూర్ ఆసుపత్రిలో దారుణం

హనుమకొండ

ప్రసవమైన మహిళ కడుపులో వైద్యులు నిర్లక్ష్యంతో కాటన్ ప్యాడ్స్ మరిచిపోయారని సదరు బాలింత కుటుంబ సభ్యులు ఆరోపించారు. డాక్టర్ల నిర్లక్ష్యంతో ప్రాణాపాయస్థితిలో మహిళ వుందని ఆరోపించారు.

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో ఘటన,

గత వారం రోజుల క్రితం మండల కేంద్రంలోనీ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం కోసం వచ్చిన ఉప్పల్ గ్రామానికి చెందిన తిరుమల అనే మహిళ డెలివరీ సమయంలో వైద్యులు క్లాత్ అందులోనే వుంచి కుట్లు వేయడంతో ప్రాణాపాయ స్థితికి చేరుకుంది. కడుపు నొప్పితో మళ్ళీ ఆసుపత్రికి వచ్చింది. చాలా సేపటివరకు వైద్యులు ఎవరు రాకపోగా హాస్పిటల్ ఆయవైద్యం చేసింది. అందుబాటులో లేని వైద్యులు, ఫోన్ కాల్ ద్వారానే వైద్య తతంగం సిబ్బంది నడిపిస్తున్నారు. ఆసుపత్రికి వచ్చి మహిళా బంధువులు నిలదీయగా ఘటన వెలుగు చూసింది. డెలివరీ సమయంలో మొబైల్ ఫోన్లు మాట్లాడుతూ పట్టింపు లేకుండా వ్యవహరించారని బంధువుల ఆరోపణ.ఆసుపత్రి సూపరిండెంట్ నిర్లక్ష్య ధోరణి తోనే వైద్య సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.మరో ప్రాణం బలి కాకముందే ఆసుపత్రి ప్రక్షాళనకు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## శ్రీతేజ్ ను పరామర్శించిన అల్లు అరవింద్

అల్లు అర్జున్ సినిమా రిలీజ్ లో గాయపడిని శ్రీతేజ్ ను అల్లు అరవింద్ పరామర్శించారు. రీ హాబ్ కు వెళ్లి డాక్టర్లను



కలిసి శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్ఆరు. శ్రీ తేజ్ కోలుకోవటం కోసం మా కుటుంబం అంతా ఎదురుచూస్తోంది. శ్రీతేజ్ రోజురోజుకు కోలుకుంటున్న విషయం ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. శ్రీ తేజ్ చికిత్సకు సహకరిస్తున్నారు అని డాక్టర్లు వెల్లడించారు. ఇప్పటికే 2 కోట్లు శ్రీతేజ్ అకౌంట్ లో అల్లు అర్జున్, పుష్ప యూనిట్ డిపాజిట్ చేసారు. త్వరలోనే శ్రీ తేజ్ మనందరి మధ్య సాధారణల పిల్లల్లా ఉంటాడని అరవింద్ ఆశాభావం వ్యక్తం చేసారు.

## సైనిక్ స్కూళ్లలో తెలంగాణ విద్యార్థులను కొనసాగించాలి

హైదరాబాద్ కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేట్ తో మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడాదరు. ఆంధ్రా ప్రదేశ్ లో సైనిక్ స్కూల్స్ లో 67 శాతం లోకల్ కోటా లో తెలంగాణ విద్యార్థులను తొలగించడం తో వేలాది విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. తెలంగాణ లో సైనిక్ స్కూల్స్ ప్రారంభం అయ్యే వరకు తెలంగాణ విద్యార్థులకు ఆంధ్రా లో లోకల్ కోటా ఉంచాలని ఫోన్ లో విజ్ఞప్తి చేసారు. మంగళవారం సాయంత్రం కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రిని మెదక్ ఎంపీ రఘునందన్ రావు కలవనున్నారు.అప్పటివరకు తల్లిదండ్రులు సంయమనం తో ఉండాలని విజ్ఞప్తి చేసారు.

## మహిళ అనుమానస్పద మృతి

విజయనగరంగరివిడి మండలం అర్తమూరులో ఓ మహి అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. గ్రామానికి చెందిన యడ్ల ఆసిరి తల్లి (70) సోమవారం తెల్లవారుజామున నిప్పు అంటించుకుని మృతి చెందినట్టు గ్రామానికి చెందిన కొందరు, ఇంటిలో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలి అగ్నికి ఆహుతయినట్టు మరికొందరు చెబుతున్నారు.ఆమె గత నాలుగు మాసాలుగా కాలుకి ఇన్ఫెక్షన్ అయి తీవ్రంగా బాధ పడటంతో నొప్పి తీవ్రతను భరించలేక నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుందన్ని ఇంకొందరు అంటున్నారు. ఏది ఏమైనప్పటికి ఒక నిండు ప్రాణం అగ్ని కీలలకు ఆహుతయిన దుర్ఘటన ఇవాళ ఉదయం ఆ గ్రామంలో చోటు చేసుకుంది.

# నన్ను నేరుగా వచ్చి కలవచ్చు సమస్యలు పరిష్కరిస్తాం జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్, మే 5,

పోలీస్ శాఖ అనేది ప్రజలకు సేవ చేయడానికి ఉండే సంస్థ . ప్రతి పౌరుడు తమ సమస్యలు, అభ్యర్థనలు, ఫిర్యాదులు నేరుగా పోలీస్ అధికారులకు తెలియజేసే హక్కు కలిగి ఉన్నారు. ఇందులో ఎటువంటి మధ్య వర్తులు, సిఫార్సు దారులు, లేదా ఎలాంటి ఇతర ప్రభావాలు అవసరం లేదు . మేము (పోలీస్ అధికారులు) ప్రజల అవసరాలను గౌరవించి, పారదర్శకమైన విధానాలతో స్పందించడానికి కట్టుబడి ఉన్నాము. ఎస్పీ కార్యాలయం ప్రతిరోజూ విధి విధానాల ప్రకారం ప్రజలకు అందు బాటులో ఉంటుంది. ప్రజలు తమ సమస్యలను స్వయంగా చెప్పగలగడం ద్వారా సమస్యల పరిష్కారం త్వరితగతిన జరుగుతుంది. మధ్యవర్తులు లేదా ఇతరులు ప్రజల సమస్యలను తప్పుగా లేదా వక్రీకరించిన విధంగా తెలియజేసే అవకాశం ఉన్నందున, ప్రజల సౌకర్యార్థం మరియు న్యాయం అందించాలనే ఉద్దేశ్యంతో, ఎవరూ ఎటువంటి భయాందోళన లేకుండా మహబూబాబాద్ జిల్లా ప్రజలు నేరుగా జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపీఎస్ ని కలవ వచ్చునని, పోలీసులు, ప్రజల స్నేహితులుగా ఉండే విధంగా వ్యవహరించడమే మా లక్ష్యమని ఒక ప్రకటన ద్వారా తెలపడం జరిగింది.

# యువజన కాంగ్రెస్ కార్యాలయాన్ని సందర్శించిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం..

జమ్మికుంట మే 5,

జమ్మికుంట పట్టణానికి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మరియు యువజన కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ముత్యం శంకర్, పట్టణంలోని వివాహ వేడుకకు ఆదివారం హాజరయ్యారు. అనంతరం యువజన కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్, ఆహ్వానం మేరకు జమ్మికుంట లోని వారి యువజన కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్, వారిని శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో; కాంగ్రెస్ పార్టీ నాయకులు కుమారస్వామి, యువజన కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గం ఉపాధ్యక్షులు చిన్నాల శ్రీకాంత్, యువజన కాంగ్రెస్ జమ్మికుంట మండల ప్రధాన కార్యదర్శి బిజిగిరి శ్రీకాంత్, కార్యదర్శులు వొల్లాల రవి, యేబూషి అజయ్, నాయకులు పచ్చిమట్ల భాను, వెంకటేష్, ఎండీ.జావిద్, నల్వాన్, చిరంజీవి, సత్యనారాయణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు...

# గార్డియన్ స్కూల్ లో 50% ఫీజు రాయితీతో అడ్మిషన్లు ప్రారంభం...!

జమ్మికుంట మే 5,

ప్రస్తుత పరిస్థితులలో ప్రైవేటు పాఠశాలలు అధిక ఫీజుల దోపిడీ లక్ష్యంగా పనిచేస్తున్నటువంటి క్రమంలో. జమ్మికుంట కొత్తపల్లిలోని సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గార్డియన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 50 శాతం ఫీజు రాయితీ తో పేద మధ్యతరగతి పిల్లలకి నాణ్యమైన ఇంగ్లీష్ విద్యను అందిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ రాముల కుమార్, తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేదవాడు ప్రైవేట్ పాఠశాలలో చదవాలనేటువంటి కోరికను నెరవేర్చుటకు గార్డియన్ స్కూల్ నీ స్థాపించామని ఇట్టి సదవకాశాన్ని జమ్మికుంట పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరు తమ పిల్లలను గార్డియన్ పాఠశాలలో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని అడ్మిషన్ల కోసం పాఠశాల కార్యాలయ ఫోన్ నెంబర్ (8121266344) గల నెంబర్ కు సంప్రదించగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ అంకుష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు...

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను పునః ప్రారంభించాలి అమలాపురం

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్ష పదవి చేపట్టిన చిర్ల జగ్గిరెడ్డి తొలిసారిగా అమలాపురం ప్రెస్ క్లబ్లో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం మూసివేసింది.రాష్ట్ర ప్రభుత్వం రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు చేయకుండా దళారులకు మద్దతు పలుకుతోంది. వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను పునః ప్రారంభించాలి. కమీషన్ల కోసం అమరావతి పనులను ప్రారంభించడం కాదు. ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. లేకపోతే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉద్యమం చేపడుతుందని అన్నారు.

# పోలవరం ప్రాజెక్టు లో అంతర్జాతీయ నిపుణుల బృందం పర్యటన

ఏలూరుపోలవరం ప్రాజెక్ట్ ను సోమవారం నుంచి అంతర్జాతీయ నిపుణుల బృందం సందర్శించి అక్కడ జరుగుతున్న వివిధ నిర్మాణ పనులను పరిశీలించి జలవనరుల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులకు తగు సూచనలు సలహాలు ఇవ్వనుంది.అంతర్జాతీయ నిపుణులు రిచర్డ్ డొన్నెల్లి, సీన్ హించ్ బెర్జర్, జియాన్ఫ్రాంకో డి సికో, డేవిడ్ బి పాల్ ప్రాజెక్ట్ నిర్మాణ పనులను పరిశీలించారు.

# లిక్కర్ స్కామ్ లో మరింత దూకుడు...

తిరుపతి, మే 5,

ఏపీ లిక్కర్ స్కాంపై స్కాన్ చేస్తున్న సిట్ మరింత దూకుడు పెంచింది. కేసులో కింగ్ పిన్ గా వ్యవహరించిన రాజ్ కేసిరెడ్డి అరెస్టుతో లిక్కర్ డొంకంతా కదులుతోందన్న టాక్ విన్పిస్తోంది. సిట్ విచారణలో కేసిరెడ్డి చెప్పిన్న కీలక విషయాల ఆధారంగా విచారణనను మరింత స్పీడప్ చేసింది. ఏపీ లిక్కర్ స్కాంతో సంబంధం ఉందటూ వచ్చిన ఆరోపణల నేపథ్యంలో మరింత మందిని అరెస్ట్ చేసేందుకు సిట్ పావులు కదుపుతుందని సమాచారం.ఈ కేసులో లింక్ ఉన్న ప్రతీ ఒక్కరిని అరెస్ట్ చేసి విచారించేందుకు రంగం సిద్ధం చేసినట్లు ఏపీ రాజకీయవర్గాల్లో టాక్ విన్పిస్తోంది. ఇప్పటివరకు సాగిన విచారణ ఓ లెక్క?ఇకనుంచి సాగనున్న విచారణ మరో లెక్క అనేవిధంగా సిట్ విచారణ కొనసాగనుందని తెలుస్తోంది. ఎందుకంటే ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ గత ప్రభుత్వంలో సీఎంఓ లో పనిచేసిన టీం పెట్టుకున్న పిటిషనును ఏపీ హైకోర్టు విచారించింది. అరెస్టు నుంచి మినహాయింపు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేయడంతో'..గత ప్రభుత్వంలో జగన్ ఓఎస్డీగా పనిచేసిన క్రిష్ణమోహన్ రెడ్డి, ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, బాలాజీ గోవిందప్ప అరెస్ట్ తప్పదా అన్న చర్చ జరుగుతోంది.ఇప్పటికిప్పుడు బెయిల్ ఇవ్వలేమని ఏపీ హైకోర్టు తేల్చి చెప్పడంతో వీరంతా భయపడుతున్నారట. ఎందుకంటే లిక్కర్ స్కాంలో అరెస్టు అయిన కొందరు నిందితులు తమ పేర్లు చెప్పినందున ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఈ ముగ్గురు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లను దాఖలు చేశారు. నిందితులు తమ పేర్లు చెప్పారని, వారి రిమాండ్ రిపోర్టులు ఆధారంగా తమను అరెస్టు చేసే అవకాశం ఉందని గత ప్రభుత్వంలో ఓఎస్డీగా పనిచేసిన క్రిష్ణమోహన్ రెడ్డి, అప్పటి సీఎంవో కార్యదర్శి ధనుంజయరెడ్డిని అరెస్ట్ భయం వెంటాడుతోందట.అంతేకాదు మద్యం స్కాంలో పాత్రధారిగా అనుమానిస్తున్న బాలాజీ గోవిందప్ప సైతం అరెస్ట్ భయంతో టెన్షన్ పడుతున్నారని టాక్. బెయిల్ ఇవ్వడం కుదరదని హైకోర్టు స్పష్టం చేయడంతో త్వరలోనే ఈ ముగ్గురు అధికారులు అరెస్ట్ తప్పదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏపీ లిక్కర్ స్కాం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కేసిరెడ్డిని సిట్ కస్టడీలోకి తీసుకొని విచారిస్తోంది. అయితే కస్టడీలో కేసిరెడ్డి పొంతనలేని





సమాధానాలు చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది.సిట్ అధికారులు మాత్రం మరింత లోతుగా ప్రశ్నించేందుకు ప్రయత్నిస్తున్నారు. అసలు లిక్కర్ స్కాంకు బీజం వేసిందెవరు? ఇందులో ఎవరెవరు ఉన్నారు.? వారి మధ్య ఎలాంటి సంబంధాలున్నాయి? ఎంత నగదు లావాదేవీలు జరిగాయి.? మొత్తం ఎంత మద్యం సేల్ అయింది? మిగిలిన నిందితులెవరు? కీలక సాక్షిగా భావిస్తున్న విజయసాయిరెడ్డి చెప్పినదంతా నిజమేనా? అన్న ప్రశ్నలు సంధిస్తూ సమాధానాలు రాబట్టే అవకాశం ఉందని పలువురు విశ్లేషకులు అంటున్నారు మరోవైపు కేసులో నిందితులుగా ఉన్న రాజ్ కేసిరెడ్డి, చాణక్య ఆస్తుల వివరాలను సిట్ సేకరిస్తోంది. స్కామ్ జరిగిన సమయంలో కొనుగోలు చేసిన ఆస్తుల వివరాలివ్వాలని రిజిస్ట్రార్ శాఖ ఐజీకి లేఖలు ఇచ్చింది సిట్. ఏపీతో పాటు తెలంగాణ ఐజీ రిజిస్ట్రార్కు కూడా లేఖ రాసింది. కేసిరెడ్డి భారీగా ఆస్తులు కొనుగోలు చేసినట్లు గుర్తించారు సిట్అధికారులు. మరోవైపు కేసిరెడ్డి పీఏ పైలా దిలీప్ ను కూడా సిట్ అధికారులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కేసిరెడ్డి ఆర్థిక వ్యవహారాలన్నీ దిలీప్ చూశాడని సిట్ గుర్తించింది.మొత్తానికి ఏపీ లిక్కర్ స్కాం తేనెతుట్టె కదులుతోందన్న వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. గత ప్రభుత్వంలో జగన్ ఓస్డీగా పనిచేసిన అధికారుల అరెస్ట్ కు ఏపీ హైకోర్టు లైన్ క్లియర్ చేయడంతో?ఇక ఈ తర్వాత అరెస్టులు పెద్ద తలకాయలదాకా వెళు ్ందా అన్న అనుమానాలు వైసీపీ వర్గాల్లో విన్పిస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఏదైనా జరగవచ్చు..జరగకపోవచ్చు అనే టాక్ విన్పిస్తోంది. అయితే సిట్ ఇంకా ఎవరెవరిని అరెస్టు చేస్తుంది అన్నది చూడాలి.

# ఎన్టీఆర్ కు భారతరత్న...

విజయవాడ, మే 5

నందమూరి తారక రామారావుఉ పేరే ఒక ప్రభంజనం. ఆ పేరులో ఉంటుంది ఓ వైబ్రేషన్. పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చిన రికార్డ్ ఆయనకే సొంతం. తెలుగువారి ఆత్మగౌరవాన్ని దశ దిశలా వ్యాపింపజేసిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్. పేద, బడుగు వర్గాల కోసం ఎన్టీఆర్ కృషి చేశారు. వెండితెరపై భగవంతుడిగా సాక్షాత్కారం ఇచ్చారు ఎన్టీఆర్. ఎన్నెన్నో పౌరాణిక పాత్రలతో మెప్పించారు. సినీ రంగంలో ఉంటూనే సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవారు. రాజకీయాల్లోకి వచ్చి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. అటువంటి మహోన్నత శిఖరానికి సరైన గుర్తింపు లభించలేదు. భారతరత్న పురస్కారం అందని ద్రాక్షగా ఉంది. అయితే తాజాగా కేంద్ర ప్రభుత్వం ఎన్టీఆర్ విషయంలో సానుకూలంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో నిన్ననే అమరావతి పునర్నిర్మాణ ప్రారంభోత్సవ సభలో ఎన్టీఆర్ ను స్మరించుకున్నారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. దీంతో ఎన్టీఆర్ కు భారతరత్న పురస్కారం ఇవ్వాలన్న విన్నపం మరోసారి తెరపైకి వచ్చింది.నందమూరి తారక రామారావు చనిపోయి 29 సంవత్సరాలు అవుతోంది. ఆయన తెలుగు ప్రజల మదిలో చిరస్థాయిగా ఉన్నారు. కానీ ఇంతవరకు ఆయనకు అత్యున్నత పురస్కారం భారతరత్న అందివ్వలేదు. ఎన్టీఆర్కు భారతరత్న ఇవ్వాలని చాలా రోజులుగా డిమాండ్లు, విజ్ఞప్తులు వినిపిస్తున్నాయి. టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు నుంచి సాధారణ వ్యక్తుల వరకు అందరూ అదే డిమాండ్ వినిపిస్తున్నారు. కాంగ్రెస్ హయాంలో చేసిన తప్పులను సరిదిద్దుతామని పదేపదే నరేంద్ర మోడీ చెప్పుకొస్తున్నారు. కానీ ఎన్టీఆర్ విషయంలో మాత్రం ఆలోచించడం లేదు. ప్రతి రిపబ్లిక్ డేకు ముందు ఎన్టీఆర్ భారతరత్న ఇస్తారని తెలుగువారు ఎదురుచూడడం.. తరువాత నిరాశలో మునిగిపోవడం జరుగుతోంది. ప్రస్తుతం ఎన్డీఏలో తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామిగా ఉండడం.. కేంద్ర పెద్దలు సైతం సానుకూలంగా ఉ ండడంతో వచ్చే ఏడాదికైనా ఎన్టీఆర్ కు భారతరత్న ప్రకటించాలని ఏపీ ప్రజలు కోరుతున్నారు.పొరుగున ఉన్న తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ కుమరణానంతరం భారతరత్న పురస్కారం



దక్కింది. కానీ ఎన్టీఆర్ విషయంలో మాత్రం అన్యాయం జరుగుతూనే ఉంది. దీనికి కారణాలు లేకపోలేదు. ఆంధ్రప్రదేశ్లో కాంగ్రెస్ పార్టీని మట్టి కరిపించారు నందమూరి తారక రామారావు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఏలుబడి ఉన్న క్రమంలో ప్రాంతీయ పార్టీలకు దిక్సూచిగా నిలిచారు. అందుకే కాంగ్రెస్ పార్టీకి ఎన్టీఆర్ అంటే విపరీతమైన కోపం. అయితే ఎన్టీఆర్ మరణించిన తర్వాత టిడిపి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఉండేది. ఆ సమయంలో కూడా ఎన్టీఆర్కు భారతరత్న అవార్డు లభించలేదు. తరువాత యూపీఏ, యూపీఏ 2 ప్రభుత్వాలు వచ్చాయి. అప్పుడు కూడా కనీస పరిగణలోకి తీసుకోలేదు. మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ మూడోసారి అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు కూడా ఎన్టీఆర్ కు భారతరత్న ప్రకటించలేదు.అయితే ఇప్పుడు ఎన్డీఏలో తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామిగా ఉంది. ప్రధాని మోదీ చంద్రబాబు విన్నపాలను మన్నిస్తున్నారు. అదే సమయంలో ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా దగ్గుబాటి పురందేశ్వరి ఉన్నారు. ఆమె ఎన్టీఆర్ కుమార్తె. చంద్రబాబుతో పాటు పురందేశ్వరి ప్రయత్నిస్తే నందమూరి తారక రామారావుకు తప్పకుండా భారతరత్న వచ్చే అవకాశం ఉంది. ప్రధాని మోదీ తాజాగా ఎన్టీఆర్ ప్రస్తావన తీసుకురావడంతో.. వచ్చే ఏడాది తప్పకుండా భారతరత్న ఇస్తారని ప్రచారం జరుగుతోంది. అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# మిస్ వరల్డ్ పోటీలకు ముస్తాబయిన భాగ్యనగరం

హైదరాబాద్

మిస్ వరల్డ్ పోటీల నిర్వహణకు హైదరాబాద్ సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. వందకు పైగా దేశాల నుంచి వచ్చే అందాల భామలకు స్వాగతం చెప్పేందుకు ప్రత్యేకంగా శంషాబాద్ ఎయిర్ పోర్టును తీర్చిదిద్దారు. తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో విదేశీ ప్రతినిధులకు స్వాగతం పలికేందుకు అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. నేటి నుంచి విదేశీ ప్రతినిధుల రాక పెరగనుంది. ఇందుకోసం ఎయిర్ పోర్ట్ లో ప్రత్యేక లాంజ్ లతో పాటు, హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేశారు. అలాగే తెలంగాణ పర్యాటక ప్రాంతాలు, ప్రత్యేక చిహ్నాలతో కూడిన స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. తెలంగాణ జరూర్ ఆనా (ఓబీబీబీ ఎతితితితి ఐత్రీజీనీణజీనిజీ) నినాదం ప్రతి చోటా కనిపించేలా, వినిపించేలా పర్యాటకశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

# జూబ్లీహిల్స్ లో "బూమ్ బూమ్"

## థాయిలాండ్ యువతితో పాటు బంగ్లాదేశ్ యువతి చేత వ్యభిచారం..

## సర్వీస్ అపార్ట్ మెంట్ కేంద్రంగా సెక్స్ రాకెట్.

## థాయ్ లాండ్, బంగ్లాదేశ్ నుంచి యువతులను రప్పించి దందా.

హైదరాబాద్

జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 9లో సర్వీస్ అపార్ట్మెంట్ లో వ్యభిచారం చేస్తూ ఇద్దరు విదేశీ యువతులు పట్టుబడ్డారు. థాయిలాండ్ యువతితో పాటు బంగ్లాదేశ్ యువతి పోలీసులకు దొరికిపోయింది. సర్వీస్ అపార్ట్ మెంట్ కేంద్రంగా సెక్స్ రాకెట్ నడుస్తోంది. బంగ్లా యువతి (23).గత డిసెంబర్ లో అక్రమంగా సరిహద్దు దాటి వచ్చింది. థాయ్ లాండ్ యువతి(30) డిసెంబర్ లో ట్రావెల్ వీసాతో స్నేహితుడి కోసం వచ్చి చెన్నై మీదుగా హైద్రాబాద్ వచ్చింది.బ్యాంకాక్ లోని వ్యభిచార నిర్వాహకురాలి సూచనలతో నాయక్ అనే వ్యక్తి నడిపించే బ్రోతల్ హౌస్ లో వ్యభిచారం ప్రారంభించారు. బంగ్లాదేశ్ నుంచి యువతిని తెచ్చిన ఏజెంట్.. థాయ్ లాండ్ మహిళ, బ్రోతల్ హౌస్ నిర్వాహకుల మీద జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసారు.

# మహానాడుకు ఏర్పాట్లు ఏర్పాట్లు చేస్తున్న మంత్రులు ఎమ్మెల్యేలు పార్టీ ఇంచార్జిలు

బద్వేలుకడప జిల్లాలో టీడీపీ మహానాడు నిర్వహించేందుకు సీకే దిన్నె మండలం చెర్లోపల్లి, పబ్బాపురం గ్రామాల పరిధిలోని భూములను... పార్టీ అధిష్ఠానం అనుమతితో తెలుగుదేశం నేతలు ఎంపిక చేశారు. ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, రాంగోపాల్ రెడ్డి, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణరాజు, వాస్తు సిద్ధాంతి జయరామిరెడ్డి కడపలో పలు ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించారు. చివరికి సీకే దిన్నె మండలంలోని భూములను ఎంపిక చేశారు. మహానాడు ప్రాంగణం, భోజన ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్ కు స్థలాలను గుర్తించారు. ఈ స్థలం కడపను తిరుపతి, చిత్తూరు, అనంతపురం, హైదరాబాద్ మార్గాలతో కలిపేదిగా ఉందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి ద్వారా భూముల యాజమానుల నుంచి నిరభ్యంతర పత్రాలు తీసుకున్నారు. ప్రత్యేక సమావేశంలో శాటిలైట్ మ్యాప్ ద్వారా మహానాడుకు అవసరమైన స్థలాల వివరాలను బృందానికి ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి వివరించారు. మరింత స్థలం అవసరమైనా రైతుల అనుమతి తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 7న పనులకు భూమిపూజ నిర్వహించి శరవేగంగా పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ నెల 27 నుంచి మూడు రోజులపాటు మహానాడు జరగనుంది.

# నంగునూరు మండలంలో దర్గాపల్లి లో అకాల వర్షానికి నష్టపోయిన

నంగునూరుసిద్దిపేట నియోజకవర్గంలో 1,800 ఎకరాలలో మామిడి పంట నష్టం జరిగింది.వ్యవసాయ శాఖ, హార్టికల్చర్ శాఖ, రెవెన్యూ శాఖ, అధికారులు ఎన్యుమరేషన్ చేసి తక్షణమే సహాయం అందించాలి.రైతులు ఇప్పటికే పంట నష్టపోయి తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

# ఆంధ్రా అంటే అమరావతి ఒక్కటే కాదు.. వైసీపీ కొత్త అస్త్రం

కర్నూలు, మే 5,

రాజధాని విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విఫలమైంది. దాని పర్యవసానాలను 2024 ఎన్నికల్లో అనుభవించింది. అయినా సరే అమరావతి రాజధాని విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంకేతాలు పంపుతోంది. మరో కొత్త ప్రచారానికి తెరలేపింది. అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా హాజరై అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. అత్యంత వేడుకగా ఈ కార్యక్రమం కొనసాగింది. జాతీయస్థాయిలో సైతం గుర్తింపు సాధించింది. కూటమి ప్రభుత్వానికి ఎనలేని ఖ్యాతిని తెచ్చింది. ప్రధాని నరేంద్ర మోడీ సైతం తమ వంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. మూడేళ్లలో ప్రజా రాజధానిని చంద్రబాబు నిర్మించి తీరుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే ప్రజలు కూడా అమరావతి రాజధాని నిర్మాణం శరవేగంగా జరుగుతుందని ఆశిస్తున్నారు. సరిగ్గా ఇటువంటి సమయంలోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సరికొత్త ప్రచారానికి దిగుతోంది.అమరావతి రాజధాని పునర్నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డికి ప్రత్యేక ఆహ్వానం పంపింది ప్రభుత్వం. కానీ కార్యక్రమానికి ఆయన గైర్హాజరయ్యారు. ఆపై గతం మాదిరిగా అమరావతి టెండర్ల పైన విమర్శలు చేస్తున్నారు. ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ఆ పార్టీ సోషల్ మీడియా సైతం ఇదే అంశాన్ని తెరపైకి తెచ్చింది. ప్రభుత్వం భారీగా అప్పులు చేసి అమరావతికి ఆ మొత్తాన్ని పరిమితం చేస్తోందని ఆరోపిస్తోంది.

ఆంధ్ర అంటే ఒక్క అమరావతి మాత్రమే కాదని.. ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమ ప్రాంతాలు ఉన్నాయని గుర్తుచేస్తోంది. పాలనా వికేంద్రీకరణ అన్నది లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. గత రెండు రోజులుగా వైసీపీ సోషల్ మీడియా దీనిపైనే పెద్ద ఎత్తున ట్రోల్ చేస్తోంది.మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ మీడియాతో మాట్లాడారు. అప్పులు చేసి అమరావతికి పెట్టడం దారుణమన్నారు. ఇది కచ్చితంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని పణంగా పెట్టడమేనని పేర్కొన్నారు. రాజధాని ప్రాంతమైన అమరావతికి కృష్ణానది ముంపు ప్రమాదం ఉందని చెప్పారు. నిజంగా ఆ భయం లేకపోతే దాదాపు రూ.1100 కోట్లతో ఐదు ఎత్తిపోతల పథకాలు ఎందుకు నిర్మిస్తారని ప్రశ్నించారు. వాటిని నిర్మించకపోతే అమరావతికి రుణాలు ఇవ్వలేమని బ్యాంకులు హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేశారు. దేశంలో జాతీయ రహదారులకు కిలోమీటర్ కు 20 కోట్లు ఖర్చు పెడుతుంటే.అమరావతిలో 59 కోట్లు ఎందుకు ఖర్చు పెడుతున్నారని ప్రశ్నించారు సాకే శైలజానాథ్. తద్వారా కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేశారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మూడు రాజధానులఅంశాన్ని తెరపైకి తెచ్చింది. అది వర్కౌట్ కాలేదు. అమరావతిని ఎక్కడ పరిస్థితుల్లో అంగీకరించకూడదని భావించింది. కానీ 2024 ఎన్నికల్లో అధికారం కోల్పోవడంతో సీన్ మారింది. మళ్లీ అమరావతికి కొత్త కళ ప్రారంభం అయ్యింది. అంగరంగ వైభవంగా అమరావతి పునర్నిర్మాణ ప్రారంభోత్సవం చేసుకుంది. అయితే ఆ క్రెడిట్ కూటమి ప్రభుత్వానికి దక్కకూడదని ఇప్పుడు కొత్త ఆలోచనలతో ముందుకెళ్తోంది వైయస్సార్ కాంగ్రెస్. ప్రజలకు వాస్తవాలు వివరించే ప్రయత్నం చేస్తోంది. మరి అవి ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి.

# సంక్షేమ పథకాలపై భారీ సభ

మిర్యాలగూడ

కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,నియోజకవర్గం లో చేసిన అభివృద్ధి ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు  నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం లోని స్థానిక క్యాంపు గ్రౌండ్లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ( బిఎల్ఆర్ )ఆధ్వర్యంలో కాంగ్రెస్ సంక్షేమ పథకాలపై ప్రచార సంబరాలు పేరిట భారీ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి,ఎమ్మెల్సీ కె.శంకర్ నాయక్ లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఈ కార్యక్రమం లో సినీ, జానపద గాయని మంగ్లీ తనపాటలద్వారా ఊర్రుతలుగించింది.

ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున తరలి వచ్చిన ప్రజలు కేరింతలు కొట్టారు. ఇదే వేదికగా ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఆయన సతీమణి మాధవి, కుమారులు ప్రసన్న కుమార్ రెడ్డి,ఈశ్వర్ గణేష్ రెడ్డి లు పాల్గొన్నారు. బుల్లితెర నటులు డ్యాన్స్ లతో అలరించారు.

# పెద్దపల్లిలో నేతల మధ్య కోల్డ్ వార్

కరీంనగర్, మే 5,

ఇద్దరూ మాజీ ఎమ్మెల్యేలే. అంతేకాదు?వారిద్దరు సొంతపార్టీ నేతలే. కానీ ఎన్నడూ కలవరు..మాట్లాడుకోరు. సొంతపార్టీలో ఉంటూ ఇద్దరూ కలిసి అధికార పార్టీపై పోరాడాల్సింది పోయి?ఆధిపత్యపోరు కోసం కయ్యానికి కాలుదువ్వుతున్నారట. జిల్లా అధ్యక్షుడికి సహకరించకుండా?మాజీ ఎమ్మెల్యే దూరంగా ఉండడం ఇప్పుడు పెద్ద చర్చకే దారి తీస్తుంది. అయితే ఆ మాజీ ఎమ్మెల్యే వ్యహరిస్తున్న తీరు ఇప్పుడు ఆ జిల్లా రాజకీయాల్లోనే కాదు..పార్టీలోను చర్చనీయాంశంగా మారింది. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కు మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి మధ్య పచ్చి గడ్డి వేస్తే భగ్గుమంటోంది. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, జిల్లా అధ్యక్షుడు చందర్ ఇద్దరూ సఖ్యతగా ఉన్నప్పటికి..మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాత్రం వీళ్లతో కలిసి రావడం లేదట. జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమాలకు సైతం అంటిముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారట. తన నియోజకవర్గంలో మరొకరి పెత్తనాన్ని మనోహర్ రెడ్డి అస్సలు సహించడంలేదని టాక్. దీంతో జిల్లా కేంద్రంలో నిర్వహించాల్సిన కార్యక్రమాలను సైతం ఎవరి పరిధిలో వారు నిర్వహించుకుంటున్నారు.ఏదైనా కార్యక్రమాన్ని నిర్వహించాల్సి వస్తే జిల్లా కేంద్రం పెద్దపల్లిలో కాకుండా రామగుండం, మంథనిలో నిర్వహిస్తున్నారట గలాబీ నేతలు. మనోహర్ రెడ్డి ఆదేశిస్తే తప్ప ఆయన అనుచరులు పార్టీ కార్యక్రమాలకు హాజరు కావడంలేదట. ఇలాంటి పరిస్థితుల్లో రామగుండం నుండి చందర్ తన శ్రేణులను తీసుకొస్తే..మనోహర్ రెడ్డి అనుచరులు రచ్చకు దిగుతున్నారట. దీంతో జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించే సమాశాలు కాస్తా రసాభాసగా మారుతున్నాయట. ఇటీవల ఎమ్మెల్సీ కవిత జిల్లాకు వచ్చిన సందర్భంలో ఇరువర్గాలు బాహాబాహికి దిగడంతో వర్గపోరు బహిర్గతంది.జిల్లా అధ్యక్షుడి హోదాలో కోరుకంటి చందర్ గోదావరి తల్లి కన్నీటి గోస పేరిట రామగుండం నుంచి కొండపోచమ్మసాగర్ వరకు పాదయాత్ర చేసి కేసీఆర్ ను కలిశారు. పాదయాత్రలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పాల్గొన్నప్పటికి..మనోహర్ రెడ్డి మాత్రం ఎక్కడా కన్పించకపోవడం చర్చనీయాంశమైంది.కనీసం పెద్దపల్లి మీదుగా సాగుతున్న పాదయాత్రకు సంఘీంభావం తెలపలేదట.జిల్లా అధ్యక్షుడిగా ఉన్న చందర్ కు మనోహర్ రెడ్డి పూర్తి స్థాయిలో సహకరించడం లేదనేది ఆ పార్టీలో అంతా ఓపెన్ గానే చెప్పుకుంటున్నారు. అందుకే జిల్లా అధ్యక్షుడిగా ఉన్న కోరుకంటి చందర్..అధికార పార్టీపై నిరసన కార్యక్రమాలు నిర్వహించాలన్నా..పార్టీ బలోపేతం కోసం ఏమైనా నిర్ణయాలు తీసుకోవాలన్నా కాస్తా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడిందట. ఇలా జిల్లా అధ్యక్షుడిని ముందుకు నడవ నీయకుండా రకరకాల డిమాండ్లతో మనోహర్ రెడ్డి అడ్డు పడుతుండడంతో ఏం చేయాలో అర్థంకాక కోరుకంటి తల పట్టుకుంటున్నారట. అందుకే తన నియోజకవర్గం వరకే కోరుకంటి పరిమితం అవుతున్నారంటూ నేతలు చెప్తున్నారు.ఓ పక్క నేతలంతా ప్రజా సమస్యలపై ఉద్యమించాలని పార్టీ అధిష్టానం చెప్తుంటే. పెద్దపల్లిలో మాత్రం నేతల మధ్య సఖ్యత లోపించి పార్టీ కార్యక్రమాలు అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి. అధికార పార్టీని ఢీకొని మరోసారి అధికారంలోకి రావాలంటే..కలిసి కట్టుగా నడవాల్సిన నాయకులు ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా ఉంటే ఎలా అంటూ పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. ఇలాగే ఉంటే రాబోయే రోజుల్లో కూడా మాజీల హోదాలోనే రాజకీయాలు సాగించాల్సి ఉంటుందంటూ సీనియర్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.పెద్దపల్లి జిల్లాలో ఇద్దరు నేతల మధ్య జరుగుతున్న ఇంటర్నల్ వార్ ను పార్టీ అధిష్టానం ఏ విధంగా చక్కదిద్దుతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. రాబోయే కొద్ది రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగబోతున్నాయి. ఇలాంటి సమయంలో ఇద్దరూ కలిసి ముందుకు నడిచి పార్టీని గెలిపించాల్సిన బాధ్యత ఇద్దరిపై ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. లోకల్ బాడీ ఎన్నికల్లో గులాబీ సత్తా ఏంటో చూపించాలని పార్టీ నేతలు కూడా కోరుతున్నారు. మరి రాబోయే రోజుల్లోనైనా ఇద్దరూ కలిసి ముందుకు నడుస్తారా లేక ఇలాగే అధిపత్యం కోసం పోట్లాడుకుంటారా అనేది చూడాలి.

# ముస్లిం దేశాల మద్దతు కోసం పాకిస్తాన్ యత్నం

లాహోర్, మే 3,

జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి, భారత్?పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచింది. ఈ దాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోగా, దీని వెనుక పాకిస్తాన్ సైన్యం మరియు ఉగ్రవాద సంస్థల ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వెలువడ్డాయి. భారత్ ప్రతీకార చర్యలకు సిద్ధమవుతుండగా, పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ యుద్ధాన్ని నివారించేందుకు అంతర్జాతీయ సహకారం కోరుతూ దౌత్యపరమైన ప్రయత్నాలు చేస్తున్నారు.పహల్గాంలోని బైసరన్ మైదానంలో జరిగిన ఈ దాడి, భారత్‌లోని పర్యాటకులపై లక్ష్యంగా సాగిన అత్యంత ఘోరమైన ఉగ్రదాడుల్లో ఒకటిగా నిలిచింది. ఈ దాడిని లష్కర్?ఎ?తొయిబా తో సంబంధం ఉన్న ది రెసిస్టెన్స్ ఫ్రంట్ సంస్థ తామే చేసినట్లు మొదట ప్రకటించినప్పటికీ, తర్వాత ఆ ప్రకటనను ఉపసంహరించుకుంది. ఈ దాడి వెనుక పాకిస్తాన్ సైన్యం మరియు ఉగ్రవాద సంస్థల సమన్వయం ఉన్నట్లు భారత గూఢచార సంస్థలు ఆరోపించాయి. ఈ ఘటన భారత్‌లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది, మరియు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం దీనికి గట్టి సమాధానం ఇవ్వాలని నిర్ణయించింది.

భారత్ ప్రతీకార చర్యలు

దౌత్య చర్యలు: భారత్ పాకిస్తాన్‌తో దౌత్య సంబంధాలను తెంచుకుంది, వాఘా సరిహద్దును మూసివేసింది, మరియు పాకిస్తానీ పౌరులకు జారీ చేసిన వీసాలను రద్దు చేసింది.

సింధు నదీ ఒప్పందం రద్దు: 1960లో రూపొందిన సింధు నదీ ఒప్పందాన్ని రద్దు చేస్తూ భారత్ నిర్ణయం తీసుకుంది, దీనిని పాకిస్తాన్ 'యుద్ధ చర్య'గా అభివర్ణించింది.

సైనిక సన్నద్ధత: భారత సైన్యం సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉంటూ, లైన్ ఆఫ్ కంట్రోల్ (ఒనీఅ) వెంబడి పాకిస్తాన్ రెచ్చగొట్టే చర్యలకు గట్టిగా స్పందిస్తోంది.

పాకిస్తాన్ భయాందోళన..

పహల్గాం దాడి తర్వాత భారత్ యొక్క కఠిన వైఖరి మరియు అంతర్జాతీయ మద్దతు పాకిస్తాన్‌ను తీవ్ర ఆందోళనలో ముంచెత్తింది. పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ యుద్ధాన్ని నివారించేందుకు వివిధ దేశాలతో దౌత్య సంప్రదింపులు జరుపుతున్నారు.ఐక్యరాజ్యసమితి: షరీఫ్ ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్‌తో సంప్రదించి, భారత్?పాకిస్తాన్ ఉద్రిక్తతలను తగ్గించేందుకు మధ్యవర్తిత్వం చేయాలని కోరారు. గల్ఫ్ దేశాలు: సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), మరియు కువైట్ రాయబారులతో సమావేశాలు నిర్వహించి, భారత్‌పై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. షరీఫ్ సౌదీ అరేబియా రాయబారితో జరిగిన సమావేశంలో దక్షిణాసియాలో శాంతి కోసం పాకిస్తాన్ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

చైనా మరియు రష్యా: పాకిస్తాన్ ఈ రెండు దేశాలను సంప్రదించి, భారత్ యొక్క సంభావ్య దాడిని నిరోధించేందుకు సహకారం కోరింది. పాకిస్తాన్ ఈ దాడిపై నిష్పక్షపాత విచారణ కోసం కూడా పిలుపునిచ్చింది. భారత్ నుంచి సంభావ్య దాడిని ఎదుర్కొనేందుకు పాకిస్తాన్ సైన్యం రక్షణాత్మక చర్యలను చేపట్టింది. లష్కర్?ఎ?తొయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌కు అదనపు భద్రత కల్పించడం, ఔ?ఇ వెంబడి సైనిక సన్నద్ధతను పెంచడం, మరియు సరిహద్దు ప్రాంతాల్‌ఆహార సరఫరా నిల్వలను పెంచడం వంటి చర్యలు తీసుకుంది. పహల్గాం దాడిని అనేక దేశాలు ఖండించాయి, మరియు భారత్ యొక్క ప్రతీకార చర్యలకు మద్దతు ప్రకటించాయి. ఈ ఘటన అంతర్జాతీయంగా పాకిస్తాన్‌ను ఒంటరిగా నిలబెట్టింది.

భారత్‌కు మద్దతు ప్రకటించిన దేశాలు

అమెరికా: యుఎస్ స్టేట్ సెక్రటరీ మార్కో రూబియో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో సంప్రదించి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్‌కు పూర్తి మద్దతు ప్రకటించారు. అమెరికా భారత్ యొక్క 'స్వీయ రక్షణ హక్కు'ను గుర్తించింది. యూరోపియన్ దేశాలు: యూకె, డెన్మార్క్, మరియు స్విట్జర్లాండ్ వంటి దేశాలు ఈ దాడిని ఖండించాయి మరియు భారత్‌తో సహకరించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయి. ఆసియా దేశాలు: దక్షిణ కొరియా జపాన్ భారత్ యొక్క 'ఉగ్రవాదానికి వ్యతిరేకంగా శూన్య సహనం' విధానాన్ని సమర్థించాయి.

పాకిస్తాన్‌కు మద్దతు ఇచ్చే దేశాలు

చైనా: భారత్?పాకిస్తాన్ సంబంధాల్లో చైనా సంప్రదాయకంగా పాకిస్తాన్‌కు మద్దతు ఇస్తోంది. పహల్గాం దాడి సందర్భంగా కూడా చైనా పాకిస్తాన్‌కు రాజకీయ మద్దతు అందించే అవకాశం ఉంది. టర్కీ మరియు అజర్బైజాన్: ఈ రెండు దేశాలు కాశ్మీర్ విషయంలో గతంలో పాకిస్తాన్‌కు మద్దతు ప్రకటించాయి మరియు ఈ సందర్భంలో కూడా అండగా నిలిచే సూచనలు ఉన్నాయి. బంగ్లాదేశ్: బంగ్లాదేశ్‌లో ఇటీవలి రాజకీయ సంక్షోభం తర్వాత ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం భారత్‌కు వ్యతిరేకంగా వైఖరి అవలంబిస్తోంది. ఈ నేపథ్యంలో, బంగ్లాదేశ్ పాకిస్తాన్‌కు మద్దతు ఇవ్వవచ్చని అంతర్జాతీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

బంగ్లాదేశ్ రాజకీయ సంక్షోభం..

బంగ్లాదేశ్‌లో 2024లో జరిగిన రాజకీయ అస్థిరత తర్వాత, ముహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభుత్వం భారత్‌తో సంబంధాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తూ, పాకిస్తాన్‌తో సన్నిహిత సంబంధాలను పెంచుకుంటోంది. బంగ్లాదేశ్ యొక్క ఈ కొత్త వైఖరి భారత్?పాకిస్తాన్ ఉద్రిక్తతల సమయంలో పాకిస్తాన్‌కు రాజకీయ ప్రయోజనం చేకూర్చవచ్చు. అయితే, బంగ్లాదేశ్ యొక్క ఆర్థిక మరియు రాజకీయ అస్థిరత దీనిని పరిమితం చేయవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.పహల్గాం దాడి భారత్?పాకిస్తాన్ మధ్య యుద్ధ సంభావ్యతను పెంచినప్పటికీ, రెండు దేశాలూ అణ్వాయుధ శక్తులు కావడం వల్ల జాగ్రత్తగా వ్యవహరించే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.భారత్ యొక్క గత ప్రతీకార చర్యలు (2016లో ఉరి, 2019లో పుల్వామా) సర్జికల్ స్ట్రైక్‌లు మరియు ఎయిర్‌స్ట్రైక్‌ల రూపంలో ఉన్నాయి. పహల్గాం దాడి కూడా ఇలాంటి ప్రతీకార చర్యలకు దారితీయవచ్చు.పాకిస్తాన్ సైన్యం ఈ దాడిని దేశీయ రాజకీయ సంక్షోభం నుండి దష్టి మళ్లించేందుకు ఉపయోగించుకున్నట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి. అమెరికా, ఐక్యరాజ్యసమితి, మరియు గల్ఫ్ దేశాలు రెండు దేశాలను శాంతియుత సంప్రదింపులకు ప్రోత్సహిస్తున్నాయి.చైనా మరియు రష్యా వంటి దేశాలు పాకిస్తాన్‌కు మద్దతు ఇచ్చినప్పటికీ, అవి కూడా ఓపెన్ యుద్ధాన్ని నివారించేందుకు ఒత్తిడి చేయవచ్చు.

# రేవంత్ పై హామీల ఒత్తిడి

హైదరాబాద్, మే 5



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై బహిరంగంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రూ.8.5 లక్షల కోట్ల అప్పులు చేసినట్లు ఆరోపిస్తూ, ఈ అప్పుల భారమే ప్రస్తుత ఆర్థిక సంక్షోభానికి కారణమని పేర్కొంటున్నారు. రాష్ట్ర బడ్జెట్‌ను సమతుల్యం చేయడానికి రేవంత్ "పద్మనాభ స్వామి లెక్కలు" వేస్తున్నట్లు స్వయంగా సెటైర్ వేసుకున్నారు. అయితే, ఆర్థిక సంక్షోభం ఒక్క తెలంగాణకే పరిమితం కాదు.. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం కూడా ఆదాయానికి మించిన ఖర్చులతో సతమతమవుతున్నాయి.తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక ఒడిదుడుకులను ఎదుర్కొనేందుకు కంచె గచ్చిబౌలి భూములను బాండ్ల రూపంలో మార్చి రూ.10 వేల కోట్ల నిధులను సమీకరించింది. ఈ నిధులతో కొన్ని ఎన్నికల హామీలు మహాలక్ష్మి పథకం, రైతు భరోసా వంటివి నెరవేర్చినప్పటికీ, ఇంకా అనేక హామీలు నెరవేర్చాల్సి ఉంది. రాష్ట్ర ఆదాయం పరిమితంగా ఉండటం, అప్పుల సేవకు భారీ మొత్తం కేటాయించాల్సి రావడంతో కొత్త పథకాలకు నిధుల కొరత ఏర్పడింది. రేవంత్ ఈ ఆర్థిక ఇబ్బందులను ప్రజలకు వివరిస్తూ,మునుపటి ప్రభుత్వం చేసిన అప్పులే ఈ పరిస్థితికి కారణమని వాదిస్తున్నారు.రేవంత్ రెడ్డి ఆర్థిక కష్టాలను వివరించినప్పటికీ, ప్రజలు ఈ "బీద రాగం"ను ఎంతవరకు ఒప్పుకుంటారనేది ప్రశ్న. రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో ఉచిత పథకాలు, ఆర్థిక సాయం వంటి హామీలతో ప్రజలను ఆకర్షిస్తారు. తెలంగాణలోనూ గతంలో అమలైన రైతు బంధు, ఆసరా పెన్షన్ వంటి పథకాలు ప్రజలను ఉచిత సాయానికి అలవాటు చేశాయి. ఒకసారి రూ.10 వేల సాయం అందిస్తే, తదుపరి రూ.20 వేల ఆశించే మనస్తత్వం ప్రజల్లో ఏర్పడింది. ఇప్పుడు "డబ్బులు లేవు" అనే వాదన ప్రజలను సంతృప్తి పరచడం కష్టం. ఆర్థిక ఇబ్బందులను అర్థం చేసుకోమని కోరడం కంటే, హామీలను నెరవేర్చడంపైనే ప్రజలు దృష్టి పెడతారు.తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా బలమైన సామర్థ్యం కలిగిన రాష్ట్రం. హైదరాబాద్ వంటి ఆర్థిక కేంద్రం, ఐటీ రంగం, రియల్ ఎస్టేట్, వ్యవసాయ ఆదాయం రాష్ట్రానికి గణనీయమైన నిధులను అందిస్తాయి. అయితే, రాజకీయ ప్రయోజనాల కోసం అనవసర హామీలు, అప్పులపై ఆధారపడటం వల్ల ఈ సంపద సరిగా వినియోగించబడటం లేదు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, అవసరమైన పథకాలకు మాత్రమే నిధులు కేటాయించి, మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తే తెలంగాణ ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడవచ్చు. ఉదాహరణకు, రాష్ట్రంలో రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయిస్తే దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం సాధ్యమవుతుంది.రేవంత్‌రెడ్డి ఆర్థిక సంక్షోభాన్ని నిర్వహించడంలో రాజకీయ ఒత్తిడిని కూడా ఎదుర్కొంటున్నారు.ప్రజలు హామీల నెరవేర్పును ఆశిస్తుండగా, ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నాయి. రాజకీయంగా జవాబుదారీగా ఉండాలనే ఒత్తిడితో, రేవంత్ తక్షణ ఫలితాలను ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నారు.అయితే, దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం కోసం కఠిన నిర్ణయాలు తీసుకోవడం అనివార్యం. ఉచిత పథకాలను పరిమితం చేసి, ఆదాయ వనరులను పెంచే విధానాలపై దృష్టి పెట్టడం ద్వారా ఈ సంక్షోభాన్నిఅధిగమించవచ్చు.ప్రజలు రాజకీయ హామీల కంటే ఆచరణీయ ఫలితాలను ఆశిస్తున్నారు. ఉచిత పథకాలు తాత్కాలిక ఊరటనిచ్చినప్పటికీ, ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాలు, ఆర్థిక స్థిరత్వం వంటివి దీర్ఘకాలంలో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయి. రేవంత్ రెడ్డి ఈ అంచనాలను అర్థం చేసుకొని, ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించడానికి పారదర్శకమైన, ఆచరణీయ విధానాలను అమలు చేయాల్సి ఉంది.లేకపోతే, ప్రజల అసంతృప్తి రాజకీయంగా ప్రతిపక్షాలకు లబ్ధి చేకూర్చే అవకాశం ఉంది.

# భగీరథ జయంతి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా మంత్రి సవిత

గాజువాక మే 3,

భగీరథ మహర్షి మహా జ్ఞాని అని పరోపకారానికి దీక్షకు సహనానికి ప్రతిరూపమని మంత్రి సవిత పేర్కొన్నారు. భగీరథుని వారసులుగా సగరులు ఎంతో పట్టుదల, శ్రమ, నిజాయితీతో ఉంటారని కొనియాడారు. భగీరథుని ఆశయాలను కొనసాగించాలని, ఆయన చూపిన సంకల్ప బలంతో బీసీ వర్గాల్లోని సామాన్యులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విశాఖ గాజువాక దుర్గానగర్ లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి భగీరథ జయంతి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భగీరథ మహర్షి జయంతి మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన భగీరథ మహర్షి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముందుగా మంత్రివర్యులు ఇతర ప్రజాప్రతినిధులు , అధికారులతో కలిసి భగీరథుని విగ్రహాన్ని ఆవిష్కరించారు.అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ భగీరథుని యొక్క ఆశయాలను కొనియాడారు. ఆయన చేసిన కఠోర శ్రమ, చూపిన దీక్ష ఎప్పటికీ మరువలేనిదని ఆమె అన్నారు. భగీరథుని వారసులుగా సగరులు ఎంతో పట్టుదల, శ్రమ, నిజాయితీతో ఉంటారని కొనియాడారు. భగీరథుని ఆశయాలను కొనసాగించాలని, ఆయన చూపిన సంకల్ప బలంతో బీసీ వర్గాల్లోని సామాన్యులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి గారు బీసీలను అన్ని రంగాల్లో ముందు నిలబెట్టేందుకు కృషి చేస్తున్నారని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్లో బీసీలు అధికంగా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. బీసీలు అభివృద్ధి చెందడానికి చదువు యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు మరియు ఉప్పర కులాన్ని సగరుగా మార్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## చెట్టు కూలి మహిళ దుర్మరణం

విశాఖపట్నంవిశాఖ ఎంవిపి పోలీస్ స్టేషన్ పరి ధిలో చెట్టు కూలి మహిళ మృతి చెందింది. ఏ. ఎం. జి హాస్పి టల్ ఎదురుగా స్కూటీ మీద వెళ్తున్న మహిళపై చెట్టు ఒక్కసా రిగా కులడంతో మహిళ అక్కడే మృతి చెందింది. సంఘటన స్థలానికి చేరుకున్న ఎంవిపి  పోలీ సులు విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియవలసి ఉంది.

# డాక్టర్ల బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్ట మ్

మెదక్, మే 5, (న్యూస్ పల్స్)

విధులకు డుమ్మా కొట్టే డాక్టర్ల ఆటలు ఇక చెల్లవు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ, జీజీహెచ్లో హాజరు నమోదు చేసుకోకుండా విధులకు డుమ్మా కొట్టే డాక్టర్లకు చెక్ పెట్టేందుకు కొత్త విధానం అమలు చేస్తున్నారు. కొత్త హాజరు విధానం మొదలవుతోంది.నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ), ఆధా ర్ ఎనబుల్ బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్ట మ్ (ఏఈబీఏఎస్)ను తీసుకొచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో అమలు చేయాలని ఆదేశాలు జారీ చేయగా ఉమ్మడి జిల్లాలో కొత్త హాజరు విధానానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలోని సంగారెడ్డి, మెదక్ మెడికల్ కళాశాల, జీజీహెచ్లలో విధులునిర్వహిస్తున్న ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, కాంట్రాక్టు వైద్యులు ఎవరైనా సరే ఫేస్ మార్క్ అటెండెన్స్ వేసుకోవాల్సిందే. గత రెండేళ్ళు బయోమెట్రిక్ విధానం అమలు చేయగా, చాలామంది వైద్యులు అటెండెన్స్ వేసుకొని బయటకు వెళ్ళడం సాధారణమైంది.ప్రధానంగా  ప్రైవేట్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు, సొంత ఆసుపత్రులున్న వైద్యులు వచ్చామా.. పో యామా అన్నట్లు వ్యవహరిస్తున్నారు.  ఇ లాంటి వ్యవహారాలకు చెక్ పెడుతూ ఎన్ఎంసీ ఫేస్మార్క్ అటెండెన్స్ తప్పనిసిరి చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. కాగా కొత్త విధానంతో వయస్సు రీత్యా వేలిముద్రలు




రాక ఇబ్బంది పడుతున్న వైద్యులకు ప్రయోజనం కలుగనుంది.

వైద్యలందరూ కచ్చితంగా తమ మొబైల్ ఫోన్లలో ఫేస్మార్క్ అటెండెన్స్ యాప్ను డౌ న్లోడ్ చేసుకోవాల్సిందే. ఈ యాప్ జీజీహెచ్, మెడికల్ కళాశాకు 100 మీటర్ల పరిధిలోనే పనిచేస్తుంది. 100 మీటర్లు దాటితే ఫేస్మార్క్ కట్ అవుతుంది. దీంతో ప్రతినిత్యం గంట, నిమిషాల చొప్పున కూడా జీతాల్లో కోత విధించనున్నారు.దీంతో నిత్యం నిర్ణీత వేళ ల్లో అందుబాటులో ఉండి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఎన్ంఎసీ అదేశాల మేరకుమెడికల్ కాలేజ్, జీజీహెచ్లో ప్రత్యేకంగా డివైజ్ను ఏర్పాటు చేయనున్నారు. ఫోన్ ద్వారా వీలు కాకుంటే డివైజ్లో ఫేస్మార్కో అటెండెన్స్ వేసుకొని విధులు నిర్వర్తించే వెసలుబాటు కల్పించారు. దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, జీజీహెచ్లలో విధులు నిర్వర్తించే ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, వైద్యులందరూ కచ్చితంగా ఫేస్మార్క్ అటెండెన్స్ వేసుకోవాలి. ఢిల్లీలోని ఎన్ఎంసీ మానిటరింగ్ చేస్తుంది. సమయపాలనతో పాటు నియమ నిబంధనలు పాటించాలి. లేకపోతే జీతాల్లో కోత పడుతుంది. ఈ విధానం వల్ల దుమ్మాలకు చెక్ పడనుంది.

===============

# లోకల్ బాడీ ఎన్నికలకు అంతా సిద్ధం

నల్గోండ మే 5,

స్థానిక సంస్థలకు ఎన్నికలు జులైలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కుల గణన కారణంగా ఎన్నికలు వాయిదా పడినప్పటికీ, నిధుల కొరతతో ప్రభుత్వం నష్టపోతున్నందున ఎన్నికలు నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. బీసీ నాయకులతో సమావేశమై ముఖ్యమంత్రి తన నిర్ణయాన్ని చెప్పగా.. వారు కూడా సమ్మతించారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, చిహ్నాల ఖరారు, బ్యాలెట్ పత్రాల ముద్రణ వంటి ముందస్తు ఏర్పాట్లను కూడా ఎన్నికల సంఘం పూర్తి చేసిందిఇప్పటికే పదవీ కాలం ముగిసిన గ్రామీణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. రెండు నెలల క్రితమే తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసినప్పటికీ, కుల గణన, బీసీ రిజర్వేషన్ పెంపు ప్రక్రియతో స్థానిక ఎన్నికలను తాత్కాలికంగా వాయిదా వేసింది. స్థానిక సంస్థల్లో, విద్య, ఉద్యోగ నియామకాల్లో విడివిడిగా 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లులకు అసెంబ్లీ తీర్మాన చేసి కేంద్రం ఆమోదం కోసం పంపింది.కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కుల గణన చేపట్టాలని ఇటీవల నిర్ణయించింది. ఈ సంవత్సరం చివరిలో జన గణన ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ జనాభా సర్వే పూర్తి కావడానికి కనీసం రెండేళ్లకు పైగా సమయం పడుతుంది. పంచాయతీల పదవీ కాలం 2024 జనవరి 31వ తేదీన, జిల్లా, మండల పరిషత్‌ల గడువు 2024 జులైలో ముగిసింది. స్థానిక సంస్థలకు పాలక మండళ్లు లేకపోవడం వల్ల కేంద్రం నుంచి వచ్చే నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. కాబట్టి, ఎన్నికలు ఇంకా ఆలస్యం అయితే ప్రభుత్వం ప్రతి సంవత్సరం 1,500 కోట్లు నష్టపోతుంది.కేంద్రం కుల గణనపై ప్రకటనతో కాంగ్రెస్ పార్టీకి చెందిన బీసీ నాయకులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించి ఎన్నికల గురించి చర్చించారు. పాలక మండళ్లు లేకపోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఆదాయాన్ని కోల్పోతోందని వివరించారు. పంచాయతీలకు నిధులు, సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి ఉందని తెలిపారు. కుల గణన పూర్తయ్యే వరకు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకుండా వేచి ఉండలేమన్న సీఎం అభిప్రాయంతో చాలా మంది నాయకులు ఏకీభవించారు.తెలంగాణలో కుల గణనకు, స్థానిక సంస్థల ఎన్నికలకు ఎటువంటి సంబంధం లేదని, ఎన్నికలకు వెళ్లవచ్చని రేవంత్ రెడ్డి చెప్పారు. అవసరమైతే ఇప్పటికే ఉన్న రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు కూడా బీసీ నాయకులు అంగీకరించారు. కాకపోతే స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం టిక్కెట్ల హామీ ఇవ్వాలని సూచించారు.గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను గుర్తించడం, చిహ్నాలను ఖరారు చేయడం మరియు రాష్ట్రంలో బ్యాలెట్ పత్రాలను ముద్రించడం వంటి ముందస్తు ఎన్నికల కసరత్తులను రాష్ట్ర ఎన్నిక సంఘం ఇప్పటికే పూర్తి చేసింది. ఫిబ్రవరిలోనే మండల ప్రజా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించాలని జిల్లా ఎన్నికల అధికారులను కూడా కోరింది.

# శ్మశానంలో దందా...

హైదరాబాద్, మే 5,

మనిషి బతికున్నంత కాలమే కష్టాలు అనుకుంటే పొరపాటే. మరణించిన తర్వాత కూడా దుర్భర పరిస్థితులు ఎదురవుతున్నాయి. "బతికున్నప్పుడు విలువివ్వకపోయినా.. చావుకైనా గౌరవం ఇవ్వాలి కదా". కనీసం చనిపోయిన తర్వాతైనా గౌరవంగా అంతిమ సంస్కారాలు జరగాలనుకుంటే.. అక్కడ కూడా దందాలు నడిపిస్తున్నారు కొందరు దరిద్రులు. అచ్చంగా "శవాల మీద పేలాలేరుకోవటం అంటే ఇదేనేమో" అన్న సామెతను గుర్తుచేసేలా సాగుతున్న దందా ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో కాదు.. తెలంగాణ రాష్ట్ర రాజధాని నగరం హైదరాబాద్‌లోనే.రాజేంద్రనగర్ పరిధిలోని బుద్వేల్ ప్రాంతంలో కొందరు వ్యక్తులు.. చనిపోయిన వారి మృతదేహాలను అడ్డం పెట్టుకొని డబ్బులు వసూలు చేస్తున్నారు. శవాన్ని పూడ్చాలన్నా, దహనం చేయాలన్నా వేలకు వేలు డిమాండ్ చేస్తున్నారు. దీంతో సొంతవారిని కోల్పోయిన దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులు అంత్యక్రియలు ఎలా నిర్వహించాలో తెలియక మరింత వేదనకు గురవుతున్నారు. బతికున్నప్పుడే నిలువునా దోచేస్తున్నారని జనాలు గగ్గోలుపెడుతుంటే.. చచ్చిన తర్వాత శవాలకు కూడా పూడ్చేందుకు, కాల్చేందుకు రేట్లు పెట్టి దోచుకుంటుండటం సమాజంలో పరిస్థితులకు అద్దం పడుతోంది.స్థానికుల కథనం ప్రకారం, బుద్వేల్ పరిసరాల్లోని శ్మశానాలపై కొందరు పెత్తనం చెలాయిస్తున్నారు. ఒక్కో మృతదేహాన్ని పూడ్చి పెట్టడానికి లేదా దహనం చేయడానికి రూ. 30 వేల నుంచి అంతకు మించిన మొత్తాన్ని డిమాండ్ చేస్తున్నారు. కనీసం రూ. 15 వేలు ఇస్తేనే అంత్యక్రియలకు అనుమతిస్తున్నారు.తాజాగా జరిగిన ఒక ఘటనలో.. ఒక కుటుంబం అంత డబ్బు ఇవ్వలేకపోవడంతో ఏకంగా ఏడు గంటల పాటు మృతదేహాన్ని శ్మశానంలోనే అనాథ శవంలా ఉంచేశారంటే ఎంత కఠినంగా ఈ దందా నడుస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి దారుణమైన పరిస్థితులు చూస్తుంటే సమాజంలో మానవత్వం పూర్తిగా మంటగలిసిపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు స్థానిక రాజకీయ నాయకుల అండదండలతో రెచ్చిపోతున్నారని ఆరోపిస్తున్నారు. చనిపోయిన తమవారికి కనీసం ప్రశాంతంగా అంతిమ సంస్కారాలు కూడా చేయలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు.

# హైడ్రాకు త్వరలో కొత్త పోలీస్ స్టేషన్:

హైదరాబాద్‌హైడ్రా స్పెషల్ పోలీస్ స్టేషన్ ను ఈ నెల 8వ తేదీ నుంచి అందు బాటులోకి రానుంది రాణిగంజ్ లోని బుద్ధభవన్ ను ఆనుకుని ఉన్న భవ నంలోని గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ తో కలిపి రెండు అంతస్తుల్లో ఇది ఏర్పాటు కానుంది,ఈ నెల 8వ తేదీ న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.సర్కారు ఆస్తులను కాపాడే క్రమంలో అక్కడక్కడ ఆస్తులు కబ్జాలకు, ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించిన తర్వాత హైడ్రా కూల్చి వేతలు చేపట్టినా, అందుకు బాధ్యులైన వారిపై అమీన పూర్, శేరిలింగంపల్లి తదితర పోలీస్ స్టేషన్లలో ఇప్పటి వరకు నమోదైన 48 కేసులు హైడ్రా పోలీస్ స్టేషన్ కు బదిలీ చేసే అవకాశమున్నట్లు తెలిసింది.

# అప్రమత్తంగా ఉండండి ..మోసానికి గురి కాకుండా జాగ్రత్తపడండి: డిఆర్వో విశ్వేశ్వర నాయుడు

కడప, మే 05(భారత శక్తి): "అప్రమత్తంగా ఉండండి మోసాలకు గురికాకుండా జాగ్రత్తపడండి" అని డిఆర్వో విశ్వేశ్వర నాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. ఇటీవలి కాలంలో సైబర్ మోసాలు అధికమవుతున్న తరుణంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ డిఆర్వో ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.ప్రజలను మోసగించేందుకు నేరస్తులు కొత్త కొత్త మార్గాలను అనుసరిస్తున్నారు. ముఖ్యంగా, వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా యాప్స్‌ను ఉపయోగించి, ప్రభుత్వ అధికారులు, బ్యాంకు ఉద్యోగుల పేరుతో ఫేక్ ఖాతాలు సృష్టిస్తూ ప్రజల నుంచి డబ్బు వసూలు చేయడం జరుగుతోంది.

వాట్సాప్ డీపీ మోసం విధానం:

నేరస్తులు జిల్లా కలెక్టర్ లేదా ఇతర ఉన్నతాధికారుల ఫోటోను ఉపయోగించి వాట్సాప్ ఖాతా రూపొందిస్తున్నారు.ఆ ఖాతాల ద్వారా "అత్యవసరంగా డబ్బు పంపండి" అనే సందేశాలు పంపుతున్నారు.కొంతమంది వాటిని నిజమైన అధికారుల ఖాతాలుగా నమ్మి డబ్బులు పంపుతున్నారు.

::ప్రజలకు సూచనలు::

అధికారుల పేరుతో వచ్చే మెసేజ్‌లు, కాల్స్‌ను నమ్మకండి.ఎవరు డబ్బు అడిగినా %-% మొదట ఆ వ్యక్తి నిజమైన అధికారేనా అనే విషయాన్ని అధికారికంగా నిర్ధారించుకోండి.తెలియని లింకులు, ఫొటోలు, ఫైళ్లను ఓపెన్ చేయవద్దు.వాట్సాప్ డీపీ చూసి నమ్మకండి %-% అవి ఫేక్ కావొచ్చు.అనుమానాస్పదమైన విషయాన్ని వెంటనే స్థానిక అధికారులకు లేదా పోలీసులకు తెలియజేయండి.

సైబర్ మోసాలకు ఫిర్యాదు చేయాలంటే:

సైబర్ హెల్ప్‌లైన్ నంబర్: 1930

ఆన్‌లైన్ ఫిర్యాదు వెబ్‌సైట్: %షుషు.ఎఎవతీఎతీఅఎవ.స్త్రశీజ.అఅ

%ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి. ఎటువంటి సందేహాస్పద మెసేజ్‌లు వచ్చినా వెంటనే అధికారులను సంప్రదించి నిజాన్ని తెలుసుకోవాలి. మోసాలకు గురి కాకుండా జాగ్రత్తగా ఉండాలని డిఆర్వో ఆ ప్రకటనలో తెలిపారు.

# జిల్లా కలెక్టర్ శ్రీ ఆశిష్ సాంగ్వాన్ అధ్యక్షతన డిస్టిక్ ఆఫీసర్ల కన్వర్జేన్స్ మీటింగ్






(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, మే05: సోమవారం కామారెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీ ఆశిష్ సాంగ్వాన్ అధ్యక్షతన డిస్టిక్ ఆఫీసర్ల కన్వర్జేన్స్ మీటింగ్ నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఓపెన్ స్కూలింగ్ అడల్ట్ ఎడ్యుకేషన్ ఉల్లాస్, సెల్ఫ్ ఉద్యోగులు ఒకరికొకరు కోఆర్డినేట్ చేసుకుంటూ నిరక్షరాశులను అక్షరాసులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని తెలియజేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీ శ్రీ చందర్, డిఐఈఓ శ్రీ సలాం, డిఆర్డిఓ శ్రీ సురేందర్, డి పి ఎం శ్రీ సుధాకర్, శ్రీ శ్రీధర్ రెడ్డి, పిడి మెప్మా మొదలగు వారు పాల్గొన్నారు.

# కర్రెగుట్టలో పట్టు చిక్కినట్టేనా

వరంగల్, మే 5,

ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న కర్రెగుట్టలపై భద్రత బలగాలు భారీ ఆపరేషన్ కొనసాగుతోంది. తొమ్మిది రోజులుగా కొనసాగిన ఆపరేషన్‌లో ఒక్కో అడుగు ముందుకేసి మావోయిస్టు డెన్‌ను ధ్వంసం చేస్తున్నారు.ఈ క్రమంలోనే ఆంటకాలు దాటుకొని మావోయిస్టుల అడ్డాలో జాతీయ జెండాను ఎగరేశారు.కర్రెగుట్టలపై సీఆర్పీఎఫ్ బలగాలు పైచేయి సాధించాయి. మావోయిస్టులకు చెక్ పెట్టడానికి ఆపరేషన్ కర్రెగుట్టలను చేపట్టాయి బలగాలు. డ్రోన్లు, హెలికాప్టర్లతో ఛత్తీస్‌గఢ్ అడవుల్లో మావోయిస్టులకు డెన్‌గా ఉన్న ప్రాంతాలను గుర్తించిన భద్రత బలగాలు ఆ ప్రాంతాలు స్వాధీనం చేసుకుంటున్నాయి. ఇందులో భాగంగా కర్రెగుట్టలో వేలాది బలగాలు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టి సీఆర్పీఎఫ్ బెస్ క్యాంప్‌ను ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతుంది.కర్రెగుట్టల్లో వేలాది మంది మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో దాదాపు పది రోజుల క్రితం సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి.అయితే నిజంగానే ఇక్కడ మావోయిస్టులు ఉన్నారా అనే అనుమానం కలుగుతోంది. కర్రెగుట్టలను జల్లెడ పడుతున్న సంగతి తెలుసి తప్పించుకుపోయారా? లేదా కర్రెగుట్టల్లో బేస్ క్యాంప్ ఏర్పాటు చేయడానికి బలగాల వ్యూహమా ప్రకారం ఇలాంటి ప్రచారం చేశారా అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఏమైనా సరే తొమ్మిది రోజులుగా బలగాల ఆపరేషన్ తుది దశకు చేరిందని అధికారులు చెబుతున్నారు. ఈ ఆపరేషన్‌లో మావోయిస్టులు అమర్చిన వివిధ బాంబులు నిర్వీర్యం చేస్తూ ముందుకు సాగారు. దంపులు స్వాధీనే చేసుకొని సొరంగాలు గుర్తించి లక్ష్యానికి చేరువవుతున్నారు. తాజాగా బలగాలు కర్రెగుట్ట సమీపంలోని ధోబీ కొండను స్వాధీనం చేసుకున్నారు. ధోబీ కొండ కర్రెగుట్టకు చాలా దగ్గరగా ఉంటుంది. ఇప్పటివరకు మావోయిస్టులు ఆక్రమించిన రెండు కొండలను సైనికులు స్వాధీనం చేసుకున్నారు. నీలం సారాయ్ కొండను స్వాధీనం చేసుకున్న తర్వాత ధోబీ కొండను స్వాధీనం చేసుకున్నారు. ఆ కొండలపై బలగాలు జాతీయ జెండాను ఎగరవేశాయి. దీంతో కర్రెగుట్టల ప్రాంతంలో నిరంతర సెర్చ్ ఆపరేషన్ జరగనుంది.ఈ టైంలోనే కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ స్వయంగా కర్రెగుట్ట ప్రాంతానికి చేరుకొని, ఆపరేషన్ వివరాలు సీఆర్పీఎఫ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కర్రెగుట్టలపై సీఆర్పీఎఫ్ బేస్ క్యాంప్ ఏర్పాటు చేయాలని ఐబీ చీఫ్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది.క్యాంప్ ఏర్పాటుతో ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ప్రాంతాలకు అందుబాటులో ఉండే విధంగా సీఆర్పీఎఫ్ బేస్ క్యాంప్‌ను ఏర్పాటు చేయనున్నారు. దండకారణ్యంలో మావోయిస్టుల కదలికలపై గట్టిపట్టు సాధించేందుకు ఇది కీలకమైన అడుగ్గా అధికారులు భావిస్తున్నారు.

# రాజీవ్ రహదారిని నేషనల్ హైవేగా మార్చేందుకు కేంద్రం సిద్ధం

## కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

హైదరాబాద్

ఆ కాంట్రాక్టర్ తో ఉన్న సమస్యను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించుకోవాలికోమటిరెడ్డి ఈ విషయంలో చొరవ తీసుకోవాలి.

అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు కేంద్రం సిద్ధం

ఎన్నికల వరకే రాజకీయాలు ఆ తరువాత తెలంగాణ అభివృద్దే మోదీ సర్కార్ లక్ష్యం.

గత పాలకులు వెనుకబడేసిన జిల్లా ఉమ్మడి ఆదిలాబాద్

మోదీ పాలనలో ఆదిలాబాద్ సహా రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి

జాతీయ రహదారుల కోసమే లక్షా 25 వేల కోట్లు ఖర్చు చేసిన ఘనత మోదీ సర్కార్ దే

గడ్కరీ మంచి మనసున్న మనిషి.

పార్టీతో బేధం లేకుండా ఎవరు వెళ్లినా పనులు చేస్తారు

సిర్పూర్ కాగజ్ నగర్ బహిరంగ సభలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు:

హైదరాబాద్-కరీంనగర్ -మంచిర్యాల రాజీవ్ రహదారి నాగుపాములా అధ్వాన్నంగా ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. క్వాలిటీ లేకుండా పనులు చేయడంవల్లే ఈ పరిస్థితి ఉత్పన్న మైందన్నారు. రాజీవ్ రహదారిని జాతీయ రహదారిగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఈ మేరకు నితిన్ గడ్కరీ హామీ కూడా ఇచ్చారని తెలిపారు. అయితే ఆ రోడ్డుకు సంబంధించి కొన్ని సమస్యలున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని సదరు కాంట్రాక్టర్ తో మాట్లాడి ఆ సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ విషయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవ చూపాలని సూచించారు.

కొమరం భీం జిల్లా సిర్పూర్ కాగజ్ నగర్ లో రూ.6100 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన పలు రహదారులకు కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, ఎంపీలు వంశీ, నగేశ్ పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రసంగించేందుకు వేదిక వద్దకు రాగానే సభకు హాజరైన వేలాది మంది ప్రజలు పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ భారత్ మాతాకీ జై అంటూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సంజయ్ చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు:

కేంద్ర రోడ్డు, రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలంగాణలో మరిన్ని రోడ్ల నిర్మాణాలను ప్రారంభించేందు కోసం ఇక్కడికి రావడం చాలా సంతోషంగా ఉంది. దాదాపు 6 వేల 100 కోట్ల రూపాయలతో 167 కి.మీ. మేర మొత్తం 26 ప్రాజెక్టుల పనులకు సంబంధించిన కార్యక్రమాలను జాతికి అంకితం చేయడంతోపాటు శంకుస్థాపన చేస్తుండటం సంతోషంగా ఉంది.


ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ఒకప్పుడు వెనుకబడిన జిల్లా. రోడ్లు, రహదారుల వ్యవస్థ ఘోరంగా ఉండేది. కరీంనగర్ నుండి ఇక్కడికి గంటన్నరలోపే వచ్చాను. తెలంగాణలో ఎక్కడికైనా సరే పొద్దున్నే పోయి పని చూసుకుని మళ్లీ సాయంత్రానికి ఇంటికి రాగలుగుతున్నాం. దీనికి కారణమేంటి? ఒక్కసారి పదేళ్ల క్రితానికి, ఇప్పటికీ ఉన్న తేడాను గుర్తు చేసుకోండి. ఆదిలాబాద్ వెనుకబడిన ప్రాంతం కాదు. గత పాలకులు వెనుకబడేసిన జిల్లా. మోదీ ప్రభుత్వం వచ్చాక శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

గత 10 ఏళ్లలో మన తెలంగాణ రాష్ట్రానికే జాతీయ రహదారుల నేషనల్ హైవేస్, అభివృద్ధి కోసం 1 లక్షా 25 వేల 485 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. తెలంగాణపట్ల మన మోదీ, మన గడ్కరీ ఎంత ప్రేమ ఉందో ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి, మోదీ ప్రధాని కాకముందు అంటే 1947 నుండి 2014 వరకు గత 67 ఏళ్లలో, 2500 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారులు మాత్రమే ఉండేవి.

# ఇక స్పీడ్ స్పీగ్ గా హైడ్రా చర్యలు

హైదరాబాద్, మే 5, (న్యూస్ పల్స్)

హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం రేవంత్ రెడ్డి సర్కార్.. హైడ్రాను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కాగా.. ప్రభుత్వ భూములు, చెరువులు, పేదల ఇళ్ల స్థలాలు, పార్కులు, రహదారులను ఆక్రమించే వారిపై ఇకపై కఠిన చర్యలు తీసుకోనేందుకు సిద్ధమైంది. ఇసుక అక్రమ రవాణా, చెరువులు, బహిరంగ ప్రదేశాల్లో నిర్మాణ వ్యర్థాలు వేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి నేరుగా జైలుకు పంపడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. ఇందులో భాగంగానే, ఈ నెల 8న



బుద్ధభవన్‌లోని హైడ్రా ప్రధాన కార్యాలయం పక్కనే ఒక ప్రత్యేక పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయనుంది.ఆక్రమణల కూల్చివేతలో ఇప్పటికే దూకుడుగా వ్యవహరిస్తున్న హైడ్రా, ఇకపై ఆక్రమణదారులను జైలుకు పంపేందుకు కూడా వెనుకాడబోదని హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ స్పష్టం చేశారు. ప్రత్యేక పోలీస్ స్టేషన్ యొక్క విధివిధానాలను వివరించారు. హైడ్రా ఇప్పటికే వందల ఎకరాల ప్రభుత్వ భూములను, అనేక చెరువులు, పార్కులు, నాలాలను ఆక్రమణదారుల నుంచి కాపాడిందని రంగనాథ్ తెలిపారు. ప్రస్తుతం ఈ ఆక్రమణలకు సంబంధించిన 50కి పైగా కేసులు వివిధ పోలీస్ స్టేషన్లలో విచారణ దశలో ఉన్నాయని.. హైడ్రా ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటుతో ఈ కేసులన్నీ తక్షణమే హైడ్రాకు బదిలీ అవుతాయన్నారు. అంతేకాకుండా, కొత్తగా నమోదయ్యే ఆక్రమణల కేసులు కూడా ఇకపై వేగంగా పరిష్కరించనున్నట్టు రంగనాథ్ తెలిపారు. ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు వెనుక హైడ్రా రెండు ముఖ్యమైన లక్ష్యాలను నిర్దేశించుకున్నట్టు రంగనాథ్ వివరించారు. మొదటిది, ఆక్రమణ సమస్య యొక్క మూలాల్లోకి వెళ్లి,ముఖ్యంగా చెరువుల ఆక్రమణలను పూర్తిగా నివారించడం. రెండవది, నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడుతున్న అధికారులు, సిబ్బంది, ఆక్రమణదారులను పక్కా ఆధారాలతో గుర్తించి, చట్ట ప్రకారం కఠినంగా శిక్షించడం, వారిని జైలుకు పంపడం.ప్రస్తుతానికి ఈ ప్రత్యేక పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ స్థాయి అధికారి నేతృత్వంలో ఆరుగురు ఇన్‌స్పెక్టర్లు, 12 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, 60 మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వహించనున్నట్టు రంగనాథ్ తెలిపారు. భవిష్యత్తులో ఫిర్యాదుల సంఖ్య పెరిగితే, ఈ పోలీస్ స్టేషన్ల సంఖ్యను కూడా పెంచే అవకాశం ఉందన్నారు. ఆర్థిక నేరాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సైబర్ నేరాల్లో సీసీఎస్ పోలీసులు ఎలా ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తారో, అదే తరహాలో హైడ్రా పోలీసులు కూడా ఆక్రమణదారుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహిస్తారని తెలిపారు. నేరానికి సంబంధించిన కీలక ఆధారాలను స్వాధీనం చేసుకుని.. నిందితులను చట్ట ప్రకారం శిక్షిస్తారని కమిషనర్ రంగనాథ్ తెలిపారు.చెరువుల ఆక్రమణ అనేది సాధారణంగా నిర్మాణ వ్యర్థాలు డంపింగ్ చేయడంతో ప్రారంభమవుతుందని హైడ్రా కమిషనర్ తెలిపారు. సెల్లార్ తవ్వకాల్లో వచ్చే మట్టి, కూల్చిన భవనాల వ్యర్థాలు, ఇతర చెత్తతో చెరువులను పూడ్చి, వాటిపై అక్రమ నిర్మాణాలు చేపట్టి విక్రయించడం ఏళ్లుగా కొనసాగుతోందన్నారు. ఇప్పటివరకు అధికారులు ఫిర్యాదు చేస్తే స్థానిక పోలీసులు కేవలం వాహనాల డ్రైవర్లపై మాత్రమే నామమాత్రపు కేసులు నమోదు చేసేవారని... కానీ, హైడ్రా ఇకపై ఈ సమస్య మూలాల్లోకి వెళ్తుందని పేర్కొన్నారు. హైడ్రా ప్రత్యేక పోలీస్ స్టేషన్ అందుబాటులోకి వస్తే,అక్రమ నిర్మాణ సంస్థలు, చెరువులను పూడ్చే వాహనాల యజమానులు, ప్రధాన ఆక్రమణదారులను వేర్వేరు కఠినమైన చట్టాల కింద అరెస్టు చేసి జైలుకు పంపిస్తారు. ఈ చర్యలతో ప్రభుత్వ భూములు, జలవనరుల ఆక్రమణకు ఇకపై గట్టిగా అడ్డుకట్ట పడుతుందని అధికారులు భావిస్తున్నారు.

====================

# ప్రజావాణి లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలి : జిల్లా కలెక్టర్



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, మే05: ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. భూముల సమస్యలు, రెండుపడక గదుల ఇళ్లు మంజూరు, రైతు భరోసా, ఫించన్లు మంజూరు తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఈ రోజు ప్రజావాణి లో (96) ఫిర్యాదులు పలు శాఖలకు చెందినవి అందాయని తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి లో వచ్చిన అర్జీలను పరిశీలించి సాధ్యా సాధ్యాల మేరకు సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పెండింగులో ఉన్న అర్జీలపై చర్యలు చేపట్టి దరఖాస్తు దారునికి సమాచారం అందించాలని తెలిపారు. ఈ ప్రజావాణిలో , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జడ్పీ సీఈవో చందర్, ఆర్డీఓ వీణ, పలు శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# మే 15న పోచంపల్లిని సందర్శించనున్న మిస్ వరల్డ్ 2025 పోటీదారులు



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, మే05: ఒక ఉత్సాహభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలో భాగస్వాములు అవుతున్న మిస్ వరల్డ్ - 2025 గ్రూప్ -2 పోటీదారులు మే 15న ప్రపంచ ప్రఖ్యాత చేనేత గ్రామం పోచంపల్లిని సందర్శించనున్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమం భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ వస్త్ర సంప్రదాయాలలో ఒకటైన పోచంపల్లి ఇక్కత్ పై ప్రపంచ దృష్టిని ఆకర్షించనుంది.తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్న పోచంపల్లి, దాని సంక్లిష్టమైన ఇక్కత్ నేత పద్ధతులకు అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకుంది. పోచంపల్లిని యునెస్కో "ప్రపంచంలోని ఉత్తమ పర్యాటక గ్రామం"గా గుర్తించింది, ఇది చేతిపనులు, సంస్కృతి, వారసత్వానికి సజీవ మ్యూజియం. మిస్ వరల్డ్ పోటీదారులు ఇక్కత్ సాంప్రదాయ టై-అండ్-డై ప్రక్రియను అనుభవిస్తారు, నిష్ణాతులైన నేత కార్మికులతో సంభాషిస్తారు. హైదరాబాద్ నిజాంలు ఒకప్పుడు అభిమానించిన డబుల్ ఇకాట్ కళాఖండం అయిన ఐకానిక్ టెలియా రుమల్ తయారీని చూస్తారు. ఆచార్య వినోబా భావే నేతృత్వంలోని భూదాన్ ఉద్యమంలో చారిత్రాత్మక పాత్ర పోషించిన ఈ గ్రామం వస్త్ర కళాత్మకత, సామాజిక-సాంస్కృతిక వారసత్వం యొక్క అరుదైన మిశ్రమాన్ని అందిస్తుంది.

మిస్ వరల్డ్ వేదిక అపూర్వమైన అంతర్జాతీయ దృశ్యమానతను అందిస్తున్నందున, ఈ ప్రతిష్టాత్మక సందర్శన తెలంగాణ యొక్క గొప్ప చేనేత వారసత్వాన్ని ప్రపంచ పటంలో ఉంచుతుంది. పోచంపల్లి యొక్క శక్తివంతమైన నేత, గ్రామీణ హస్తకళ, సాంస్కృతిక లోతును ప్రదర్శించడం ద్వారా, ఈ కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా ఉన్న చేనేత అభిమానులకు భారతదేశ జీవన సంప్రదాయాల యొక్క శక్తివంతమైన వేడుకగా మారుతుంది.ఈ నెల చివర్లో హైదరాబాద్‌లో జరిగే మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలే కోసం అంచనాలు పెరుగుతున్న కొద్దీ, పోచంపల్లి సందర్శన ఒక హైలైట్‌గా ఉంటుంది. చేనేత వారసత్వాన్ని , మగ్గం తెలంగాణ కథను ప్రపంచానికి తెలియజేస్తుంది.

# సంగారెడ్డి పోస్ట్ ఆఫీస్ లో ఆధార్ సేవలు: తపాలా ఎస్పీ ఎల్ వి మురళి కుమార్



సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, మే 5 :జిల్లా కేంద్రమైన సంగారెడ్డి హెడ్ పోస్ట్ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన ఆధార్ సేవలను జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని సంగారెడ్డి డివిజన్ పోస్టల్ ఎస్పీ ఎల్ వి మురళి కుమార్ తెలిపారు. కొత్తగా ఆధార్ కార్డ్ నమోదు, నవీకరణ కొరకు ఆధార్ కార్డ్ లో ఏవైనా మార్పులు చేర్పులు, ఫోటో ఐడెంటిటీ , బయోమెట్రిక్ అప్డేట్ కోసం సంగారెడ్డి హెడ్ పోస్ట్ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ ద్వారా ఆధార్ సేవలను సులభంగా పొందవచ్చని పోస్టల్ ఎస్పీ పేర్కొన్నారు. అన్ని పని దినములలో ఆధార్ నమోదు , నవీకరణ సేవలను ప్రజలు పొందవచ్చని చెప్పారు. అయితే కొత్తగా ఆధార్ నమోదు, నవీకరణ కొరకు కొన్ని సూచనలను ప్రజలు పాటించాలని సంభందిత పత్రాలను వెంట తీసుకు రావాలని కోరారు.కొత్తగా ఆధార్ నమోదు కొరకు ఒరిజినల్ బర్త్ సర్టిఫికేట్ అవసరమన్నారు. ఒరిజినల్ బర్త్ సర్టిఫికెట్ లో క్యూఆర్ కోడ్ క్లియర్ గా ఉండాలని తెలిపారు. అదేవిధంగా తండ్రి ఆధార్ కార్డ్ లో ఉన్న పూర్తి అడ్రస్ బర్త్ సర్టిఫికేట్ లో కూడా ఉండాలని తెలిపారు. అలాగే తండ్రి యొక్క బర్త్ సర్టిఫికెట్ ఆధార్ లో జిల్లా అప్డేట్ తప్పనిసరిగా ఉండాలని అన్నారు. తండ్రి బర్త్ సర్టిఫికెట్ లో జిల్లా స్టేట్ ఆంధ్రప్రదేశ్ అని ఉంటే తెలంగాణ అని అప్డేట్ చేసుకోవాలని పోస్టల్ ఎస్పీ సూచించారు.పిల్లలకు పేరు మరియు అడ్రస్ మార్పు కొరకు స్కూల్ బోనాఫైడ్ సర్టిఫికేట్ ప్రకారం కావాలనుకుంటే సంబంధిత మండలంలో నివాస సర్టిఫికెట్ తీసుకొని మీకు కావాల్సిన పేరు విధంగా తీసుకొని వచ్చి పేరు మరియు అడ్రస్ మార్చుకోవచ్చని చెప్పారు. ఇదిలావుండగా డేట్ అఫ్ బర్త్ మార్పు కొరకు బర్త్ సర్టిఫికేట్ మరియు ఎస్ ఎస్ సి మెమో ఒరిజినల్ (18 సంవత్సరములు పైబడిన వారికి), పెద్దవాళ్లకు అయితే పాస్ పోర్ట్ ఐడెంటిటీ ద్వారా కూడా మార్చుకోవచ్చు అని తెలిపారు. వివాహం తర్వాత పేరు మరియు అడ్రస్ మార్చుకోవాలి అనుకుంటే సబ్ రిజిస్టర్ ఆఫీస్ మ్యారేజ్ సర్టిఫికెట్ లేదా మండలం ద్వారా రెసిడెన్షియల్ సర్టిఫికెట్ ద్వారా మార్చుకోగలరని అన్నారు.అలాగే పేరు మార్పు కొరకు పాన్ కార్డు, ఓటర్ ఐడి ,లేటెస్ట్ బ్యాంక్ పాస్ బుక్ ,ఎస్ ఎస్ సి మెమో, పాస్ పోర్ట్ వీటి ద్వారా కూడా మార్చుకోవచ్చని తెలిపారు.మీ ఆధార్ కార్డ్ లో తెలంగాణ అని మరియు అప్డేట్ కొరకు లేటెస్ట్ ది రెసిడెన్షియల్ సర్టిఫికెట్ లేదా లేటెస్ట్ బ్యాంక్ పాస్ బుక్ పూర్తి అడ్రస్ ఉన్నటువంటిది తీసుకొని వాటి ద్వారా మార్చుకోవచ్చనీ వివరించారు. ఆధార్ నమోదు, నవీకరణ సులభంగా వేగంగా అందించేందుకు పైన తెలిపిన సూచనల ప్రకారం సంబంధిత పత్రాలు తీసుకొని అధర్ సెంటర్ కు రావాలని పోస్టల్ ఎస్పీ ఎల్ వి మురళి కుమార్ తెలిపారు.రైల్వే సేవలు పునరుద్ధరణ:-సంగారెడ్డి హెడ్ పోస్ట్ ఆఫీస్ లో రైల్వే టికెట్ బుకింగ్ కౌంటర్ సేవలను పునరుద్ధరించినట్టు పోస్టల్ ఎస్పి ఎల్ వి మురళి కుమార్ తెలిపారు.రైల్వే టికెట్ బుకింగ్, అలాగే ఒక రోజు ముందు తత్కాల్ టికెట్ బుకింగ్ సేవలను కూడా ఇప్పటినుండి పొందవచ్చని తెలిపారు.

# విన్నవించాము మా బాధను ఆలకించండి సారూ.....!





ములుగు జిల్లా ప్రతినిధి, మే 5 (భారత శక్తి) : జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణి లో జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజలు జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్ కు దరఖాస్తులు అందించి విన్నవించాము మా భాదను ఆలకించండి సారూ ...! అని వేడుకున్నారు.

ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన వినతులను అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావు లతో కలిసి జిల్లా కలెక్టర్ స్వీకరించారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలు సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజావాణి నీ ఆశ్రయిస్తున్నారని, వారి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రజావాణి పోర్టల్ లోని దరఖాస్తులు పెండింగ్ లో ఉండకూడదని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి లో 45 దరఖాస్తులు రాగా అత్యధికంగా భూ సమస్యలు 16, గృహ నిర్మాణ శాఖకు 14, పెన్షన్ 02, ఉపాధి కల్పనకు 01, ఇతర శాఖలకు సంబంధించినవి 12 దరఖాస్తుల స్వీకరించగా వాటిని వెంటనే సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ - విశాఖపట్నం మధ్య ఉదయం విమాన సేవలు జూన్ 1 నుండి పునఃప్రారంభం: కేంద్రమంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు




జూన్ 1 నుండి, డెస్టినీ సిటీ విశాఖపట్నం నుండి విజయవాడకు ఉదయపు విమాన సేవలు...

శ్రీకాకుళం, భారత శక్తి ప్రతినిధి, మే 5: విజయవాడ మరియు విశాఖపట్నం మధ్య ఉదయపు విమాన సర్వీసులను జూన్ 1వ తేదీ నుండి తిరిగి ప్రారంభించనున్నట్టు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ కింజారపు రామ్మోహన్ నాయుడు గారు వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక రాజధాని విశాఖపట్నం నగరం నుండి రాజధాని విజయవాడ ప్రాంతం మధ్య విమాన సర్వీస్ తిరిగి ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ప్రస్తుత షెడ్యూల్ ప్రయాణికులకు మరింత సౌలభ్యం కలిగించేలా రూపొందించబడిందని తెలిపారు. ఇండిగో ఎయిర్‌లైన్స్ %ాూ=% విమానం విమానం విజయవాడ నుండి ఉదయం 7:15 గంటలకు బయలుదేరి, ఉదయం 8:25 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది అని. తిరుగు ప్రయాణంలో విశాఖపట్నం నుండి ఉదయం 8:45 గంటలకు బయలుదేరి, ఉదయం 9:50 గంటలకు విజయవాడకు చేరుకుంటుంది అని తెలిపారు.ప్రాంతీయ విమాన కనెక్టివిటీని బలోపేతం చేయడం, అభివృద్ధి చెందుతున్న నగరాల మధ్య వేగవంతమైన రవాణా సౌకర్యాన్ని కల్పించడం తమ మంత్రిత్వ శాఖ యొక్క ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ కీలక సర్వీసును తిరిగి అందుబాటులోకి తీసుకురావడం ఎంతో సంతోషకరమైన విషయమని తెలిపారు.

# కొడుకు వేధింపులకు... భయం గుప్పేట్లో తల్లిదండ్రులు

## -జిల్లా కలెక్టర్ ను కలిసినా తల్లి



గోవిందరావుపేట/ములుగు జిల్లా ప్రతినిధి, మే 5 (భారత శక్తి): ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం దుంపిల్ల గూడెం గ్రామానికి చెందిన జోగు స్వరూప సాంబయ్య దంపతుల మొదటి కొడుకు గత కొద్ది రోజులుగా తల్లిదండ్రులను బెదిరిస్తూ కర్రలతో కత్తులతో భయ భ్రాంతులకు గురి చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. జోగు స్వరూప సోమవారం ములుగు జిల్లా కలెక్టర్ కు మనవి పత్రం అందజేశారు.

స్వరూప మొదటి కొడుకు నా కట్నం పైసలు వాడుకున్నావని నా డబ్బులు నాకు ఇవ్వాలని నాలుగు లక్షలు ఇస్తేనే మీరు కట్టిన ఇంట్లోకి రానిస్తానని కోడలు, కొడుకు ఇద్దరు కలిసి మమ్మల్ని కర్రలతో కత్తులతో చంపుతామని బెదిరిస్తూ ఉన్నారని వారి నుండి మా ప్రాణాలను కాపాడాలని కలెక్టర్ కు వినతిపత్రం ద్వారా చెప్పుకున్నారు. కలెక్టర్ స్పందించి నీ కొడుకుపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, మీరు ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా ఉండాలని కలెక్టర్ స్వరూపకు హామీ ఇచ్చారు.

# ప్రజావాణి 55 దరఖాస్తులు

సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి, మే 5: జిల్లాలో ప్రజల సమస్యలను పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి 55 దరఖాస్తులు తమ సమస్యలు పరిష్కారం కోసం అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ ప్రతి అర్జీపై తక్షణ చర్యలు తీసుకొని సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు అలాగే ప్రజల ప్రధాన సమస్యలు పూర్తి దృష్టి పెట్టి పరిష్కారాల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్,డిఆర్ఓ పద్మజ రాణి ఆర్.డి. ఓ రవీందర్ రెడ్డి సంబంధిత శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# "మధుగురు అక్షర యజ్ఞం" ను ఆవిష్కరించిన మంత్రి సీతక్క



ములుగు జిల్లా ప్రతినిధి, మే 5 (భారత శక్తి): ములుగు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో "మధుగురు అక్షర యజ్ఞం" ప్రచార సంచికను రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృది మహిళా స్రీ - శిశు సంక్షేమ శాఖా మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ అక్షర యజ్ఞం నిర్వహకులు రౌతు. మధూగురు పిల్లలకు ఉన్న చదువులు -పెద్దలకు ఉపాధి మార్గాలు అందించాలనీ తెలిపారు. అక్షర యజ్ఞంలో భాగంగా మధుగురు ఇన్నోవేషన్ కేంద్రాలలో యువత, మహిళలకు ఉద్యోగానికి కావాల్సిన ప్రావీన్యాలని, నైపుణ్యాలని పెంపొందించడం, వ్యాపారానికి కావాల్సిన వనరులను అందించబడునని పూర్తి వివరాలకు 9441226834, 9491504405 లో సంప్రదించ గలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, ములుగు జిల్లా బి సి సెల్ అధ్యక్షుడు వంగ రవి, జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు రూపొందించాలి:జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి





కడప, మే 5(భారత శక్తి) : వ్యవసాయ రంగంలో రైతులు లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. వ్యవసాయ శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులకు సూచించారు. సోమవారం ఊటుకూరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఆవరణలో.. ఆచార్య ఎన్.జి.రంగా విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, తిరుపతి వారి ఆధ్వర్యంలో.. రెండు రోజుల దక్షిణ మండల వ్యవసాయ పరిశోధన %ు% విస్తరణ సలహా మండలి సమీక్షా సమావేశం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తో పాటు ఆచార్య ఎన్.జి.రంగా విశ్వవిద్యాలయం గుంటూరు లామ్ పరిశోధన సంచాలకులు డా. పి.వి. సత్యనారాయణ, విస్తరణ సంచాలకులు డా. జి. శివనారాయణ, తిరుపతి ఆర్.ఏ.ఆర్.ఎస్. (సౌత్ జోన్) పరిశోధన సహాయ సంచాలకులు డా. వి.సుమతి లు హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతుల తలసరి ఆదాయాన్ని పెంపొందించడంతో పాటు, వారి జీవన ఆర్థిక స్థితిని మెరుగు పరచడం కోసం ప్రతి వ్యవసాయ శాస్త్రవేత్త, అధికారి, రైతు సశ్రేయోభిలాషులు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.గత 20 ఏళ్లుగా శాస్త్రీయబద్ధంగా సిద్ధాంత పరంగా.. సూచించిన సూచనలే రైతులు అనుసరించేవారన్నారు. కానీ ప్రస్తుతం రైతులే క్షేత్రస్థాయిలో శాస్తవేత్తలుగా ఎదుగుతున్నారంటే... గర్వించదగ్గ విషయం అన్నారు. కావున వ్యవసాయ శాస్త్రవేత్తలుగా రైతులకు కావాల్సిన నిజమైన శాస్త్రీయ పద్ధతులను అందజేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో రైతులకు ఎదురయ్యే నిజమైన సమస్యను గుర్తించినపుడే రైతులకు సంపూర్తి స్థాయిలో సహకారం అందించిన వారు అవుతారన్నారు. పరిశోధన ప్రాణాళికలో పారదర్శకత, నిజాయితీ లేకపోతే.. కొన్ని రకాల సంప్రదాయ, వారసత్వ పంటలుగా పేరొందిన పంట రకాలను మన ప్రాంత రైతులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. వాతావరణ మార్పులకు, మన ప్రాంత భూమి స్వరూపానికి అనుగుణంగా పంటల పరిశోధన జరగాలన్నారు.. ప్రస్తుతం మైక్రో ఇరిగేషన్ కల్చర్ వ్యవసాయ రంగాన్నే పూర్తి స్థాయిలో మార్చి వేసిందన్నారు. సాగునీటి వ్యవస్థలో కూడా విస్తృతమైన, ఉపయోగకరమైన, అనుకులపైన పద్ధతులను అనుసరించేలా... కొత్త పద్ధతులను వెతకాలన్నారు. పరిశోధన అనేది కేవలం తాత్కాలిక లాభాల కోసం జరగకూడదని.. సాగుబడికి, దిగిబడికి, మార్కెటింగ్ కు అనువైన లాభదాయకమైన, మెకనైజేషన్ తోకూడిన నాణ్యమైన పద్ధతులను సూపొందించాలన్నారు. శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలను.. రైతులకు ప్రజలకు సీజన్ల వారీగా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. శాస్త్రీయ పద్ధతులను ప్రజలకు చేరవేయడంలో అందుబాటులో ఉన్న అన్ని రకాల కమ్యూనికేషన్ సాధనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తోందన్నారు గ్రామాల వారీగా.. వ్యవసాయ పరిశోధకులు.. రైతు సేవా కేంద్రాలలో వ్యవసాయ సహాయకులు సీజన్ వారీగా ఆయా ప్రాంతాల్లో పండించే పంటలు, వాటికి ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణ, ఆయా పైర్లకు అందాల్సిన పోషక విలువలు, ఎరువుల వాడకం మొదలైన ప్రక్రియల నిర్వహణపై.. ముందస్తుగా రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పరిశోధన సంచాలకులు డా. పి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ... రానున్న సంవత్సరంలో వ్యవసాయ పంటల సాగు ప్రాణాళికను సమర్ధవంతంగా రూపొందించి.. రైతులకు లాభదాయకమైన పంటలను ఎంపిక చేయాలని శాస్త్రవేత్తలు, రైతు శాస్త్ర వేత్తలను కోరాను. విస్తరణ సంచాలకులు డా. జి. శివనారాయణ మాట్లాడుతూ.. సాగుకు ఆమోదయోగ్యమైన భూములు దక్షిణ మండల వ్యవసాయ ప్రాంత పరిధిలో 30% మాత్రమే ఉన్నాయని.. ఆ శాతాన్ని మూడింతలు పెంపొందించేందుకు రైతులను ప్రోత్సహిస్తూ లాభదాయకమైన పంటల వంగడాలను సాగులోకి తీసుకు వచ్చేనెదుకు వ్యవసాయ అనుబంధ శాఖల శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులు కృషి చేయాలన్నారు. రాస్ పరిశోధన సహాయ సంచాలకులు డా. వి. సుమతి మాట్లాడుతూ... దక్షిణ మండలము, జిల్లాల విభజన తరువాత తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వై.యస్.ఆర్ కడప, ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు మొదలైన ఐదు జిల్లాలుగా ఏర్పాటు కావడం జరిగిందన్నారు. దక్షిణ మండలంలో ఖరీఫ్ కాలంలో 3,14,715 హెక్టార్ల సాధారణ విస్తీర్ణంకు గాను 2,28,688 హెక్టార్లలో (73 శాతం) వివిధ వ్యవసాయ పంటలు సాగుబడి చేయగా.. రబీలో 4,99,984 హెక్టార్లకు గాను 3,82,470 హెక్టార్లలో (76 శాతం) వివిధ పంటలు సాగు చేయడమైనదన్నారు. అంతేకాక దక్షిణ మండల ప్రాంతీయ పరిశోధనా కేంద్రం పరిధిలో గత ఏడాదిలో వ్యవసాయ సాగుబడిలో సాధించిన పరిశోధన, విస్తరణ ప్రగతిపై... పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా వివరించారు. అనంతరం దక్షిణ మండల వ్యవసాయ పరిశోధనా కేంద్రం పరిధిలో శాస్త్రవేత్తలు ప్రచురించిన పలు రకాల ప్రచురణ పుస్తకాలను జిల్లా కలెక్టర్ సంబంధిత శాస్త్రవేత్తలు, సంచాలకులతో కలిసి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుభాషిణి, పశుసంవర్ధక శాఖ జెడి డా. శారదమ్మ, మైనర్ ఇరిగేషన్ అధికారులు, దక్షిణ మండల జిల్లాల వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి: జాయింట్ కలెక్టర్ అదితి సింగ్



కడప, మే,5(భారత శక్తి) : ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.సోమవారం సభ భవన్ లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) లో జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారినే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుండి అందిన విజ్ఞప్తులలో కొన్ని కడప పట్టణం పాలెం పల్లె కు చెందిన సి. వెంకట సుబ్బమ్మ వితంతు పింఛను పెన్షన్ మంజూరు చేయాలని అభ్యర్తించారు. దువ్వూరు మండలం, కానగూడూరు కు చెందిన పి. ఖాసీంబూ తాను కొత్తగా నిర్మించుకున్న ఇంటికి నీటి కనెక్షన్ ఇప్పించి ఆదుకోవాలని కోరారు.తొండూరు మండల కేంద్రానికి చెందిన వి. శివ నారాయణ రెడ్డి సర్వే నెం. 347/ఏ లో ఓ.18 సెంట్ల స్థలం ను పట్టాదారు పుస్తకం లో ఎక్కించవలసిందిగా అభ్యర్తించారు.ఈ కార్యక్రమంలో డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, జడ్పి సీఈవో ఓబులమ్మ, మెప్మా పిడి కిరణ్, ఎస్ డీసీ శ్రీనివాసులు, వెంకటపతి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అకుంఠిత దీక్ష, పట్టుదల, ఆశయ సాధన మారుపేరు అపర భగీరథ మహర్షి: జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్





కడప, మే 5(భారత శక్తి) : అకుంఠిత దీక్ష, పట్టుదల, లక్ష్య నిర్దేశంతో చేసే ఏ ప్రయత్నంలోనైనా విజయాన్ని సాధించవచ్చని భగీరథ మహర్షి జీవిత సారాంశం తెలుపుతుందని.. జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. స్థానిక కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో వెనుకబడిన కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తో పాటు డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ అదితి సింగ్ మాట్లాడుతూ.. ఆశయ సాధన, అకుంఠిత దీక్ష, పట్టుదలకు నిలువెత్తు నిదర్శనం.. అపర భగీరథ మహర్షి అని కొనియాడారు. మరుగునపడిన చరిత్రకారుల జీవితాలను, మహనీయుల గొప్పతనాన్ని వెలికితీసి వారి ఆదర్శ భావాలకు అనుగుణంగా ప్రభుత్వం అధికారికంగా ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయం అన్నారు. భగీరథ మహర్షి మహాజ్ఞాని అని, పరోపకారానికి పెట్టింది పేరని, దీక్షా, సహనానికి ప్రతిరూపమని, ఎంతటి కష్టాన్నినైనా లెక్కచేయకుండా అనుకున్నది సాధించే గుణం గల వారిని ఆయన అన్నారు. ఏదైనా పనిని సంకల్పించినప్పుడు అపర భగీరథునితో పోలుస్తారన్నారు. వజ్ర సంకల్పంతో లక్ష్యాలను సాధించాలని భవిష్యత్ తరాలకు భగీరథ మహర్షి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని మనందరం కూడా ఆయన బాటలో నడవాలని ఆయన కోరారు. రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి మాట్లాడుతూ భగీరథ మహర్షి సేవానిరతి గొప్పదని, దేశం గర్వించదగ్గ మహనీయులలో ఆయన ఒకరని కొనియాడారు. అలాగే మన జిల్లా వాసి అయిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి రైతులకు సాగు నీరందించాలనే గొప్ప ఆశయంతో.. నీటిపారుదల ప్రాజెక్టులను నిర్మించి అపర భగీరధుడయ్యారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో మరుగున పడిన మహనీయుల ఆశయాలను, భావాలను ఈనాటి యువతరానికి తెలియజేయాలని.. ఇటువంటి కార్యమాలను చేపట్టడం హర్షణీయమన్నారు. దృఢ సంకల్పం ఉంటే ఎంత కష్టతరమైన పనైనా సాధించవచ్చునని భగీరథ మహర్షిని చరితం ద్వారా మనం నేర్చుకోవాలన్నారు. అంతేకాకుండా.. పట్టుదల, కష్టానికి మారు పేరుగా గుర్తింపబడిన సగర వంశం, ఉప్పర జాతి ఆవిర్భావం, భగీరథ జీవిత సారాంశాన్ని క్షుణ్ణంగా వివరించారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అపర భగీరథ మహర్షి యొక్క అడుగుజాడల్లో నడవాలని కోరారు.

ఇన్ని సంవత్సరాలు గడిచినా మహనీయులను, గొప్పవారిని మర్చిపోకుండా భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోష దగ్గ విషయమన్నారు. ఎంత కష్టమైన పనినైనా విజయం సాధించడంలో అపర భగీరథ మహర్షికే చెల్లిందని ప్రశంసించారు. అంతకుముందు భగీరథ మహర్షి చిత్రపటానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ, జిల్లా బీసీ వెల్ఫర్ అధికారి రాజ్యలక్ష్మి, బీసీ సంఘ నేత అవ్వారు మల్లికార్జున, జాతీయ ఎస్టీ, ఎస్సి సంఘం అధ్యక్షులు జెవి రమణ, పూలే విగ్రహ స్థాపన కమిటీ అధ్యక్షులు రమణయ్య, తొగట రాష్ట్ర స్థాయి అధ్యక్షులు మడక చంద్ర, జిల్లా సగర సంఘం అధ్యక్షులు మాదాసు మురళి, సెక్రెటరీ పైడికాల్వ సుబ్బారాయుడు, మాజీ అధ్యక్షులు రామచంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి వెన్నంపల్లె వెంకటేష్, మైదుకురు ఇంచార్జి మొగలి రామాంజనేయులు, కమలాపురం ఇంచార్జి మాకం భరత్, యువజన అధ్యక్షులు పాపగారి శివ, వివిధ వెనుకబడిన కులాల సంక్షేమ శాఖ ప్రతినిధులు, పలువురు బీసీ కుల సంఘ నాయకులు, ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞానం రైతులకు అందించేందుకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు: జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

## -మార్కెట్ డిమాండ్ అనుగుణంగా సాగు చేస్తేనే రైతులకు మేలు

## -వ్యవసాయ అభివృద్ధితోనే దేశ అభివృద్ధి సాధ్యం

## రఘునాథపాలెం మండలం రాంక్యాతండా రైతు వేదికలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యాక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్





ఖమ్మం ప్రతినిధి (భారత శక్తి న్యూస్ ), మే 05:విజ్ఞానం రైతులకు అందించేందుకు ప్రభుత్వం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యాక్రమాన్ని అమలు చేస్తున్నదని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.సోమవారం జిల్లా కలెక్టర్, రఘునాథపాలెం మండలం రాంక్యాతండా రైతు వేదికలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అన్నదాతల అవగాహన కార్యాక్రమానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆహార సంక్షోభం నుంచి బయటపడేందుకు మనం హరిత విప్లవం ప్రారంభించామని, నేడు మనం మనకు కావాల్సిన ఆహార ఉత్పత్తుల తయారీలో స్వావలంభన సాధించామని అన్నారు. నేడు రైతులకు దిగుబడి పెరిగినా లాభసాటి కావడం లేదని, రసాయనాల వాడకం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని అన్నారు. దేశంలో ఉన్న విజ్ఞానం రైతుల దగ్గరకు తీసుకొని వచ్చేందుకు ప్రభుత్వం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. మన నేల రకం, స్వభావం అనుగుణంగా ఎరువులు, రసాయనాల అవసరం మేరకు మాత్రమే వాడాలని కలెక్టర్ తెలిపారు. మనం పంట వేసే ముందు ఎరువులు, రసాయనాలు ఎంత వేయాలో తెలుసుకొని అంతే వేయాలని అన్నారు. మన దగ్గర ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటలను సాగు చేయాలని అన్నారు. రైతులు పంటల మార్పిడి విధానం అమలు చేయాలని అన్నారు. చిన్న, సన్నకారు రైతులు కాకుండా 5 ఎకరాల, 10 ఎకరాలు ఉన్న రైతులు ముందుకు వచ్చి వారికున్న కొన్ని ఎకరాలలో ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని అన్నారు. ఒక రైతుకు మరో రైతును చూసి మాత్రమే నమ్మకం కలుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లాలో 7 లక్షల ఎకరాల పంట పొలాలు ఉంటే నేడు వరి, పత్తి,మొక్కజొన్న 3 పంటలు 90 శాతానికి పైగా భూముల్లో రైతులు సాగు చేస్తున్నారని అన్నారు. గతంలో ఉన్న పప్పు దినుసులు, మిర్చి, కూరగాయలు, పండ్ల సాగు ఉండేదని అన్నారు. మార్కెట్ లో ఉన్న డిమాండ్ అనుగుణంగా పంటలను సాగు చేయాలని కలెక్టర్ సూచించారు. కార్బైడ్ రహిత మామిడి పండిస్తే డిమాండ్ ఉందని గమనించి రైతు ఆ దిశగా సాగు చేస్తే త్వరగా మంచి విలువతో అమ్ముకోవచ్చని అన్నారు. రైతులకు లాభం పెరగాలనే లక్ష్యంతో ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను చేపడుతుందని అన్నారు. ఖమ్మం నగరంలో ప్రత్యేకంగా మామిడి పండ్ల విక్రయానికి తాత్కాలిక మార్కెట్ ఏర్పాటు చేశామని అన్నారు. దళారులు లేకుండా రైతులు నేరుగా ప్రజలకు అమ్ముకునేలా వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

రైతులు ఒకసారి చర్చించుకొని మంచి ప్రయత్నం చేయాలని, ప్రభుత్వం తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని అన్నారు. అనంతరం మండలంలో నూతన సాగును ప్రోత్సహిస్తున్న రైతులను కలెక్టర్ సన్మానించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, వైరా కేవీకే శాస్త్రవేత్తలు రవికుమార్, ఖమ్మం అర్బన్ ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వర్ రెడ్డి, ఎంపీడివో అశోక్ కుమార్, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు నల్లమల వెంకటేశ్వరరావు, మంచుకొండ సొసైటీ అధ్యక్షులు మందడపు సుధాకర్, ఖమ్మం డివిజన్ ఆత్మ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, రఘునాధపాలెం సొసైటీ అధ్యక్షులు తాతా రాఘురాం, డివిజన్ ఉద్యానవనాధికారి నగేష్, ప్రతిభ వేదవ్యాస్, శివ, వేంకటేష్, గ్రామ సెక్రెటరీ లాలయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భూ ఆక్రమణలకు పాల్పడితే.. చర్యలు తప్పవు:జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి





కడప, మే 5(భారత శక్తి) : ప్రభుత్వ, ప్రయివేటు భూముల ఆక్రమణకు పాల్పడినట్లు తెలిస్తే వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి హెచ్చరికలు జారీ చేశారు. కడప మండలానికి సంబంధించి ఆంధ్రజ్యోతి, ఈనాడు మరియు సాక్షి దినపత్రకల యందు నందు 02.05.2025 వ తేదిన ప్రచురితమైన "ఖాళీ జాగాయేగా... కాజేద్దాం!", "పాత కడప చెరువు ఆక్రమణ" %ు% "పాతకడప చెరువు వద్ద రగడ" అన్న శీర్షికల పై విచారణ కొరకై కడప జిల్లా కలెక్టరు శ్రీ చెరుకూరి శ్రీధర్ గారు కడప రెవిన్యూ డివిజనల్ అధికారి, తహసిల్దారు మరియు కార్యాలయ సిబ్బందితో పాతకడప చేరువును 04.05.2025వ తేదీన సాయంత్రము తనిఖీ చేయడం జరిగింది.ఈ తనిఖీ నందు పత్రికల యందు ఆక్రమించి గ్రావెల్ తోలియున్నట్లుగా ఆరోపించియున్న భూమి.. పట్టా భూమిగా సర్వే నివేదిక ద్వారా తెలుసుకోవడం జరిగింది. తదుపరి కలెక్టరు గారు సదరు గ్రావెల్ ఎవరు తోలియున్నారోనన్న విషయముపై సమగ్రముగా విచారించి మరియు చెరువు నందు ఎలాంటి ఆక్రమణలు జరిగియున్నాయెూ పూర్తిగా సర్వే చేసి నివేదిక ఇవ్వవలసినదిగా కడప తహసిల్దారు వారిని ఆదేశించియున్నారు.తదుపరి జిల్లా కలెక్టరు గారు చెరువు నంది ఎలాంటి ఆక్రమణలు జరిగినను వారిపై కటినముగా చర్యలు తీసుకోనబడునని అందులో ఎంతటి వారినైనా రైతుల సంక్షేమము కొరకు ఉపేక్షించేది లేదని స్పష్టము చేసియున్నారు. ఇందు విషయమై మరింత లోతుగా విచారించి నివేదిక సమర్పించవలసినదిగా కడప రెవిన్యూ డివిజనల్ అధికారి మరియు తహసిల్దారు వారిని ఆదేశించియున్నారు. ఈ కార్యక్రమములో కడప రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీ జాన్ ఇర్విన్ గారు, తహసిల్దారు నారాయణరెడ్డి గారు, డిప్యూటీ తహసిల్దారు శివారెడ్డి మరియు సిబ్బంది కలెక్టరు గారి వెంట వున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రెవెన్యూ మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ, ప్రయివేటు భూముల ఆక్రమణకు పాల్పడినట్లు తెలిస్తే ఉపేక్షించేది లేదని, వారు ఎంతటివారైనా చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరికలు జారీ చేశారు.

# 'స్వాగ్' విషయంలో బాధపడలేదు.. ఎందుకంటే: శ్రీవిష్ణు



హైదరాబాద్: శ్రీవిష్ణుప్రధాన పాత్రలో నటించిన రీసెంట్ మూవీ 'చసింగిల్'ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఆయన పలు ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. 'చసింగిల్' విశేషాలతోపాటు తన గత చిత్రం 'స్వాగ్' రిజల్ట్ గురించి ఆయన మాట్లాడారు. 'స్వాగ్' రిజల్ట్ విషయంలో తాను ఏమీ బాధపడలేదన్నారు. మరికొంత కలెక్షన్స్ వస్తే నిర్మాత మరింత ఆనందించేవారన్నారు.

"'స్వాగ్' విషయంలో నేను ఏమీ నిరాశకు గురి కాలేదు. ఎందుకంటే, ఆ సినిమా నాకెంతో గుర్తింపు, పేరు వచ్చింది. రూ.100 కోట్ల బడ్జెట్‌తో సినిమా చేసినా అంత పేరు రాదేమో. నిజం చెప్పాలంటే, నేను కలెక్షన్స్ కంటే గుర్తింపునకే ప్రాధాన్యత ఇస్తుంటా. ఓటీటీలో విడుదల తర్వాత మిగిలిన రాష్ట్రాల్లోనూ నాకెంతో పేరు లభించింది. ఇంకాస్త ఎక్కువ కలెక్షన్స్ వచ్చి ఉంటే మా నిర్మాత మరింత సంతోషించేవారు" అని శ్రీవిష్ణు తెలిపారు. 'స్వాగ్'కు ముందు వచ్చిన చిత్రాలు రెండు ఎంటర్‌టైన్‌మెంట్ జానర్‌లో ఉండటం వల్ల ప్రేక్షకులు దీనిని కూడా వినోదాత్మక చిత్రమే అనుకున్నారని ఆయన తెలిపారు. గత చిత్రాలతో పోలిస్తే ఇందులో డ్రామా ఎక్కువగా ఉంటుందనే విషయాన్ని తాము ప్రేక్షకులకు తెలియచేయలేకపోయమన్నారు.

అనంతరం ఆయన చసింగిల్ గురించి మాట్లాడారు. "సింగిల్‌కు ముందు హ్యాష్‌ట్యాగ్ పెట్టడానికి కారణం ఉంది. సినిమా చూస్తే అది తెలుస్తుంది. 'సామజవరగమన' సమయంలోనే ఈ కథ నా వద్దకు వచ్చింది. దర్శకుడు తమిళనాడుకు చెందిన వ్యక్తి. దాంతో అతను కొన్నినెలల పాటు వర్క్ చేసి ఈ స్క్రిప్ట్ సిద్ధం చేశారు. ప్రేక్షకులను అలరించాలనే ఉద్దేశంతోనే ఈ సినిమాలో కొన్ని సోషల్‌మీడియాలో వైరల్ మూమెంట్స్‌ను రీ క్రియేట్ చేశాం. ఓ సీన్ విషయంలో వివాదం నెలకొంది. ఇతరులను కించపరచాలనే ఉద్దేశం మాకు ఏమాత్రం లేదు. ఆ వివాదాన్ని సాగదీయడం మాకు ఇష్టం లేదు. అందుకే మేము వెంటనే 'కన్నప్ప' టీమ్‌కు క్షమాపణలు చెప్పాం" అని ఆయన వివరించారు. మే 9న ఈచిత్రం విడుదల కానుంది. కేతికా శర్మ, ఇవానా కథానాయికలు.

# కారు యాక్సిడెంట్.. ఆ ఒక్క రాత్రి నన్నెంతో మార్చేసింది: నాని

హైదరాబాద్: తనకు గతంలో జరిగిన ఓ కారు ప్రమాదం గురించి నటుడు నాని తాజాగా వెల్లడించారు. ఆ ప్రమాదం తర్వాత తాను జీవితాన్ని చూసే కోణంలో ఎంతో మార్పు వచ్చిందన్నారు.

"కారు కొనుగోలు చేయడానికి కంటే ముందే నాకొక రోడ్డు ప్రమాదం జరిగింది. నా ఫ్రెండ్ కారు తీసుకుని స్నేహితులతో కలిసి హైవేపై డ్రైవ్‌కు వెళ్లా. రోడ్డుపై నిలిపిఉంచిన లారీని మా వాహనం ఢీకొట్టింది. రాత్రి సమయం కావడంతో చీకట్లో ఏమీ కనిపించని స్థితి. రోడ్డు మధ్యలో ఆగి ఉన్న లారీని గ్రహించేలోపు మా కారుకు జరగాల్సిన ప్రమాదం జరిగింది. లారీ వెనుక భాగం మా కారులోకి చొచ్చుకొచ్చింది. అద్దం ముక్కలు కావడంతో నా శరీరం మొత్తం రక్తం. నా పక్క సీట్‌లో ఉన్న స్నేహితుడు స్పృహ కోల్పోయాడు. ఏదో ఒక రకంగా ఆ కారు నుంచి బయటపడ్డాం.

మేము అంబులెన్స్‌లో ఆస్పత్రికి వెళున్న సమయంలో మరో యాక్సిడెంట్ మా కంట పడింది. ఓ పెళ్లి వాహనానికి ప్రమాదం జరిగింది. చాలామందికి గాయాలయ్యాయి. అందులో ఒక చిన్న పాప కూడా ఉంది. మా అంబులెన్స్‌లోనే వారిని



ఎక్కించారు. ఆ పాపను చూశాక.. మాకు జరిగిన ప్రమాదాన్ని మర్చిపోయాం. ఆ పాపను ఐసీయూలో చేర్పించారు. తనకు ఎలా ఉందో తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఉదయం వరకూ ఆ రూమ్ బయటే నిల్చొని ఉన్నా. ఆ ఒక్క రాత్రి నన్నెంతో మార్చేసింది. జీవితాన్ని చూసే విధానం మారింది. మనం ఈ భూమ్మీద ఉండే ప్రతి క్షణాన్ని సంతోషంగా జీవించాలని అర్థమైంది" అని నాని చెప్పారు. ఇక ఆ ప్రమాదం తర్వాత తాను కారు నడిపింది తక్కువే అని అన్నారు.

# స్టైల్ స్టైల్‌గా...

అల్లు అర్జున్‌ని 'పుష్ప' సినిమాలు ఐకాన్ స్టార్‌ని చేసేశాయి. అంతకుముందు ఆయన్ని స్టైలిష్ స్టార్ అని పిలిచేవారు. అందుకు తగ్గట్టే ప్రతి సినిమాకీ ఓ కొత్త రకమైన స్టైల్‌తో దర్శనమిచ్చేవారు. 'పుష్ప' పాత్ర కారణంగా దాదాపు ఐదేళ్లపాటు గుబురు గడ్డం, జుట్టుతోనే కనిపించాల్సి వచ్చింది. ఆ పాత్ర నుంచి బయటికి వచ్చాక మళ్లీ అల్లు అర్జున్ మునుపటిలా స్టైల్‌గా మారిపోయారు. కొత్త సినిమాలో ఎలాంటి లుక్‌లో కనిపిస్తారో ఇంకా స్పష్టత లేదు. చిత్రీకరణ ప్రారంభానికి ఇంకా చాలా సమయం ఉంది. ఒక దఫా లుక్ టెస్ట్ అయితే జరిగింది. ఇంకా తుది నిర్ణయానికైతే రాలేదని సమాచారం. అయితే అల్లు అర్జున్ మాత్రం బయట కొత్త రకమైన స్టైల్‌తో కనిపిస్తూ ఊరిస్తున్నారు. వేవ్స్ సమ్మిట్‌లో ఆయన లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆయన తదుపరి చిత్రం అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. అందులో భిన్నరకాల లుక్స్‌లో ఆయన సందడి చేస్తారని తెలుస్తోంది.



# బాలీవుడ్ మర్యాదలేని ప్రదేశం.. కన్నీళ్లు పెట్టుకున్న నటుడి కుమారుడు

బాలీవుడ్ దివంగత నటుడు ఇర్ఫాన్ ఖానకుమారుడిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాడు బాబిల్ ఖాన్ (%ద్ధిఖఎఅశ్రీ ఖష్ట్రబఅ%). 'ఖాలా'తో ఎంట్రీ ఇచ్చిన బాబిల్ అడపాదడపా సినిమాల్లో నటిస్తున్నాడు. తాజాగా అతడు ఇన్‌స్టా వేదికగా షేర్ చేసిన కొన్ని వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. హిందీ చిత్రపరిశ్రమలో ఉండే పరిస్థితులను అతడు ఆ వీడియోల్లో బయటపెట్టాడు. పరిశ్రమకు చెందిన అర్జున్ కపూర్, అనన్యపాండే, షనయా కపూర్ వంటి వారి తీరును ఎండగట్టాడు. బాలీవుడ్ పని చేయడానికి మంచి ప్రదేశం కాదంటూ తన ఆవేదన బయటపెట్టాడు.



"ఈరోజు మీ అందరితో ఒక విషయాన్ని పంచుకోవాలనుకుంటున్నా. ఈ పరిశ్రమలో అర్జున్, అనన్య, షనయాతోపాటు పరిశ్రమతో సంబంధం లేకుండా బయట నుంచి వచ్చిన అర్జిత్ సింగ్ వంటి వారు చాలామంది ఉన్నారు. ఈ ఇండస్ట్రీ ఎంతో అమర్యాదకరంగా ఉంటుంది. ఇప్పటివరకూ నేను చూసిన వాటిల్లో అత్యంత నకిలీ పరిశ్రమ ఇదే. ఇండస్ట్రీ బాగుండాలని కోరుకునే వారు కొంతమంది మాత్రమే ఉంటారు. నేను మీకు ఎన్నో విషయాలను తెలియజేయాలనుకుంటున్నా" అంటూ బాబిల్ కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ వీడియోను ఇన్‌స్టాలో షేర్ చేసి.. కొద్ది సేపటికే డిలీట్ చేశాడు. అంతేకాకుండా, బాలీవుడ్ గురించి మాట్లాడిన వీడియోలన్నింటినీ డిలీట్ చేసి.. తన ఖాతాను డీయాక్టివేట్ చేశాడు. అయితే, అప్పటికే బాబిల్ షేర్ చేసిన వీడియో వైరల్‌గా మారింది. బాలీవుడ్‌లో అతడిని ఎవరో తీవ్రంగా ఇబ్బంది పెట్టారని.. అందుకే ఇంతలా బాధపడుతున్నాడని పలువురు అంటున్నారు.

నటుడిగా దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు ఇర్ఫాన్ ఖాన్. 'ది వారియర్', 'పీకూ', 'ది లంచ్ బాక్స్' వంటి చిత్రాలు ఆయనకు అవార్డులు, రివార్డులు అందించాయి. 'సైనికుడు'తో ఆయన తెలుగు వారికి సుపరిచితమే. 2020లో ఆయన క్యాన్సర్‌తో మృతి చెందారు. ఆయన మరణం తర్వాత బాబిల్ నటుడిగా తెరంగేట్రం చేశాడు. ఇటీవల అతడు నటించిన 'లాగ్ అవుట్' విడుదలైంది.

# నానిని మెచ్చుకున్న రామ్‌చరణ్

నాని హీరోగా నటించిన రీసెంట్ మూవీ 'హిట్ 3' బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ సొంతం చేసుకున్న ఈ చిత్రంపై రామ్‌చరణ్ పశంసలు కురిపించారు. ముఖ్యంగా నాని కథల ఎంపికను ఆయన మెచ్చుకున్నారు. "'హిట్ 3' గురించి అద్భుతమైన రివ్యూలు వింటున్నా. వినూత్నమైన స్క్రిప్ట్‌లను ఎంచుకుంటూ విభిన్న జానర్స్‌లో బ్లాక్‌బస్టర్స్ అందుకుంటున్న మై డియర్ బ్రదర్ నానికి కంగ్రాట్స్. ఇలాంటి ఇంటెన్స్ చిత్రాన్ని రూపొందించిన దర్శకుడు శైలేశ్ కొలనుకు హ్యాట్సాఫ్. శ్రీనిధి శెట్టితోపాటు ఇతర చిత్రబృందానికి, నిర్మాతలకు అభినందనలు" అని రామ్‌చరణ్ రాసుకొచ్చారు.

హిట్ యూనివర్స్‌లో భాగంగా దీనిని సిద్ధం చేశారు. పవర్‌ఫుల్ పోలీస్ అధికారి అర్జున్ సర్కార్ పాత్రలో నాని నటించారు. జమ్మూకశ్మీర్‌లోని హోమిసైడ్ ఇన్వెస్టిగేటివ్ టీమ్ (హిట్)లో అర్జున్ విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో క్రూరమైన ఓ హత్య కేసు వెలుగులోకి వస్తుంది. అది ఎవరు చేశారో పరిశోధిస్తుండగా అచ్చం అదే తరహాలో దేశవ్యాప్తంగా 13 హత్యలు జరిగిన సంగతి తెలుస్తుంది. దీని వెనుక ఓ పెద్ద నెట్‌వర్క్ ఉందని అర్జున్ గ్రహిస్తాడు. మరి, ఈ కేసును అతడు ఏవిధంగా పరిష్కరించాడనే కోణంలో దీనిని తెరకెక్కించారు. మే 1న ఇది ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

## నానికి గాయం.. ఫొటోలు పంచుకున్న శైలేశ్




'హిట్ 3' చిత్రీకరణలో సమయంలో నాని తలకు గాయమైనట్లు ఇప్పటికే టీమ్ పలు ఇంటర్వ్యూల్లో చెప్పింది. దీనికి సంబంధించిన విజువల్స్‌ను తాజాగా శైలేశ్ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. సినిమాపై తన హీరోకు ఉన్న అభిరుచిని మెచ్చుకున్నారు. "దీని గురించి నేను ఇప్పటికే పలు సందర్భాల్లో మాట్లాడాను. తలకు గాయమైనప్పటికీ ఏమాత్రం వెనకడుగు వేయకుండా ఆ తర్వాత షాట్ కోసం నాని టైమ్‌కు సెట్‌లోకి వచ్చారు. సినిమాపై ఆయనకు ఉన్న ప్రేమ వెలకట్టలేనిది. నీతో ఈ సినిమా చేసే అవకాశం నాకు ఇచ్చినందుకు ధన్యవాదాలు. హిట్ 3 నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది" అని రాసుకొచ్చారు.

# అవనిగా త్రిష.. పోస్టర్ పంచుకున్న 'విశ్వంభర' టీమ్

చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'విశ్వంభర' . త్రిష ( కథానాయికగా కనిపించనున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ చిత్రీకరణ దశలో ఉంది. ఆదివారం త్రిష పుట్టినరోజు పురస్కరించుకొని చిత్రబృందం సర్‌ప్రైజ్ ఇచ్చింది. సినిమాలో ఆమె పాత్రను పరిచయం చేసింది. ఇందులో ఆమె అవని పాత్రలో కనిపించనున్నారని చెప్పి.. లుక్‌ను రివీల్ చేసింది. చీరకట్టులో ఆమె మెరిసిపోతూ కనిపించారు.

2006లో విడుదలైన 'స్టాలిన్' తర్వాత చిరంజీవి – త్రిష కలిసి వర్క్ చేస్తోన్న చిత్రమిది. సోషియో ఫాంటసీ కథాంశంతో రూపొందుతోంది. సినిమాలో భారీ విజువల్ ఎఫెక్ట్స్ ఉంటాయని ఇప్పటికే టీమ్ వెల్లడించింది. ఓ వైపు చిత్రీకరణ చేస్తూనే మరోవైపు, డబ్బింగ్ పనులను ఆరంభించేసింది. ఈ సినిమాలో చిరంజీవి హనుమాన్ భక్తుడిగా కనిపించనున్నారు. చిరంజీవి కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్ చిత్రంగా ఇది నిలవనుంది. ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎం.ఎం.కీరవాణి సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల తొలిపాట విడుదలైంది.



నాలుగు పదుల వయసులోనూ కెరీర్ పరంగా రాణిస్తున్నారు త్రిష. కోలీవుడ్‌లో ఇటీవల వరుస సినిమాల్లో ఆమె నటించారు. ఈ ఏడాదిలోనే ఆమె నటించిన మూడు చిత్రాలు విడుదలయ్యాయి. ప్రస్తుతం ఆమె 'థగ్ లైఫ్', 'సూర్య 45', 'రామ్' ప్రాజెక్ట్‌ల్లో నటిస్తున్నారు.

# ఏంజెల్ ట్యాక్స్ రద్దు.. ఇన్ని ప్రయోజనాలు

దేశీయంగా అంకుర (స్టార్టప్) వ్యవస్థ ఎంతగా వేళ్లూనుకుందో చెప్పడానికి ఈ గణాంకాలే నిదర్శనం. వినూత్న ఆలోచనను సేవ/ఉత్పత్తిగా ఆవిష్కరించే ప్రక్రియలో నిమగ్నమయ్యే అంకురాలను 'నిధుల సమీకరణ ప్రక్రియలో ఇబ్బంది పెట్టిన' ఏంజెల్ ట్యాక్స్‌ను ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) నుంచి ప్రభుత్వం తొలగించింది. ఫలితంగా పెట్టుబడిదార్లకు ఊరట కలగడంతో పాటు, సంస్థ నిర్వహణ-తమ లక్ష్యాలపై మాత్రమే దృష్టి సారించేందుకు ఔత్సాహిక వాణిజ్య వేత్తలకు వీలవుతోంది.



2012లో అమల్లోకి

నమోదుకాని కంపెనీలు పెట్టుబడిదార్ల నుంచి సమీకరించే నిధులను, లాభంగా పరిగణించి.. సెక్షన్ 56(2)లో 7బి నిబంధన ప్రకారం ఆదాయపు పన్ను విభాగం వసూలు చేసేదే ఏంజెల్ ట్యాక్స్. అప్పట్లో అంకురాలకు బ్యాంకులు రుణాలిచ్చేవి కావు. ప్రైవేటు సంస్థలు, వ్యక్తులే పెట్టుబడులు పెట్టేవారు. అంకురం విలువ నిర్ధారించేందుకు తగిన మార్గదర్శకాలు లేనందున, నిధుల అక్రమ బదిలీకి - మనీ లాండరింగ్‌కు అంకుర వ్యవస్థను పలువురు వినియోగించుకున్నారు. ఇలాంటి అక్రమాల నిరోధానికి 2012లో ప్రవేశ పెట్టిందే ఏంజెల్ ట్యాక్స్. ఇప్పుడు అంకుర వ్యవస్థ.. విలువ గణన ప్రక్రియలు బలోపేతం కావడం, నగదు బదిలీ-పన్ను వ్యవస్థలకు సంబంధించిన డేటా అంతా అనుసంధానమవ్వడం వల్ల, వీటిల్లో పెట్టుబడులపై నిఘా అవసరం లేదు. 2016, 2019లో విభాగాలు, రంగాల వారీగా, దేశీయ పెట్టుబడిదార్లకు ఈ పన్ను నుంచి మినహాయింపు ఇచ్చారు. 2023లో విదేశీ పెట్టుబడిదార్లకూ ప్రయోజనాలు విస్తరించారు. ఇప్పుడు పూర్తిగా తొలగించారు.

సంస్థ విలువను లెక్కించేందుకు

'ఒక సంస్థ విలువను లెక్కించేందుకు ప్రాఫిటబులిటీ/రెవెన్యూ మల్టిపుల్స్, డిస్కౌంటెడ్ క్యాష్‌ఫ్లోస్‌ను ప్రాతిపదికగా తీసుకుంటారు. అంకుర సంస్థల్లో ఆలోచన/ప్రోటోటైప్ ఉంటుంది కానీ, ఉత్పత్తి/సేవ ఉండదు. అవి సిద్ధం కానప్పుడే, సంస్థకు విలువ ఎలా లెక్కిస్తారు' అనేది ప్రభుత్వ వాదన. 'మా ఆలోచన కార్యరూపం దాలిస్తే, అయిదేళ్లలో ఇంత ఆదాయం/లాభాలు ఆర్జించగలం అని అంకుర సంస్థలు చెబుతాయి. వీరి బిజినెస్ మోడల్/ పరిష్కరించే సమస్య తీరును బట్టి.. ఆయా సంస్థలు ఎంత వ్యాపారం చేయగలవో అంచనా వేసి, ఏంజెల్ ఇన్వెస్టర్లు పెట్టుబడి పెడతారు.

'ప్రస్తుతం ఇంతమంది వినియోగదార్లున్నారు.. తొలి ఏడాది పూర్తయ్యేసరికి ఇంతమంది ఖాతాదార్లు వస్తారు, వారిపై ఇంత ఆదాయం/ లాభం వస్తుంది. డిస్కౌంటెడ్ క్యాష్‌ఫ్లో ప్రకారం.. మా సంస్థ విలువ ఇంత' అని వివరిస్తే.. అంగీకరించిన వారే పెట్టుబడి పెడతారు.

ప్రభుత్వం ఏమనేది?

ప్రభుత్వం మాత్రం సదరు అంకురం తరహాలోని కంపెనీలను, వాటి ఆదాయాలు, లాభదాయకతను బేరీజు వేసుకుని, సంస్థకు ఒక విలువను వెల్లడిస్తుంది. అంతకుమించి విలువ చూసి, దానికనుగుణంగా సమీకరించిన నిధులపై పన్ను వేసేది. ఉదాహరణకు సదరు అంకురం విలువ రూ.5 కోట్లని ప్రభుత్వం పేర్కొంది అనుకుందాం. ఆ సంస్థ నిర్వాహకులు రూ.10 కోట్లు సమీకరించి ఉంటే, రూ.5 కోట్లు లాభంగా పరిగణించి, దీనిపై 30.9% పన్ను కట్టమని ఆదాయపు పన్ను విభాగం కోరేది. అంటే అంకుర సంస్థ రూ. కోటిన్నరపైనే పన్ను కట్టేది. అంటే వారికి మిగిలింది రూ.8.5 కోట్లు. ఆశించిన మొత్తం కంటే తక్కువ నిధులు మిగలడంతో.. సంస్థ సామర్థ్యం, భవిష్యత్తు లాభాదాయాలు అంచనాల కంటే తగ్గేవి. ఈ బాధలు పడలేక, బయటినుంచి డబ్బులు సమీకరించకుండా ఔత్సాహికులు సొంత నిధులు, సన్నిహితుల నుంచే సమీకరించేవారు.

ఇప్పుడు పెట్టుబడిదారు ఇచ్చిన నిధులన్నీ అంకుర సంస్థలకు అందుతాయి. వీటిపై పన్ను కట్టనక్కర్లేదు.

గతంలో పన్ను విషయమై చాలా కంపెనీలు కోర్టుల్లో కేసులు వేశాయి. ఇలాంటి కేసులు కొన్ని వందలుంటాయని హైదరాబాద్, అమెరికాల్లో అంకురాలను నిర్వహిస్తున్న టెక్ ఎరా మేనేజింగ్ డైరెక్టర్ చెరుకూరి కిరణ్ 'ఈనాడు'కు చెప్పారు. వినూత్న సేవ/ఉత్పత్తి సత్వర ఆవిష్కరణ, మార్కెటింగ్ చేసుకోవడంపై శ్రద్ధ వహించాల్సిన కంపెనీలు తమ విలువైన కాలాన్ని న్యాయపోరాటానికి వెచ్చించేవి. ఈ కేసుల ఖర్చు ఎవరు భరించాలనే మీమాంసా ఉండేది. ఇకపై కేసుల వ్యవహారం ఉండదు.

ప్రభుత్వ అంచనాకు భిన్నంగా, అంకుర సంస్థ విలువ ఉంటే.. వివాదంలో ఎవరు గెలుస్తారో తెలియక, తామిచ్చిన డబ్బులు ఏమవుతాయో తెలియక, పెట్టుబడిదార్లు ఒత్తిడిలో ఉండేవారు. ఇవి తొలగుతాయి.

ఏంజెల్, విదేశీ పెట్టుబడిదార్లు, ఫ్యామిలీ ఆఫీసులు, వెంచర్ క్యాపిటల్ ఫండ్‌లకూ.. తమ పెట్టుబడుల్లో ప్రభుత్వ జోక్యం నచ్చదు. ఇప్పుడు వ్యవస్థపై నమ్మకం పెరిగింది. ఫలితంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) పెరుగుతాయి. కంపెనీ విలువను ఇన్వెస్టర్‌తో కలిసి నిర్ధారించుకుంటారు.

ప్రీమియం విద్యాసంస్థల ఉత్తీర్ణులతో పాటు బహుళజాతి సంస్థల నుంచి బయటకు వస్తున్న నిపుణులు కూడా అంకురాలను స్థాపిస్తున్నారు. అందువల్ల నిధుల దుర్వినియోగానికి ఆస్కారం తక్కువ.

2025-28 మధ్య విదేశాల నుంచి అంకురాల్లోకి పెట్టుబడులు మరో 15-20% పెరుగుతాయని అంచనా వేస్తున్నారు.

డీప్‌టెక్‌లు పెరుగుతాయ్

ఏరోస్పేస్, శాటిలైట్ టెక్నాలజీస్, కొత్త డ్రగ్ ఆవిష్కరణ, డిఫెన్స్ టెక్, యాపిల్ లాంటి కొత్త ప్రోడక్ట్ ఆవిష్కరణకు ప్రయత్నించే డీప్‌టెక్ సంస్థలు దేశీయంగా పెరుగుతాయి. సాధారణంగా వీటి లాభార్జనకు పట్టే సమయం కనీసం అయిదారేళ్లు ఉంటుంది. వీటి కాన్సెప్ట్ ప్రూవ్ చేయడానికే 18-24 నెలలు పట్టొచ్చు. ల్యాబ్స్ ఏర్పాటు తదితర పనులకే అధిక పెట్టుబడులు కావాలి. అందుకే వీటికి బదులు, డబ్బులు త్వరగా సంపాదించే అంకురాల్లోకే ఇప్పటివరకు పెట్టుబడులు ఎక్కువగా అందుతున్నాయి. ఇకపై మారుతుంది.

డిస్కౌంటెడ్ క్యాష్‌ఫ్లో అంటే..

ఏడాది వ్యవధిలో రూ.5 కోట్లు, రెండేళ్లలో రూ.8 కోట్లు, మూడేళ్లలో రూ.10 కోట్ల లాభం వస్తుంది అని కంపెనీ చెప్పుకుంటుంది. మూడేళ్ల తరవాత నాకు వచ్చే రూ.10 కోట్ల లాభం విలువ.. ఈరోజు ఎంత అనేది లెక్కించడమే డిస్కౌంటెడ్ క్యాష్‌ఫ్లో.



# క్రెడిట్ కార్డు మినిమమ్ డ్యూ కడుతున్నారా?లాభనష్టాల మాటేంటి?

: ఒకప్పుడు ఏదైనా కొనాలంటే డబ్బులు చేతిలో ఉంటేనే సాధ్యం. కానీ, రోజులు మారాయి. పరిస్థితులూ మారాయి. క్రెడిట్‌కార్డులు అందుబాటులోకి వచ్చాయి. దీంతో క్షణాల్లో అప్పు పుడుతోంది. వాటితో కావాల్సిన వస్తువులను కొనుగోలు చేయడం సులువైపోయింది. చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా క్రెడిట్ కార్డు చేతిలో ఉంటే చాలు.. కావాల్సినంత షాపింగ్ చేయొచ్చు. ఇంతవరకు బాగానే ఉంది. మరి బిల్లు మాటేంటి? చేతిలో డబ్బులున్నా క్రెడిట్ కార్డు వినియోగించి.. బిల్లొచ్చాక చెల్లించేవారు కొందరైతే.. చేతిలో చిల్లిగవ్వ లేకున్నా క్రెడిట్ కార్డును ఎడాపెడా వాడేసి తర్వాత నిట్టూర్చేవారు ఇంకొందరు. దీంతో చేసేది లేక 'మినిమమ్ బిల్లు' చెల్లించి తాత్కాలిక ఊరట పొందుతుంటారు. ఇలా చేయడం వల్ల జరిగే లాభనష్టాలను చర్చిద్దాం.

క్రెడిట్ కార్డు బిల్లు వచ్చేటప్పుడు మూడు రకాల పేమెంట్ ఆప్షన్లు కనిపిస్తాయి. అందులో ఒకటి మినిమమ్ అమౌంట్ డ్యూ, పూర్తి మొత్తం, అదర్ అమౌంట్. ఏ నెలకాలనెల పూర్తి మొత్తం చెల్లిస్తే ఇబ్బంది లేదు. కానీ, బిల్లు మొత్తం కట్టకుండా ఆ నెల కొంత మొత్తం మాత్రమే చెల్లించడమే మినిమమ్ అమౌంట్ పేమెంట్ లేదా మినిమమ్ డ్యూ అంటారు. అన్ని బ్యాంకులు/ ఎన్‌బీఎఫ్‌సీలు ఈ సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి. చాలా వరకు బ్యాంకులు మొత్తం బిల్లులో 5 శాతం దీని కింద చెల్లించాల్సి ఉంటుంది. బ్యాంకులను బట్టి ఈ మొత్తంలో స్వల్ప మార్పులుండొచ్చు. చాలామంది 'మినిమమ్' చెల్లిస్తే ఎలాంటి వడ్డీ పడదని అనుకుంటారు. అది వాస్తవం కాదు. కనీస చెల్లింపుల వల్ల పెనాల్టీలు, లేటు ఫీజుల నుంచి మాత్రమే మీకు ఊరట లభిస్తుంది. చెల్లించాల్సిన మొత్తానికి బ్యాంకు మీకు వడ్డీ విధిస్తుంది.

ఉదా: రవి అనే ఉద్యోగి మే నెలలో క్రెడిట్ కార్డుతో రూ.20 వేలు ఖర్చు చేశాడనుకుందాం. జూన్‌లో ఆ మొత్తం బిల్లు కట్టాల్సి ఉంటుంది. అయితే, ఆ నెల అతడి వద్ద డబ్బులు లేకుంటే మినిమమ్ బిల్లు కట్టేసి బయటపడొచ్చు. అంటే ఓ వెయ్యి రూపాయలు చెల్లిస్తే చాలు. ఆ తర్వాతి నెలలో రూ.19వేలతో పాటు దానికి బ్యాంకు విధించే వడ్డీ కలిపి చెల్లించాలి. ఆ నెల కూడా కొంత మొత్తం షాపింగ్ చేస్తే అది కూడా తర్వాతి నెల బిల్లింగ్‌లో చెల్లించాల్సి ఉంటుంది.

'మినిమమ్' కడితే ఏం జరుగుతుంది?

- కనీస మొత్తం చెల్లించడం వల్ల ఆ నెల పెద్ద మొత్తంలో బిల్లు చెల్లింపు భారం తప్పుతుంది.

- కనీస మొత్తం చెల్లిస్తే మీ అకౌంట్ రెగ్యులర్‌గా ఉంటుంది. అంటే మిమ్మల్ని బ్యాంక్ డిఫాల్ట్‌గా గుర్తించదు.

- స్వల్ప మొత్తం చెల్లించడం వల్ల బ్యాంకులు మీ నుంచి ఆలస్య రుసుములు వసూలు చేయవు.

-మినిమమ్ డ్యూ కడితే క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరోలకు 'డిఫాల్ట్' అనే సమాచారం వెళ్లదు. దీంతో ఆ మేర క్రెడిట్ స్కోరును కోల్పోకుండా ఉంటారు.

- నష్టాల విషయానికొస్తే.. కనీస మొత్తం చెల్లిస్తే బ్యాంకులు భారీ వడ్డీని విధిస్తాయి. చెల్లించాల్సిన మొత్తానికి దాదాపు 36 శాతం నుంచి 48 శాతం వరకూ వడ్డీని వసూలు చేస్తాయి.

- కొన్ని నెలల పాటు మీరు కనీస మొత్తం చెల్లించుకుంటూ పోతే వడ్డీతో పాటు అప్పుల భారం కూడా పెరిగిపోతుంది. దాన్ని తీర్చడానికి మరింత అప్పు చేయాల్సి రావొచ్చు. దీంతో అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉంది.

- కనీస మొత్తం చెల్లించడం, దానిపై మరికొంత మొత్తం వాడుకుంటూ వెళ్లడం వల్ల మీ క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో పెరిగిపోతుంది. దీనివల్ల క్రెడిట్ స్కోరుపై ప్రభావం పడుతుంది.

- ఏ నెలకానెల మీ క్రెడిట్ కార్డు రుణాన్ని వాయిదా వేసుకుంటూ వెళ్లడం వల్ల కొత్తగా రుణాలు, క్రెడిట్ కార్డులు పొందాలంటే కష్టంగా మారొచ్చు. మీకు రుణం జారీ చేయడం రిస్క్‌తో కూడుకున్నదని బ్యాంకులు భావించే ప్రమాదం ఉంది.

- క్రెడిట్ కార్డు ఉంటే మన చేతిలో అత్యవసర నిధి ఉన్నట్లే చాలా మంది భావిస్తుంటారు. అలాంటి వారికి క్రెడిట్‌కార్డు ఆపత్కాలంలో పనిచేస్తుంది. ఒకవేళ మీరు క్రెడిట్ కార్డును మినిమమ్ బిల్లు కట్టుకుంటూ వెళితే అత్యవసర సమయాల్లో మీకు ఇబ్బందులు ఎదురవ్వొచ్చు.

గమనిక: ఈనాడు.నెట్‌లో కనిపించే వ్యాపార ప్రకటనలు వివిధ దేశాల్లోని వ్యాపారస్తులు, సంస్థల నుంచి వస్తాయి. కొన్ని ప్రకటనలు పాఠకుల అభిరుచిననుసరించి కృత్రిమ మేధస్సుతో పంపబడతాయి. పాఠకులు తగిన జాగ్రత్త వహించి, ఉత్పత్తులు లేదా సేవల గురించి సముచిత విచారణ చేసి కొనుగోలు చేయాలి. ఆయా ఉత్పత్తులు / సేవల నాణ్యత లేదా లోపాలకు ఈనాడు యాజమాన్యం బాధ్యత వహించదు. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకి తావు లేదు.

# అమెరికాకు రూటు మారుతోంది



దిల్లీ: దిల్లీ నుంచి ఉత్తర అమెరికా నగరాలకు వెళ్లే విమానాలకు, ప్రత్యామ్నాయ మార్గాలను ఎయిరిండియా అన్వేషిస్తోంది. మనదేశంలోనే దిల్లీ నుంచి మరో నగరానికి వచ్చి.. అక్కడ నుంచి అమెరికాకు బయలుదేరే అవకాశాలనూ పరిశీలిస్తోంది. తద్వారా పాకిస్థాన్ గగనతల ఆంక్షల వల్ల, అధిక దూరం ప్రయాణించేందుకు అవుతున్న వ్యయ భారాన్ని తగ్గించుకోవాలని చూస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం వారానికి 71 విమానాలను ఉత్తర అమెరికాకు ఎయిరిండియా నిర్వహిస్తోంది. అందులో 54 సర్వీసులు దిల్లీ నుంచే వెళ్తున్నాయి. 'ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నాం. విదేశీ టెక్-స్టాప్స్ సంఖ్య తగ్గించడం, మరిన్ని నాన్-స్టాప్ సర్వీసులను త్వరలోనే పెంచుతామ'ని ఎయిరిండియా ఎండీ, సీఈఓ తమ సిబ్బందికి పంపిన సమాచారంలో పేర్కొన్నారు. పాకిస్థాన్ గగనతల మూసివేత వల్ల దిల్లీ సహా ఉత్తర భారత నగరాల నుంచి అమెరికా వెళ్లే విమానాలన్నీ అరేబియా సముద్రం మీదుగా, సుదీర్ఘ మార్గాల్లో వెళ్తున్నాయి. ఇందువల్ల ప్రయాణ సమయం, వ్యయాలు అధికమవుతున్నాయి.

ఇలా పరిశీలిస్తోంది..: దిల్లీ నుంచి అమెరికా వెళ్లే విమానాలకు.. ముంబయి లేదా అహ్మదాబాద్‌ను టెక్నికల్ స్టాప్‌గా తీసుకోవడం ద్వారా ఐరోపా నగరాల్లో ఆపాల్సిన అవసరం లేకుండా చూసుకోవాలని ఎయిరిండియా భావిస్తున్నట్లు సమాచారం.

ఎంత నష్టమంటే..: పాకిస్థాన్ గగనతల మూసివేత వల్ల ఏడాదికి 600 మిలియన్ డాలర్ల (సుమారు రూ.5,200 కోట్ల) అదనపు వ్యయాలు కావొచ్చని ఎయిరిండియా అంచనా వేసినట్లు ఆ వర్గాలు చెబుతున్నాయి. మొత్తం మీద భారతీయ విమానయాన కంపెనీలకు నెలకు రూ.306 కోట్ల అదనపు వ్యయాలు అవ్వొచని అంచనా.

ఇదే బాటలో విదేశీ సంస్థలూ..

భారత విమానయాన సంస్థలకు మాత్రమే తమ గగన తలాన్ని మూసివేస్తున్నట్లు పాకిస్థాన్ ప్రకటించింది. అయితే మన దేశానికి సర్వీసులు నిర్వహిస్తున్న పాశ్చాత్య దేశాల విమానయాన సంస్థలు కూడా ఐచ్ఛికంగా పాకిస్థాన్ గగనతలానికి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నాయని సమాచారం. పాకిస్థాన్ గగనతలంలో ప్రయాణించినందుకు ఆయా విమానయాన సంస్థలు ప్రతినెలా చెల్లించే మిలియన్ల కొద్దీ డాలర్ల ఆదాయాన్ని ఆ దేశం కోల్పోతోంది. 2019 ఫిబ్రవరిలోనూ భారత్‌తో వివాదం నేపథ్యంలో, గగనతలంపై నిషేధం విధించిన పాకిస్థాన్ అయిదు నెలల్లో 10 కోట్ల డాలర్లు కోల్పోయింది.ఈ సంస్థలన్నీ: గత 2 రోజుల్లో లుఫ్తాన్సా (జర్మనీ), బ్రిటిష్ ఎయిర్‌వేస్, స్విస్, ఎయిర్ ఫ్రాన్స్, ఐటీఏ (ఇటలీ), ఎల్‌ఓటీ (పోలండ్) వంటి ఐరోపా దేశాల ప్రధాన విమానయాన కంపెనీలు పాకిస్థాన్ గగనతలాన్ని వాడటం మానేశాయి. ఇందువల్ల ఐరోపా, భారత నగరాల మధ్య ప్రయాణ సమయం గంట పెరిగింది. ఇందుకోసం ఇంధన వ్యయం అధికమైనందున, ఆ భారాన్ని ప్రయాణికులకే సంస్థలు బదలాయిస్తున్నాయి.

పాకిస్థాన్ విమానయాన సంస్థలకూ భారం: పాకిస్థాన్ విమానయాన సంస్థలు నిర్వహించే విమానాలకు భారత గగనతలాన్ని నిషేధించారు. ఇందువల్ల పాకిస్థాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్‌కు ఆర్థిక భారం తలెత్తుతోంది. ఇస్లామాబాద్ నుంచి కౌలాలంపూర్‌కు 5.30 గంటల్లో చేరాల్సిన విమానం, చుట్టూతిరిగి వెళ్లేసరికి 8.30 గంటల సమయం పడుతోంది. పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్, శ్రీలంక వెళ్లాల్సిన విమానాలూ చుట్టూ తిరిగి వెళ్లాల్సిందే

మనదేశంలో ఉత్తర ప్రాంతం ముఖ్యంగా దిల్లీ నుంచి విదేశాలకు వెళ్తున్న విమానాలకే పాకిస్థాన్ అడ్డంకి ఎక్కువగా ఉంది. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి దక్షిణ ప్రాంతాలతో పాటు అహ్మదాబాద్, ముంబయి వంటి విమానాశ్రయాల నుంచి బయలుదేరి వెళ్లే విమానాలకు ఇబ్బందులు లేవని నిపుణులు చెబుతున్నారు.

# బంగారాన్ని అమ్మడమూ సులభమే

హైదరాబాద్: బంగారాన్ని విక్రయించాలనుకునే వారికి సౌలభ్యంగా ఉండేలా, కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత 'గోల్డ్ మెల్టింగ్ ఏటీఎం'ను తీసుకొస్తున్నట్లు హైదరాబాద్ సంస్థ గోల్డ్‌సిక్కా వెల్లడించింది. మూడేళ్ల క్రితం పసిడి విక్రయానికి ఏటీఎంను ఆవిష్కరించిన ఈ సంస్థ.. ఈసారి ప్రజలు బంగారాన్ని విక్రయించేందుకూ వీలయ్యే యంత్రాన్ని తీసుకొచ్చింది. దీనిద్వారా బంగారాన్ని అమ్మడం, పాత బంగారాన్ని కొత్త నగలతో మార్పిడి చేసుకోవడం, నగదీకరణ లాంటివి సాధ్యమవుతాయి. ఈ యంత్రం సిద్ధంగా ఉన్నా, నెలన్నరలో అందుబాటులోకి తెస్తామని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ తరుజ్ తెలిపారు. 'బంగారాన్ని ఈ యంత్రం కరిగిస్తుంది. (దీనికోసం ధ్రువీకరణ ఇవ్వాలి) ఆ తర్వాత స్వచ్ఛతను పరీక్షిస్తుంది. దీని ఆధారంగా ప్రస్తుత ధరను బట్టి, ఎంత మొత్తం వస్తుందనేది తెలియజేస్తుంది. సంబంధిత వినియోగదారుడు ఆ విలువను ఆమోదిస్తే.. ఆ తర్వాత వారి ఇష్టానుసారం నగదు లేదా కొత్త బంగారాన్ని ఇస్తుంది' అని వివరించారు. నగదు ఖాతాలోకి జమయ్యేందుకు 30 నిమిషాలు పడుతుందన్నారు.



# క్యాన్సర్ మళ్లీనా?వద్దే వద్దు



క్యాన్సర్ వచ్చిందంటేనే నిలువెల్లా కంపించి పోతాం. అలాంటిది తిరగబెట్టిందని తెలిస్తే? కీమో, సర్జరీ, రేడియేషన్ చికిత్సలన్నీ చేయించుకొని.. ఆ బాధలన్నీ భరించి.. జబ్బు పూర్తిగా నయమైన తర్వాత క్యాన్సర్ మళ్లీ వస్తే? ఆ వేదన వర్ణనాతీతం. ఇంతకీ ఇది ఎందుకు తిరగబెడుతుంది? మళ్లీ దాడి చేయకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

క్యాన్సర్ చికిత్స పూర్తయ్యాక ఆరు నెలల వరకూ ఒంట్లో క్యాన్సర్ ఆనవాళ్లేమీ లేకపోతే నయమైనట్టుగా భావిస్తారు. స్కాన్, రక్త పరీక్షలు, శారీరక లక్షణాలు.. అన్నింటినీ నిశితంగా పరిశీలించి జబ్బు పూర్తిగా తగ్గిపోయిందని (కంప్లీట్ రెమిషన్) నిర్ణయిస్తారు. అయితే కొందరిలో మళ్లీ తిరగబెట్టొచ్చు. అంతకుముందు క్యాన్సర్ వచ్చినచోటే మళ్లీ కణితి ఏర్పడొచ్చు. లేదూ చుట్టుపక్కల భాగాల్లో, దూరంగా ఉన్న భాగాల్లోనైనా తిరగబెట్టొచ్చు. దీనికి కారణం చికిత్స విఫలం కావటం కాదు. చికిత్స పూర్తయినా కూడా కొన్ని క్యాన్సర్ కణాలు అలాగే ఉండిపోవటం. చిత్రమేంటంటే ఇవి పరీక్షల్లోనూ కనిపించవు. శరీరంలో నిద్రాణంగా ఉండిపోతాయి. ఇవే తిరిగి కణితిగా ఏర్పడుతుంటాయి. ఈ తిరగబెట్టిన క్యాన్సర్ ఒకచోటే వస్తే నయమయ్యే అవకాశం ఎక్కువ. వేర్వేరు చోట్ల వస్తే మాత్రం కష్టం. అందుకే చికిత్స అనంతరమూ డాక్టర్లు చెప్పినట్టుగా పరీక్షలు చేయించుకోవటం చాలా ముఖ్యం. ముందే ఆనవాళ్లను గుర్తిస్తే చికిత్స తేలికవుతుంది. అయితే అసలు సమస్య తిరగబెట్టకుండా చూసుకోవటమే అన్నింటికన్నా ఉత్తమం.

క్యాన్సర్ తిరగబెట్టడమనేది ప్రధానంగా క్యాన్సర్ రకాలను బట్టి ఉంటుంది. ఇలా తిరగబెట్టే ముప్పు కాలం గడుస్తున్నకొద్దీ తగ్గుతూ వస్తుంది. ఉదాహరణకు- చికిత్సతో నయమయ్యాక తొలి రెండేళ్లలో 20% వరకూ తిరగబెట్టే అవకాశముంది. ఇది 2-5 ఐదేళ్లలో 10% కన్నా తక్కువకు పడిపోతుంది. ఐదేళ్ల తర్వాత 2% కన్నా తక్కువేనని చెప్పుకోవచ్చు. అందుకే ఐదేళ్లు దాటితే జబ్బు నుంచి పూర్తిగా బయటపడ్డట్టుగా, క్యాన్సర్‌ను జయించినట్టుగా (క్యాన్సర్ సర్వైవర్) పరిగణిస్తారు.

నివారణ మార్గాలివీ

శరీరంలో నిద్రాణంగా ఉండిపోయిన క్యాన్సర్ కణాలకు అనువైన వాతావరణం ఏర్పడినప్పుడు తిరిగి కణితిగా ఏర్పడే ప్రమాదముంది. ఇందులో జీవనశైలి, ఆలోచనా సరళి గణనీయమైన పాత్ర పోషిస్తాయి. అందువల్ల వీటి విషయంలో జాగ్రత్త అవసరం.

సానుకూల ఆలోచనా ధోరణి: ఇది చాలా చాలా ముఖ్యం. సానుకూల ఆలోచనలతో రోగనిరోధకశక్తి పెరుగుతుంది. ఇటీవల చాలా క్యాన్సర్లకు ఇమ్యూన్‌థెరపీ ఉపయోగపడుతోంది. ఇదేంటో కాదు, రోగనిరోధకశక్తిని పెంచటానికి ఉద్దేశించిందే. రోగనిరోధకశక్తి పుంజుకోవటానికి రకరకాల అంశాలు తోడ్పడతాయి. వీటిలో సానుకూల ఆలోచనా ధోరణి ఒకటి. కాబట్టి 'చికిత్స తీసుకున్నాం, జబ్బు నయమైపోయింది' అని భావిస్తూ రోజువారీ పనులు యథావిధిగా చేసుకోవాలి. మళ్లీ వస్తుందేమోనని చింతించటం మంచిది కాదు. పని చేయకుండా రోజంతా ఇంట్లో కూర్చొని ఉంటే మళ్లీ క్యాన్సర్ వస్తుందేమోననే భయం నిరంతరం వెంటాడుతూ ఉంటుంది. జబ్బు తిరగ బెడుతుందేమోననే భయంతో అదేపనిగా దాని గురించే ఆలోచించేవారికి క్యాన్సర్ మళ్లీ వచ్చే అవకాశం 20% ఎక్కువగా ఉంటుండటం గమనార్హం. ఇది శాస్త్రీయంగానూ రుజువైంది. క్యాన్సర్ తిరగబెట్టే అవకాశం ఎక్కువగా ఉన్న రకాల్లోనూ 'నాకేమీ కాదు, మళ్లీ రాదు' అనే ధైర్యంతో, సానుకూల దృక్పథంతో వ్యవహరించేవారికి తిరగబెట్టడమనేది 30% తగ్గుతున్నట్టు గమనిస్తున్నాం. కాబట్టి ఇంతకుముందు రోజూ చేసే పనులు, ఉద్యోగాలు, వ్యాపారాల్లో నిమగ్నం కావాలి. జీవితంలో ఏదో ఒకటి సాధించాలనే లక్ష్యాన్నీ పెట్టుకోవాలి. దాన్ని సాధించటానికి ప్రయత్నిస్తుంటే మనసు దానికదే క్యాన్సర్ ఆలోచనల నుంచి మళ్లుతుంది.

సమతులాహారం: శరీరానికి అన్ని పోషకాలూ కావాలి. పిండి పదార్థం, ప్రొటీన్, కొవ్వు తగినంత మోతాదుల్లో అందాలి. కొందరు ప్రొటీన్ ఎక్కువగా తీసుకుంటూ మిగతావి తగ్గించుకుంటుంటారు. కొందరు పిండి పదార్థాలు చాలా తగ్గించేస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. అతిగా ఏది తీసుకున్నా, ఏది తగ్గించినా హానికరమే. తాజా పండ్లు, కూరగాయలు తినాలి. రకరకాల రంగులతో కూడిన వీటిల్లో క్యాన్సర్‌ను నిరోధించే అంశాలు దండిగా ఉంటాయి. పళ్లెంలో సగం వరకూ కూరగాయలు ఉండేలా చూసుకోవాలి. క్యాబేజీ, గోబీపువ్వు, బ్రోకలీ వంటి వాటిల్లో క్యాన్సర్ కణాలతో పోరాడే సల్ఫోరఫేన్ దండిగా ఉంటుంది. ఆకుకూరల్లోని యాంటీఆక్సిడెంట్లు, ఫోలేట్ దెబ్బతిన్న కణాలు మరమ్మతు కావటానికి తోడ్పడతాయి. ఇక పీచేమో పేగులను ఆరోగ్యంగా ఉంచుతుంది. మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందటానికి తోడ్పడుతుంది. ఇది పెద్దపేగు క్యాన్సర్ నివారణకు చాలా ముఖ్యం.

కంటి నిండా నిద్ర: సరిగా నిద్ర పట్టకపోవటం, స్మార్ట్‌ఫోన్ల వంటి పరికరాల నుంచి వెలువడే నీలి కాంతితో శరీరంలోని జీవగడియారం (సర్కేడియన్ రిథమ్) అస్తవ్యస్తమవుతుంది. ఇది కణాల ప్రవర్తన, రోగనిరోధక వ్యవస్థ పనితీరును మార్చొచ్చు. ఇవి చికిత్సతో నిర్మూలితమైన మునుపటి క్యాన్సర్ మార్గాలను ప్రేరేపితం చేయొచ్చు. ఫాలికుల్ స్టిమ్యులేటింగ్ హార్మోన్, ల్యూటినైజింగ్ హార్మోన్ల మీద నిద్ర, జీవగడియారం ప్రభావం చూపుతాయి. ఈ హార్మోన్లు అస్తవ్యస్తం కావటానికీ అండాశయ, రొమ్ము, ప్రోస్టేట్ క్యాన్సర్లకూ సంబంధముండటం గమనార్హం. కాబట్టి రాత్రిపూట కంటి నిండా నిద్రించాలి.

దురలవాట్లకు దూరం: చెడు అలవాట్లూ జీవగడియారాన్ని ప్రభావితం చేసి, క్యాన్సర్ తిరగబెట్టేలా చేయొచ్చు. గుట్కా, పాన్, వక్క పొడి, పొగ, మద్యం వంటి దురలవాట్లను మానేసినవారు మళ్లీ వాటి జోలికి వెళ్లొద్దు. పొగాకులో బోలెడన్ని క్యాన్సర్ కారకాలుంటాయి. ఇక మద్యంలోని ఆల్కహాల్ శరీరంలోకి వెళ్లిన తర్వాత అసిటాల్‌డిహైడ్‌గా మారుతుంది. ఇది డీఎన్‌ఏను దెబ్బతీసి, కణాలు మరమ్మతయ్యే ప్రక్రియను ఆపేస్తుంది. ఎప్పుడో అప్పుడంటే ఏమోగానీ రోజూ అదేపనిగా మద్యం తాగితే తిరిగి క్యాన్సర్‌కు జీవం పోస్తున్నట్టే.


వ్యాయామం కీలకం: రోజంతా పనిచేస్తానే ఉంటాం. ప్రత్యేకంగా వ్యాయామం అవసరమా? అని భావించటం తప్పు. రోజూ కనీసం 40 నిమిషాలైనా క్రమబద్ధంగా వ్యాయామం చేయాలి. కనీసం నడిచినా చాలు. వీలుంటే జిమ్‌కు వెళ్లొచ్చు. కండరాలను పెంచే వ్యాయామాలు ఎంతో మేలు చేస్తాయి. మరీ పెద్ద బరువులు ఎత్తాలనేమీ లేదు. శరీరం సహకరించినంత వరకూ బరువు వ్యాయామాలు చేయొచ్చు. ఇష్టమైన ఆటలేవైనా ఆడొచ్చు. క్యాన్సర్ చికిత్స తీసుకున్నాం కదాని వ్యాయామాలు, ఆటలు మానెయ్యొద్దు. యోగా, ధ్యానం, ప్రాణాయామం కూడా బాగా ఉపయోగ పడతాయి. వీటితో మానసిక ఒత్తిడి తగ్గుతుంది. ఆనందాన్ని కలిగించే రసాయనాలు విడుదలవుతాయి. ఇవన్నీ క్యాన్సర్ నివారణకు తోడ్పడేవే.

# పిల్లలకు పరోక్ష పొగ సెగ



సిగరెట్లు, బీడీలు, చుట్టలు కాల్చటమే కాదు.. వీటి నుంచి వెలువడిన పొగలను పీల్చినా ప్రమాదమే. ఇది పొగతాగేవారిలో మాదిరిగానే పిల్లల్లోనూ జన్యు వ్యక్తీకరణ తీరును మార్చేస్తున్నట్టు బార్సిలోనా ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ అధ్యయనంలో బయటపడింది. ఫలితంగా పెద్దయ్యాక జబ్బుల ముప్పు పెరుగుతుండటం ఆందోళనకరం. "బాల్యంలో పరోక్ష సిగరెట్ పొగ ప్రభావం అణు స్థాయిలో ముద్ర వేస్తున్నట్టు, పెద్దయ్యాక జబ్బులకు దారితీసేలా జన్యు వ్యక్తీకరణను మార్చేస్తున్నట్టు తేలింది" అని పరిశోధకులు చెబుతున్నారు. మన డీఎన్‌ఏలోని జన్యువులు శరీరానికి ఎలా పనిచేయాలో సూచిస్తాయి. పొగాకు పొగ వంటి పర్యావరణ అంశాలు వీటి వ్యక్తీకరణ మీద ప్రభావం చూపుతాయి. జన్యువులను ఆన్, ఆఫ్ చేసే ప్రక్రియల్లో డీఎన్‌ఏ మెథిలేషన్ ఒకటి. కొన్నిసార్లు ఇది ఆయా జన్యువుల వ్యక్తీకరణ జరగకుండా చేసి, జబ్బులకు దారితీస్తుంది. ఇతరులు వదిలిన సిగరెట్ పొగను పీల్చిన పిల్లల్లో జన్యుచట్రంలోని 11 భాగాల్లో డీఎన్‌ఏ మెథిలేషన్ ప్రక్రియ పెరిగినట్టు పరిశోధకులు గుర్తించారు. వీటిల్లో 6 జన్యువులు ఉబ్బసం, క్యాన్సర్ వంటి జబ్బులతో ముడిపడినవి కావటం గమనార్హం. ఇంట్లో గానీ బయట గానీ పిల్లలను తక్షణం సిగరెట్ పొగ ప్రభావానికి గురికాకుండా చూసుకోవాలని ఈ అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయి.

# పిల్లల్లో కిడ్నీ రాళ్లు.. కారణాలేంటి? ఎందుకొస్తాయి? వస్తే ఏం చేయాలి?



పెద్దల్లోనే ఎక్కువనుకునే కిడ్నీ రాళ్ల సమస్య ఇటీవల పిల్లల్లోనూ పెరిగిపోతోంది. పుట్టుకతో వచ్చే లోపాలు, జన్యుపరమైన అంశాలకు తోడు మారిపోతున్న జీవనశైలి, ఆహార అలవాట్లు,, అపరిశుభ్రత, విటమిన్ల లోపం వంటివెన్నో దీనికి ఆజ్యం పోస్తున్నాయి. పెద్దవారికైనా, పిల్లలకైనా కిడ్నీ రాళ్ల బాధ ఒకటే గానీ చిన్నారుల్లో దీన్ని గుర్తించటం కాస్త కష్టం. నొప్పి ఎక్కడ్నుంచి వస్తోందో, ఎటు నుంచి ఎటు వెళ్తోందో పిల్లలు సరిగా చెప్పలేరు. ఈ నేపథ్యంలో పిల్లల్లో కిడ్నీ రాళ్ల (%ఖఱఅవవ క్‌శీఅవం%), వాటితో కలిగే నష్టాలు, నివారణ మార్గాల గురించి తెలుసుకొని ఉండటం ఎంతైనా అవసరం.

ఎక్కడివీ రాళ్లు?

కిడ్నీలో రాళ్లు ఎక్కడో బయటి నుంచి వచ్చి చేరేవి కావు. లోపల తయారయ్యేవే. నీటిలో బాగా ఉప్పు వేసి మరిగించారనుకోండి. కొంతసేపటికి నీరంతా ఇగిరిపోయి.. గిన్నెలో ఉప్పు రాళ్లు ఏర్పడతాయి కదా. కిడ్నీ రాళ్లూ ఇలాగే తయారవుతాయని అనుకోవచ్చు. వీటికి మూలం- మూత్రంలో క్యాల్షియం, ఆక్సలేట్, యూరిక్ ఆమ్లం వంటి లవణాలు, ఖనిజాలు, రసాయనాల స్థాయిలు పెరగటం. దీంతో మూత్రం చిక్కబడుతుంది. క్రమంగా దానిలోని లవణాలు, రసాయనాలన్నీ చిన్న చిన్న స్ఫటికాలుగా గూడుకట్టుకోవటం ఆరంభిస్తాయి. ఇవి మొదట్లో కిడ్నీలో మూత్రం నిల్వ ఉండే వ్యవస్థలో పోగుపడి.. లోపలి పైపొర మీద అంటుకుంటాయి. దాని మీద మరొక స్ఫటికం.. దానిపై మరోటి.. ఇలా చేరుకుంటూ వచ్చి, చివరికి రాళ్ల మాదిరిగా గట్టిపడిపోతాయి.

లక్షణాలు

నొప్పి, మంట: మూత్రనాళం ఒంపుల్లో రాళ్లు చిక్కుపడితే తీవ్రమైన నొప్పి తలెత్తుతుంది. నొప్పి నడుం దగ్గర పక్కలవైపు మొదలై.. గజ్జల వరకూ పాకుతుంది. మూత్రం పోస్తున్నప్పుడు మంట పుట్టొచ్చు. చిక్కేంటంటే- నొప్పి పుడుతున్నా పిల్లలు ఎక్కడ్నుంచి వస్తుందో సరిగ్గా చెప్పలేకపోవటం. నొప్పి ఎక్కడ్నుంచి వస్తుందని అడిగితే కడుపు చూపిస్తారు. దీంతో ఒక్కోసారి అపెండిక్స్ వాపుగానూ పొరపడొచ్చు.

మూత్రం సరిగా రాకపోవటం: ముఖ్యంగా మూత్రనాళంలో గానీ మూత్రమార్గంలో గానీ రాయి చిక్కుపడితే మూత్రం పోయటానికి ఇబ్బంది పడతారు. కొన్నిసార్లు మూత్రంలో రక్తం కనపడొచ్చు.

వాంతి, వికారం: సమస్య తీవ్రంగా ఉంటే వాంతి, వికారం వేధిస్తుంటాయి.

తరచూ మూత్రం: పిల్లలు తరచుగా మూత్రం పోస్తుంటారు. కొంతమంది మగపిల్లలు అదేపనిగా అంగాన్ని పట్టుకొని లాగుతుంటారు.

జ్వరం: మూత్రం నిల్వ ఉండటం వల్ల ఇన్‌ఫెక్షన్ తీవ్రమైతే జ్వరం, చలి, బలహీనత ముంచుకురావొచ్చు. మూత్రం చెడువాసన కొట్టొచ్చు.

దుష్పరిణామాలతో జాగ్రత్త!

కిడ్నీ రాళ్లు ఇతరత్రా దుష్ప్రభావాలకూ దారితీస్తాయి.

మూత్రనాళంలో అడ్డంకి మూలంగా మూత్రం వెనక్కి వెళ్లిపోయి కిడ్నీ వాపు (హైడ్రోనెఫ్రోసిస్) తలెత్తొచ్చు. చివరికిది కిడ్నీ దెబ్బతినటానికీ దారితీయొచ్చు.

మూత్రాశయంలో మూత్రం ఎక్కువసేపు నిల్వ ఉంటే దీర్ఘకాల ఇన్‌ఫెక్షన్ (సిస్టైటిస్) రావొచ్చు.

మూత్రనాళం సంకోచించటం వల్ల ఇతర అవయవాలకు దారులు (ఫిస్టులా) ఏర్పడొచ్చు.

మూత్రాశయం ఉబ్బిపోయి తరచూ మూత్రం రావొచ్చు.

ప్రధానంగా నాలుగు రకాలు

కిడ్నీ రాళ్లలో ప్రధానంగా నాలుగు రకాలు కనబడుతుంటాయి.

క్యాల్షియం రాళ్లు: మూత్రంలో క్యాల్షియం, ఆక్సలేట్, యూరియా మోతాదులు అధికంగా.. సిట్రేట్ చాలా తక్కువగా ఉండడం వల్ల ఇవి ఏర్పడతాయి.

స్ట్రువైట్ రాళ్లు: వీటికి మూలం దీర్ఘకాల మూత్ర ఇన్‌ఫెక్షన్లు. ఇన్‌ఫెక్షన్ కారక బ్యాక్టీరియా మూత్రంలో రసాయనాల స్థాయిలను అస్తవ్యస్తం చేయటం వల్ల ఇవి పుట్టుకొస్తాయి.

యూరిక్ ఆమ్లం రాళ్లు: మూత్రంలో ఆమ్ల గుణం పెరిగినప్పుడు యూరిక్ ఆమ్లం ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఇది స్ఫటికాలుగా మారి రాళ్లు ఏర్పడతాయి.

సిస్టిన్ రాళ్లు: జన్యుపరంగా కొందరికి రక్తంలోని సిస్టిన్ రసాయనం సరిగా బయటకు వెళ్లిపోదు. ఫలితంగా దీని మోతాదులు పెరిగి రాళ్లుగా మారుతుంటాయి.

కారణాలు ఎన్నెన్నో..

పుట్టుకతో వచ్చే మూత్రకోశ లోపాల దగ్గర్నుంచి విటమిన్ల లోపం, ఆహార అలవాట్ల వరకూ ఎన్నెన్నో కారణాలు కిడ్నీరాళ్లకు దారితీయొచ్చు.

జన్యువరంగా: కొందరికి జన్యుపరంగా మూత్రంలో సిస్టిన్ ఎక్కువగా పోవటం రాళ్లకు దారితీయొచ్చు.

మూత్రం ఆపుకోవటం: టీవీ చూస్తూనో, ఆటల్లో మునిగిపోయో కొందరు చాలాసేపు మూత్రం ఆపుకొంటూ ఉంటారు. ఇలా మూత్రం నిల్వ ఉంటే ఇన్‌ఫెక్షన్లు రావొచ్చు. లవణాలు పెద్దమొత్తంలో పేరుకుపోవచ్చు. ఇవి రెండూ రాళ్లకు దారితీసేవే.

నీటిశాతం తగ్గటం: పిల్లలు ఏదో వ్యాపకంలో మునిగిపోయి నీళ్లు తాగటం మరచిపోతుంటారు. కొందరికి చిన్నపేగుల్లో ఇన్‌ఫెక్షన్ల మూలంగానూ ద్రవాలు సరిగా గ్రహించక ఒంట్లో నీటిశాతం తగ్గొచ్చు. దీంతో మూత్రం గాఢంగా, చిక్కగా తయారై.. రాళ్లు ఏర్పడే ప్రమాదముంది.

ఉప్పు ఎక్కువగా తినటం: ప్రస్తుతం జంక్‌ఫుడ్ తినటం ఎక్కువైంది. పేద కుటుంబాల్లో పచ్చళ్ల వంటివి తినటమూ ఎక్కువే. వీటిల్లో ఉప్పు (సోడియం) పెద్దమొత్తంలో ఉంటుంది. సోడియంతో మూత్రంలో క్యాల్షియం మోతాదులు పెరిగిపోయి రాళ్లకు దారితీయొచ్చు.

యూరిక్ ఆమ్లం పెరగటం: జంతువుల ప్రొటీన్ మూలంగా యూరిక్ ఆమ్లం ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. మూత్రంలో దీని మోతాదులు పెరిగిపోయి రాళ్లు ఏర్పడొచ్చు. మూత్రంలో ఎక్కువ ఆమ్ల స్వభావం ఉన్నా ఇవి ఏర్పడొచ్చు.

మూత్రనాళం ఇరుకు: కొందరికి పుట్టుకతో మూత్రనాళంలో కొన్నిచోట్ల సన్నగా, ఇరుకుగా ఉంటుంది. కొందరికి కిడ్నీ, మూత్ర నాళం కలుసుకునే చోట అడ్డంకి ఉండొచ్చు. దీంతో మూత్రం కిందికి సరిగా వెళ్లక, ఎక్కువసేపు నిల్వ ఉండటం వల్ల ఇన్‌ఫెక్షన్లు.. ఫలితంగా రాళ్లు ఏర్పడొచ్చు.

ఊబకాయం: ఇది ఇన్సులిన్ నిరోధకతకు దారితీస్తుంది. దీంతో మూత్రంలో క్యాల్షియం మోతాదులూ ఎక్కువవుతాయి. ఇది రాళ్ల ముప్పు పెరిగేలా చేస్తుంది.

కొన్ని మందులు: అసిటజోలమైడ్, యాంటాసిడ్లు, గ్లూకోకార్టికాయిడ్ల వంటి మందులూ రాళ్లకు దారితీయొచ్చు. మూర్ఛతో బాధపడేవారు ఎక్కువగా మందులు తీసుకోవటమూ కారణం కావొచ్చు.

వెన్నుపాము లోపాలు: వెన్నుపాము లోపాలతో పుట్టిన పిల్లల్లో మూత్రాశయం సరిగా పనిచేయకపోవటం మూలంగా మూత్రం ఎక్కువసేపు అక్కడే ఉండిపోయి రాళ్లు ఏర్పడొచ్చు.

నివసించే ప్రదేశం: భూగర్భంలో 'కఠిన జలం' ఉన్న ప్రాంతాల్లో నివసించేవారికి కిడ్నీ రాళ్లు వచ్చే అవకాశం ఎక్కువ.

పేదరికం: పేద పిల్లలకు కిడ్నీ రాళ్ల ముప్పు ఎక్కువ. దీనికి ప్రధాన కారణం అపరిశుభ్రత, సరైన పోషకాహారం తీసుకోకపోవటం.

విటమిన్ ఎ లోపం: విటమిన్ ఎ లోపం మూలంగా మూత్రాశయం లోపలి గోడ పొరలు పొరలుగా ఊడుతుంటుంది. వీటిల్లో ఏదైనా పొర ఎక్కడైనా స్థిరపడితే దాని చుట్టూ వ్యర్థాలు పేరుకుపోయి చివరికి రాయిగా మారుతుంది.

నిర్ధారణజి

నొప్పి, మూత్రం మంట వంటి లక్షణాలతోనే కిడ్నీ రాళ్లను అనుమానిస్తారు. రాళ్లు ఉన్నట్టు అనిపిస్తే తగు పరీక్షలు చేసి నిర్ధారణ చేయాల్సి ఉంటుంది.

ఎక్స్‌రే: ఇది ప్రధానమైన పరీక్ష. మూత్రకోశం ఎక్స్‌రే తీస్తే రాళ్లు ఎక్కడున్నాయనేది తెలుస్తుంది. 80% వరకు రాళ్లు ఎక్స్‌రేలోనే కనపడతాయి. అవసరమైతే అల్ట్రాసౌండ్, సీటీస్కాన్ పరీక్షలూ చేయాల్సి వస్తుంది. వీటితో రాయి ఉందా లేదా? ఉంటే ఎక్కడుంది? మూత్రపిండాలు ఎలా పనిచేస్తున్నాయి? ఎక్కడైనా ఉబ్బాయా? అనేవి బయటపడతాయి.

మూత్రపరీక్ష: రసాయనాలు, లవణాల మోతాదులు.. ఇన్‌ఫెక్షన్ కారక బ్యాక్టీరియా ఇందులో తెలుస్తాయి.

మూత్ర పరిమాణం: పిల్లల విషయంలో 24 గంటల వ్యవధిలో మూత్రం ఎంత వస్తోందనేది చూడటం చాలా ముఖ్యం.

థైరాయిడ్ పరీక్ష: అవసరమైతే పారాథైరాయిడ్ గ్రంథి పనితీరు పరీక్ష చేస్తారు.

చికిత్స- రాయిని బట్టి..

చిన్న చిన్న రాళ్లు వాటంతటవే బయటకొచ్చేస్తాయి. కొన్నిసార్లు ఇవి మూత్రనాళంలో, మూత్రమార్గంలో చిక్కుకొని పోవచ్చు. కొన్ని రాళ్లు.. ముఖ్యంగా ఆక్సలేట్ రకం రాళ్లు కిడ్నీ లోపలి పొర కణజాలానికి కరచుకొని అలాగే ఉండిపోతుంటాయి. పెద్దగానూ అవుతుంటాయి. అందువల్ల రాయి పరిమాణం, అది ఎక్కడుంది? ఇతరత్రా ఇబ్బందులేంటి? అనేవి దృష్టిలో పెట్టుకొని చికిత్స చేయాల్సి ఉంటుంది.

చిన్నరాళ్లకు..

సాధారణంగా 3-5 మి.మీ. సైజు రాళ్ల విషయంలో పెద్దగా కంగారు పడాల్సిన పనిలేదు. పిల్లలు నీళ్లు ఎక్కువగా తాగేలా చూసుకుంటే క్రమంగా బయటకు వచ్చేస్తాయి. అదే రాయి కాస్త పెద్దగా (5-8 మి.మీ.) ఉందనుకోండి. మూత్రపిండాలు సరిగా పనిచేస్తూ.. పెద్దగా వాపు, నొప్పి లేవనుకోండి. ఇలాంటి పరిస్థితుల్లో నొప్పి మాత్రలు, నార్కొటిక్స్‌తో మంచి ఉపశమనం లభిస్తుంది. వాంతి, వికారం తగ్గటానికి తగు మందులు వాడుకోవాల్సి ఉంటుంది.

పెద్దరాళ్లకు..

రాళ్లు 8 మి.మీ. కన్నా పెద్దగా ఉండి.. మూత్రపిండాల పనితీరు దెబ్బతింటూ.. తీవ్రమైన నొప్పి (రీనల్ కోలిక్), జ్వరం వేధిస్తున్నట్టయితే వెంటనే రాళ్లను బయటకు తీయాల్సి ఉంటుంది.

# అప్పుడు విలన్.. ఇప్పుడు హీరో.. మళ్లీ ఆర్సీబీని గెలిపించిన యశ్ దయాళ్




అది 2023 ఐపీఎల్ సీజన్.. ప్రత్యర్థి విజయానికి ఆఖరి ఓవర్‌లో 29 పరుగులు అవసరం. బంతిని అందుకొన్న యశ్ దయాళ్ ) ఫస్ట్ సింగిల్ ఇచ్చాడు. ఇక ఐదు బంతుల్లో 28 పరుగులు చేస్తేనే కోల్‌కతా నైట్‌రైడర్స్ గెలుస్తుంది. యశ్ అప్పుడు గుజరాత్ టైటాన్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. వరుసగా ఐదు బంతులను కేకేఆర్ బ్యాటర్ రింకు సింగ్ సిక్స్‌లుగా మలిచి తన జట్టును గెలిపించాడు. దీంతో యశ్ ఒక్కసారిగా విలన్‌గా మారిపోయాడు. పాపం నిద్రలేని రాత్రులు గడిపాడని స్వయంగా అతడి తల్లి ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం.

ఇప్పుడు 2025 ఎడిషన్.. చివరి ఓవర్‌లో సీఎస్కే విజయానికి కేవలం 15 పరుగులే అవసరం. టీ20ల్లో.. అదీ ఐపీఎల్‌లో పెద్ద కష్టమేం కాదు. క్రీజ్‌లో రవీంద్ర జడేజా, ఫినిషర్ ఎంఎస్ ధోనీ. యశ్ దయాళ్‌పై నమ్మకంతో ఆర్సీబీ అతడి (%=శీఎఖశ్రీ జష్టఖశ్రీశ్రీవఅస్త్రవతీం దీవఅస్త్రఖశ్రీబతీబ%) బంతినిచ్చింది. అనుకున్నట్లుగానే ధోనీని ఔట్ చేసి మరీ తన జట్టును గెలిపించాడు. 12 పరుగులే ఇచ్చి ఆర్సీబీ విజయంలో కీలక పాత్రతో హీరోగా మారిపోయాడు. గతేడాది సీఎస్కే ప్లేఆఫ్స్‌కు క్వాలిఫై కాకుండా చేయడంలో యశ్‌దే ప్రధాన పాత్ర. చివరి ఆరు బంతుల్లో 17 పరుగులు చేస్తే నాకౌట్‌కు వెళ్లేదే. అప్పుడు కూడా జడ్డూ, ధోనీనే క్రీజ్‌లో ఉన్నారు. మొదటి బంతికే సిక్స్ కొట్టినప్పటికీ తర్వాత ధోనీని బుట్టలో వేసి పెవిలియన్‌కు చేర్చాడు. చివరికి ఏడు పరుగులే ఇచ్చాడు. ఆర్సీబీని ప్లేఆఫ్స్‌కు చేర్చి.. సీఎస్కేను ఇంటికి పంపాడు.

ఆ ఏడాది ఓ పీడకల

ఐపీఎల్‌లో ఒక్క సీజన్‌లో అద్భుతంగా ఆడితే కాసుల వర్షం, అవకాశాలు వెల్లువెత్తుతాయి. అదే, దారుణంగా విఫలమైతే మాత్రం ఫ్రాంచైజీలు ఏమాత్రం పట్టించుకోవు. రెండేళ్ల కిందట గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడిన యశ్ పెద్దగా ప్రభావం చూపించలేదు. కోల్‌కతాపై ఒకే ఓవర్‌లో ఐదు సిక్స్‌లతో సహా 31 పరుగులు ఇచ్చి పెనుసంచలనంగా మారాడు. ఎన్నోనిద్రలేని రాత్రులు గడిపాడు. అదో పీడకలగా మారిందని యశ్ పలు సందర్భాల్లో వెల్లడించాడు. అక్కడి నుంచి కఠినంగా శ్రమించాడు.

ఆర్సీబీ రిటైన్ లిస్ట్‌లో చోటు..

గతేడాది (2024) రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు వచ్చాడు. ఆ సీజన్‌లో మొత్తం 15 మ్యాచులు ఆడిన యశ్ దయాళ్ 15 వికెట్లు తీసి ఫర్వాలేదనిపించాడు. ఐపీఎల్ మెగా వేలానికి ముందు ఆర్సీబీ రిటైన్ లిస్ట్‌లో అనూహ్యంగా అతడి పేరు ఉండటం క్రికెట్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. సిరాజ్‌ను కాదని.. యశ్‌ను అట్టిపెట్టుకోవడానికి కారణం ఏంటనేది అప్పుడు ఎవరికీ అంతుచిక్కలేదు. యశ్‌ను రూ.5 కోట్లకు ఆర్సీబీ రిటైన్ చేసుకుంది. ఇప్పుడు తన సత్తా ఏంటో నిరూపించాడు. ఎక్కువ వికెట్లు తీయకపోయినా.. అవసరమైన సందర్భాల్లో మ్యాచులను గెలిపించడం విశేషం. 11 మ్యాచుల్లో 10 వికెట్లు తీసిన అతడు మిడిల్, డెత్ ఓవర్లలో వికెట్లు తీయడం లేదా పరుగులను నియంత్రించి విజయాలను అందిస్తూ ముందుకు సాగుతున్నాడు. ఆరంభంలో జోష్ హేజిల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్ ఉండటంతో తొలి ఓవర్లు వేసే అవకాశం యశ్‌కు రావడం లేదు. ఇప్పుడు చెన్నై సూపర్ కింగ్స్ పై నాలుగు ఓవర్లు వేసి 41 పరుగులు ఇచ్చి కేవలం ఒక్క వికెట్ మాత్రమే తీశాడు. అయినా, చివరి ఓవర్ ప్రదర్శనతో మరోసారి వార్తల్లో నిలిచాడు.




# మ్యాక్సీ ఔట్.. 'బిగ్‌బాష్' టాప్ స్కోరర్‌తో పంజాబ్ రిప్లేస్‌మెంట్

: ఐపీఎల్ 2025 సీజన్ నుంచి పంజాబ్ కింగ్స్ ఆటగాడు గ్లెన్ మ్యాక్స్‌వెల్ వైదొలిగాడు. గాయం కారణంగా దూరమైన మ్యాక్సీ స్థానంలో ఆస్ట్రేలియా ఆటగాడు మిచెల్ ఓవెన్‌ను పంజాబ్ తీసుకుంది. రూ.3 కోట్లతో ఆ జట్టుతో జాయిన్ కాబోతున్నాడు. 2024-25 సీజన్‌లో బిగ్‌బాష్ లీగ్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. హొబర్ట్ హరికేన్స్ తొలిసారి విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. 200 స్ట్రైక్‌రేట్‌తో 452 పరుగులు చేశాడు.

ప్రస్తుతం మిచెల్ పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో పెషావర్ జాల్మీ జట్టుకు ఆడుతున్నాడు. బాబర్ అజామ్ కూడా ఇదే టీమ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. మిచెల్ ఎంపికపై ఐపీఎల్ కమిటీ ఓ ప్రకటన విడుదల చేసింది. " పంజాబ్ కింగ్స్ ఆల్‌రౌండర్ మిచెల్ ఓవెన్‌ను తీసుకుంది. గ్లెన్ మ్యాక్స్‌వెల్ స్థానంలో అతడిని ఎంపిక చేసింది. వేలికి గాయం కావడంతో ఐపీఎల్‌లో మిగతా మ్యాచులకు మ్యాక్సీ దూరం కానున్నాడు. ఆస్ట్రేలియాకు చెందిన మిచెల్ ఓవెన్ 34 టీ20లు ఆడి 646 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. పది వికెట్లూ తీశాడు" అని వెల్లడించింది.




# అసలైన ఛాంపియన్..: విరాట్ స్ట్రైక్‌రేట్‌పై ఇర్ఫాన్ పఠాన్

ఐపీఎల్ 2025 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టాప్‌లోకి దూసుకెళ్లింది. 11 మ్యాచుల్లో ఎనిమిది విజయాలు సాధించిన ఆర్సీబీ దాదాపు నాకౌట్ దశకు చేరుకున్నట్లే. ప్రస్తుతం 505 పరుగులు చేసిన కోహ్లీ ఆరెంజ్ క్యాప్ రేసులో ముందున్నాడు. అతడి స్ట్రైక్‌రేట్‌పై చాలా విమర్శలు వస్తున్నాయి. కోహ్లీ ఆటతీరు టీ20లకు పనికిరాదనే వ్యాఖ్యలూ వచ్చాయి. అయితే, వాటిని భారత మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ కొట్టిపడేశాడు. సీఎస్కేపై కోహ్లీ కేవలం 33 బంతుల్లోనే 62 పరుగులు చేశాడు.

"ఇప్పటి వరకు ప్రతి మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ యాంకర్ పాత్ర పోషించాడు. అంతకుముందు వరకు కనీసం 100 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు రాబట్టాడు. అతడు దూకుడుగా ఆడాలంటే ఆడేస్తాడు. సీఎస్కేపై 187 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు చేశాడు. తెల్ల బంతి క్రికెట్‌లో అతడు నిజమైన ఛాంపియన్. దూకుడుగా ఎలా ఆడాలో తెలుసు. నిలకడగా ఏ విధంగా పరుగులు రాబట్టాలో కోహ్లీకి బాగా తెలుసు" అని ఇర్ఫాన్ పోస్టు పెట్టాడు.

# వివాదాస్పదంగా బ్రెవిస్ ఎల్బీ నిర్ణయం.. జడేజా వాదించినా తప్పని తిరస్కరణ




ఒకే ఒక్క నిర్ణయం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారిపోయింది. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌మరో ఓటమికి ఆ నిర్ణయమే కారణమంటూ విమర్శలూ వచ్చాయి. సొంత మైదానం చిన్నస్వామి స్టేడియం వేదికగా సీఎస్కేతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తలపడింది. రెండు పరుగుల తేడాతో విజయం సాధించింది. అయితే, సీఎస్కే ( బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్ ఔటైన తీరు ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. అసలేం జరిగిందంటే?

చెన్నై ఛేదన సమయంలో 17వ ఓవర్‌ను ఆర్సీబీ బౌలర్ లుంగి ఎంగిడి సంధించాడు. ఆ ఓవర్ రెండో బంతికి ఆయుష్‌ను ఔట్ చేశాడు. తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన డెవాల్డ్ బ్రెవిస్‌కు లెగ్‌సైడ్ ఫుల్‌టాస్ సంధించాడు. ఎంగిడితోపాటు ఆర్సీబీ ఆటగాళ్లు అప్పీలు చేయగా.. అంపైర్ ఔట్ ఇచ్చేశాడు. పరుగు తీసే క్రమంలో బ్రెవిస్ (0) గమనించలేదు. కాసేపటికే బ్రెవిస్ గుర్తించి డీఆర్ఎస్ తీసుకునేందుకు నాన్‌స్ట్రైకర్ రవీంద్ర జడేజాతో చర్చించాడు. ఆలోగా 15 సెకన్ల డీఆర్ఎస్ టైమర్ సమయం ముగిసింది. డీఆర్ఎస్‌కు అనుమతి లేదంటూ ఫీల్డ్ అంపైర్ తిరస్కరించాడు. అయితే.. స్క్రీన్‌పై డీఆర్ఎస్ టైమరే కనిపించలేదంటూ అభిమానులు మండిపడుతున్నారు. ఆ తర్వాత రవీంద్ర జడేజా (%ఙుజఱఅఅతీఖ జీబఎవయిఖ%) తన అసహనం వ్యక్తం చేస్తూ అంపైర్‌తో చర్చించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సమీక్షలో మాత్రం బంతి వికెట్లకు చాలా దూరంగా వెళ్తున్నట్లు కనిపించడం గమనార్హం.

ఇలాంటప్పుడూ కాస్త వెసులుబాటు ఉండాల్సిందే..

కీలకమైన సమయంలో డీఆర్ఎస్ నిర్ణయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సీఎస్కే అభిమానులు నెట్టింట కామెంట్లు చేస్తున్నారు. రివ్యూలు తీసుకునేందుకు అదనంగా సమయం ఇస్తే బాగుంటుందని పేర్కొన్నారు. ఒకవేళ బ్రెవిస్ ఔట్ కాకుండా ఉండుంటే.. ఒక పరుగు వచ్చేదని, సీఎస్కే ఓడిపోయేది కాదని పలువురు వ్యాఖ్యలు చేశారు. ఈ సీజన్‌లో అంపైరింగ్ చాలా దారుణంగా ఉందనే వ్యాఖ్యలూ వినిపించాయి.

# దయాళ్ 'వర్క్ ఎథిక్' సూపర్: దినేశ్ కార్తీక్

: చెన్నై సూపర్ కింగ్స్‌పై 2 పరుగుల తేడాతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయం సాధించింది. యశ్ దయాళ్ చివరి ఓవర్‌ను అద్భుతంగా సంధించాడు. ధోనీని ఔట్ చేసి ఆర్సీబీ గెలుపులో కీలక పాత్ర పోషించాడు. యశ్ బౌలింగ్ ప్రదర్శనపై ఆర్సీబీ మెంటార్ దినేశ్ కార్తీక్ ( ప్రశంసల వర్షం కురిపించాడు. మ్యాచ్ అనంతరం యశ్ 'వర్క్ ఎథిక్'పై డీకే మాట్లాడాడు.

"వర్క్ ఎథిక్.. చాలా మంచి పదం. భారత్‌లో అత్యుత్తమ ఆటగాళ్లలో యశ్ దయాళ్ కూడా ఉంటాడు. యువ క్రికెటర్లలో మీరు ఓ విషయం గమనించి ఉంటారు. వారు తెరవెనుక చాలా కష్టపడి పనిచేస్తారు. యశ్ చాలా శ్రద్ధగా పనిచేసే క్రికెటర్. జట్టు సమావేశానికి వచ్చినప్పుడు ఓ కాగితం తీసుకొచ్చి ఏం చేయాలనుకుంటున్నాడో రాసుకునేవాడు. అమలు చేయడంలో కొన్నిసార్లు ఇబ్బందులు ఎదురు కావచ్చు. ప్రయత్నం చేయడంలో ఏమాత్రం వెనక్కి తగ్గడు. ఎప్పుడూ తనకంటూ ప్రణాళికలు ఉంటాయి. ప్రత్యేకమైన నైపుణ్యాలు ఉండటం వల్లే అతడిని రిటైన్ చేసుకొన్నాం" అని దినేశ్ కార్తీక్ వెల్లడించాడు.

దయాళ్‌ను పొగడటం వారికి నచ్చకపోవచ్చు: ఇయాన్ బిషప్

"ఈ కుర్రాడి గురించి నేనొక స్టోరీ చెబుదామనుకుంటున్నా. ఓ షాపింగ్ మాల్‌లో అతడిని కలిశా. నా దగ్గరకు వచ్చి పరిచయం చేసుకున్నాడు. కెరీర్ ఎలా సాగుతోంది? అని అడిగా. పెద్దగా సంతోషం ఏమీ లేదని బదులిచ్చాడు. రెండేళ్ల కిందట జరిగిన ఘటన నుంచి కోలుకుని ముందుకు సాగాలని ప్రతి కామెంటేటర్ చెప్పినవారే. నేనుకూడా అదే సలహా ఇచ్చా. దానికి స్పందిస్తూ 'యస్ సర్' అన్నాడు. సీఎస్కేతో మ్యాచ్‌లో తీవ్ర ఒత్తిడి ఉన్నప్పటికీ.. గొప్పగా పోరాడాడు. యశ్‌ను పొగడటం సీఎస్కే ఫ్యాన్స్‌కు నచ్చకపోవచ్చు.




Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy